thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 101 | కరీంనగర్ శుక్రవారం, 20 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర 22కు వాయిదా

న్యూఢిల్లీ : భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మరోసారి వాయిదా పడింది. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా శుభాంశు శుక్లాతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తున్న ఈ రోదసీ యాత్ర ఈ నెల 19న ఉంటుందని ఇస్రో ఇటీవల ప్రకటించింది. కానీ.. దీన్ని ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్టు యాక్సియం స్పేస్ బుధవారం వెల్లడించింది. సాంకేతిక కారణాలతో ఇప్పటికే ఈ మిషన్ పలుమార్లు వాయిదా పడింది. ఈ ప్రయోగం తొలుత మే 29న జరగాల్సి ఉంది. వాతావరణం అనుకూలించక వాయిదా పడింది.




## విచారణకు సహకరించని ప్రభాకర్ రావు.. సిట్ అధికారుల సంచలన నిర్ణయం

ఫోన్ ట్యాపింగ్ కేసులో A1గా ఉన్న మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు నాలుగోసారి ఇవాళ సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే పలుమార్లు ఆయనను విచారించిన అధికారులు తాజాగా ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ప్రభాకర్ రావుకు పలు ప్రశ్నలు సంధించారు. ఈ నేపథ్యంలోనే ఆయన సమాధానాలు చెప్పేందుకు మొండికేసినట్లుగా తెలుస్తోంది. పదే పదే అడిగినా.. చెప్పిన సమాధానం చెబుతున్నట్లుగా సమాచారం. దీంతో తీవ్ర అసహనానికి గురైన సిట్ అధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తునకు ప్రభాకర్ రావు ఏమాత్రం సహకరించడం లేదంటూ త్వరలోని సుప్రీం కోర్టును ఆశ్రయించనున్నారు. అదే కోర్టు ఆయనకు ఇచ్చిన రిలీఫ్ రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేయబోతున్నారు. అదేవిధంగా ప్రభాకర్ రావును కస్టోడియల్ విచారణ చేసేందుకు నాంపల్లి కోర్టులో సిట్ అధికారులు పిటిషన్ వేసే అవకాశం ఉంది.




## నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డికి బాధ్యతలేదు.. హరీష్‌రావు ఫైర్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ద్రోహం చేస్తోన్న రేవంత్‌రెడ్డిని ఏం చేసినా తప్పు లేదని అన్నారు. తెలంగాణకు నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డిది బాధ్యతారాహిత్యమేనని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి లెక్క తాము అడ్డదారిలో రాలేదు.. ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లమని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి ఏపీ బనకచర్ల ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. అఖిలపక్షా ఎంపీల సమావేశం పెట్టింది బనకచర్లను ఆపటానికా, కట్టుకోమని చెప్పటానికా అని ప్రశ్నించారు. ఇవాళ(గురువారం) తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీష్‌రావు మీడియాతో చిట్‌చాట్ చేశారు.గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీలు ఇచ్చి మిగిలిన నీటిని ఆంధ్రప్రదేశ్ తీసుకెళ్లమని చెప్పటానికి రేవంత్‌రెడ్డి ఎవరని మాజీ మంత్రి హరీష్‌రావు నిలదీశారు. గోదావరి, కృష్ణా నీళ్లను ఏపీ వాడుకోమని ఎలా చెబుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కి దాసోహం అయ్యారని విమర్శించారు.




తెలంగాణలో ఐదు ఎకరాల లోపు రైతులకు రైతు భరోసా నిధులు రిలీజ్ చేసింది ప్రభుత్వం. జూన్ 19న రూ.1189.43 కోట్లు రిలీజ్ చేసింది. 4 లక్షల 43 వేల మంది రైతుల ఖాతాలో డబ్బులు జమచేసింది వ్యవసాయ శాఖ. ఇప్పటి వరకు ప్రభుత్వం జూన్ 16న రెండెకరాల్లోపు రైతులకు, జూన్ 17న మూడెకరాల్లోపు,జూన్ 18న నాలుగు ఎకరాల్లోపు జూన్ 19న ఐదు ఎకరాల్లోపు రైతు భరోసా నిధులు జమ చేసింది. విడతల వారీగా డబ్బులు రిలీజ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు ఐదు విడుతల్లో ప్రభుత్వం 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 6404.7 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. ఇక భూమి పరంగా చూసుకుంటే 106 లక్షల ఎకరాకు పంట సహాయం చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్లు రిలీజ్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన సంగతి తెలిసిందే. ఎకరాలను చూడకుండా వ్యవసాయం చేసే ప్రతి రైతుకు రైతు భరోసా అందిస్తామని అన్నారు.

# గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులివ్వొద్దు

## కేంద్ర మంత్రి పాటిల్‌కు సీఎం బృందం విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులివ్వొద్దని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి బృందం కేంద్ర మంత్రితో భేటీ అయ్యారురు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనచర్ల ప్రాజెక్ట్‌పై అభ్యంతరాలను సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మరో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సీఆర్ పాటిల్‌కు వివరించారు. ఆ ప్రాజెక్ట్ తెలంగాణ హక్కులకు, ముఖ్యంగా గోదావరి నది జలాలపై హక్కులకు భంగం కలిగిస్తుందని తెలిపారు.

**తెలంగాణకు నీటి లభ్యత తగ్గుతుంది...** గోదావరి నీటిని ఏపీకి ఏకపక్షంగా మళ్లించడం వల్ల తెలంగాణకు నీటి లభ్యత తగ్గుతుందని, ఇది రాష్ట్రంలోని వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూ పుతుందని సీఎం బృందం పేర్కొంది. ఇక భద్రాచలం, మణుగూరు వంటి ప్రాంతాల్లో ముంపు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని విన్నవించారు. గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్‌తో ఏపీ ప్రభుత్వం గోదావరి నది జల వివాదాల ట్రైబ్యునల్ అవార్డు తోపాటు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం (2014)ను చంద్రబాబు ప్రభుత్వం ఉల్లంఘిస్తుందని పేర్కొన్నట్లుగా తెలుస్తోంది.

తమకు కనీస సమాచారం లేకుండానే.. ప్రాజెక్ట్‌కు సంబంధించి డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి పంపారని ఎట్టి పరిస్థితుల్లో పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని సీఎం రేవంత్ బృందం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కొరినట్లుగా సమాచారం.

**కేంద్ర మంత్రి వద్ద అభ్యంతరాలు చెప్పాం : మంత్రి ఉత్తమ్...** సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్‌పై తమ అభ్యంతరాలను కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు వివరించామని అన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తిగా ఏపీ పునర్విభజన చట్టానికి వ్యతిరేకమని తెలిపామని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి పాటిల్ కూడా తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారని వివరించారు.

అదేవిధంగా బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఇంకా పూర్తి డీపీఆర్ రాలేదని చెప్పారని తెలిపారు. తమకు కృష్ణా, గోదావరి జలాల్లో 1500



టీఎంసీలకు ఎన్‌వోసీ ఇస్తేనే.. గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుకు అభ్యంతరం లేదని కేంద్ర మంత్రికి చెప్పామని అన్నారు. ఏపీ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు వస్తున్నాయని.. తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం వేగం కనిపించడం లేదని కామెంట్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణకు అన్యాయం చేయబోమని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ హామీ ఇచ్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.




## తెలుగు రాష్ట్రాల మధ్య...

# చిచ్చుపెట్టిన బనకచర్ల!

## ఇరు రాష్ట్రాల భిన్న వాదనలు!

తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి మధ్య బనకచర్ల ప్రాజెక్ట్ చిచ్చు పెట్టింది. ఈ క్రమంలో అసలు ఏమిటీ ప్రాజెక్ట్ దీనిపై వివాదమేంటి? అన్నది ఇక్కడ తెలుసుకుందాం. ఆంధ్ర ప్రదేశ్ లో కూటమి (టిడిపి, జనసేన, బిజెపి).. తెలంగాణ కాంగ్రెస్ అధికారంలో ఉన్నాయి. ఈ పార్టీల మధ్య రాజకీయ విబేధాలు ఉన్నా ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి మధ్య మంచి సత్సంబంధాలు ఉన్నాయి. తెలుగు దేశం పార్టీయే రేవంత్ కు రాజకీయంగా లిఫ్ట్ ఇచ్చింది... అందుకే ఆయన ఇప్పటికీ చంద్రబాబుపై అభిమానం ప్రదర్శిస్తుంటారు. చంద్రబాబు కూడా టిడిపి తయారుచేసిన నాయకుడు తెలంగాణకు సీఎం కావడంపై ఆనందాన్ని వ్యక్తం చేస్తుంటారు చంద్రబాబు, రేవంత్ లను పొలిటికల్ సర్కిల్ లో గురుశిష్యులుగా పేర్కొంటారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల సీఎంల మధ్య సత్సంబంధాలు ఉండటంతో ప్రభుత్వాల మధ్య కూడా గత ఏడాదికాలంగా మంచి సంబంధాలే కొనసాగాయి. ఇద్దరు సీఎంలు స్వయంగా కలుసుకుని విభజన సమస్యలపై కూడా చర్చించుకున్నారు. ఇలా ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ మధ్య మళ్ళీ సంబంధాలు బలపడుతున్న సమయంలో బనకచర్ల ప్రాజెక్ట్ చిచ్చు పెట్టింది.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్ట్ పై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా తమ నీటిని తరలించు కుపోయేందుకు ఏపీ కుట్రలు చేస్తోందని తెలంగాణ అందోళన వ్యక్తం చేస్తోంది. కానీ ఏపీ మాత్రం ఎవరికీ ఉపయోగం లేకుండా సముద్రంలో కలుస్తున్న నదీ జలాలను వాడుకునేందుకే ఈ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నట్లు.. దీని వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం ఉండదని చెబుతోంది. ఇలా బనకచర్ల ప్రాజెక్ట్ ఇరురాష్ట్రాల మధ్య మరోసారి జలజగడానికి కారణమయ్యింది. ఈ ప్రాజెక్ట్ వివాదం చివరకు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలకు దారితీసింది.

**ఏంటీ బనకచర్ల ప్రాజెక్ట్ ఎందుకీ వివాదం?**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం, వృథాగా పోయే గోదావరి వరద జలాల్లో సుమారు 200 టీఎంసీల (ట్రిలియన్ క్యూబిక్ ఫీట్) నీటిని వినియోగించుకోవడం. రాయలసీమతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలు ఈ నీటిని మళ్లించాలన్నది ప్రణాళిక. ఈ ప్రక్రియ పోలవరం ప్రాజెక్టు నుంచి ప్రారంభమవుతుంది. ఇందు కోసం వివిధ రకాల కాలువలు, టన్నెల్స్ నిర్మించి, ఎత్తిపోతల పథకాల ద్వారా శ్రీశైలం కుడి కాలువలో కీలకమైన బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ వరకు గోదావరి వరద నీటిని తరలించడం ఈ ప్రాజెక్టులో ముఖ్యమైన అంశం. బనకచర్ల నుంచి నీటిని రాయలసీమ ప్రాంతానికి అందించడం ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఇలా నీటిని తరలించడం ఏపీ ప్రభుత్వానికి సాంకేతికంగా సవాలే.

**మూడు దశల్లో ఈ ప్రాజెక్టుకు ప్రణాళికలు:** ఈ మెగా ప్రాజెక్టును మూడు దశల్లో వివిధ సాంకేతిక నిర్మాణాలతో పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. ఈ మూడు దశల్లో నిర్మాణాలు ఎలా చేపట్టనున్నారు? అందుకు అవసరమైన ప్రణాళికలు ఏంటో తెలుసుకుందాం.

**మొదటి దశ - పోలవరం నుంచి కృష్ణా నది వరకు:** బనకచర్ల తొలి దశలో పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి వరద నీటిని కృష్ణా నదికి, అంటే ప్రకాశం బ్యారేజికి, తరలిస్తారు. అయితే, పోలవరం కుడి కాలువ సామర్థ్యం 17,500 క్యూసెక్కులు మాత్రమే. గోదావరి వరద నీటిని తరలించాలంటే కుడికాలువ సామర్థ్యాన్ని 38 వేల క్యూసెక్కుల ప్రవాహం తట్టుకునేలా పెంచాల్సి ఉంది. దీంతోపాటు, పోలవరం కుడి కాలువకు సమాంతరంగా 25 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం గల కొత్త వరద కాలువను తవ్వుతారు.

అధిక వరదలు వచ్చినప్పుడు నీటిని మళ్లించడానికి, ప్రస్తుత కాలువపై ప్రవాహ భారం తగ్గించడానికి కొత్త కాలువ ఉపయోగపడుతుందన్నది ప్రభుత్వ ఆలోచన. దీంతోపాటు, ఈ నీటిని ఎత్తిపోసే తాడిపూడి ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని పెద్ద ఎత్తున పెంచుతారు. అందుకు అవసరమైన అదనపు పంపులు, అధిక సామర్థ్యం గల మోటార్లు, పంపు హౌస్ విస్తరణ, కాలువల సామర్థ్యం పెంచడం వంటి పనులు చేపడతారు. ఈ మొదటి దశలో నీటి తరలింపు దాదాపు 175 కిలోమీటర్ల పొడవు ఉంటుంది.

**కృష్ణా నది నుంచి బొల్లపల్లి రిజర్వాయర్ వరకు రెండో దశ పనులు:** తొలి దశలో పోలవరం నుంచి వైకుంఠపురం బ్యారేజి లేదా ప్రకాశం బ్యారేజి వద్దకు గోదావరి వరద జలాలను తరలిస్తారు. రెండో దశలో ప్రకాశం బ్యారేజి నుంచి బొల్లపల్లి వద్ద ప్రస్తుతం బనకచర్ల ప్రాజెక్టులో ప్రతిపాదిస్తున్న బొల్లపల్లి వద్ద నిర్మించే రిజర్వాయర్ కు నీటిని తరలిస్తారు. ఈ ప్రాజెక్టులో బొల్లపల్లి రిజర్వాయర్ చాలా కీలకమైన నిర్మాణం. ఈ రిజర్వాయర్ను 152 టీఎంసీలను నిల్వచేసే సామర్థ్యంతో నిర్మించాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళిక. అయితే, దీన్ని 400 టీఎంసీల వరకు పెంచే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై మాత్రం ఇప్పటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. నీటిని నిల్వ చేయడానికి, ఇక్కడి నుంచి నీటిని తరలించడానికి బొల్లపల్లి రిజర్వాయర్ చాలా ముఖ్యమైనది. ఈ రెండో దశలో సుమారు 152 కిలోమీటర్ల వరకు గోదావరి వరద జలాలను తరలిస్తారు.

**బొల్లపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల రెగ్యులేటర్ వరకు మూడో దశ పనులు:** రెండు దశల్లో బొల్లపల్లి రిజర్వాయర్ వరకు నీటిని తరలించిన తర్వాత అక్కడి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ వరకు నీటిని తరలించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులో ఇదే సాంకేతికంగా సంక్లిష్టమైన దశగా నీటిపారుదల నిపుణులు చెబుతున్నారు. బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ నుంచే పెన్నా బెసిన్కు గోదావరి నీరు చేరుతుంది. ఈ దశలో ఓపెన్ కాలువలతోపాటు 20.50 కిలోమీటర్ల టన్నెల్ నిర్మించాల్సి ఉంది. ఆ తర్వాత 6.60 కిలోమీటర్ల దూరం అంటే సిద్ధాపురం వద్ద జంట సొరంగరాలు (ట్విన్ టన్నెల్స్) నిర్మిస్తారు. ఆ తర్వాత 17 కిలోమీటర్ల పైప్ లైన్స్ వేయాల్సి ఉంటుంది. ఈ మార్గంలో నల్లమల అటవీ ప్రాంతం, పర్వతాలతో నిండి ఉండటం, భూసేకరణ సమస్యలను అధిగమించడం కోసం ఈ టన్నెల్స్, పైప్ లైన్ ద్వారా నీటిని తరలించాలన్నది ప్రభుత్వ ఆలోచన. మూడో దశలో నీటిని 135 కిలోమీటర్లు తరలించాల్సి ఉంటుంది.

**400 కిలోమీటర్ల కాలువలు, తొమ్మిది లిఫ్టులు, నాలుగువేల మెగావాట్ల విద్యుత్:** గోదావరి వరద జలాలను పెన్నా బెసిన్కు తరలించేందుకు మొత్తం మూడు దశలు కలిపి దాదాపు 400 కిలోమీటర్ల వరకు ఓపెన్ కాలువలు, టన్నెల్స్, పైప్ లైన్స్ వేయాల్సి ఉంది. బనకచర్ల ప్రాజెక్టులో మూడు దశల్లో 9 లిఫ్టులను ఏర్పాటు చేసి నీటిని ఎత్తిపోయాల్సి ఉంది. ప్రతీ దశలో మూడు లిఫ్టులు ఏర్పాటు చేయాలి. నీటిని ఎత్తిపోసేందుకు దాదాపు 4 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందని నీటి పారుదల శాఖ ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.



# జస్టిస్ వర్మ ఇంట్లో భారీగా సొమ్ము

జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో డబ్బు బయటపడిన మాట వాస్తవమే అని ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్ నిర్ధరించింది. ఆయన దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న వేళ అధికారిక నివాసంలో పెద్ద సంఖ్యలో కాలిపోయిన నోట్ల కట్టలను గుర్తించారు. దీనిపై ప్యానెల్ తాజాగా 60 పేజీల నివేదిక ఇచ్చింది. ఇందులో 30 తుగ్లక్ క్రిసెంట్ రోడ్డులోని న్యాయమూర్తి అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో నోట్ల కట్టలను గుర్తించడం వాస్తవమేనని పేర్కొంది. ఆ సొమ్ములున్న స్టోరూమ్ నియంత్రణ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జస్టిస్ వర్మ లేదా అతని కుటుంబసభ్యుల ఆధీనంలోనే ఉందని అభిప్రాయపడింది. దీనికి సంబంధించి బలమైన ఆధారాలు ఉన్నట్లు వెల్లడించింది. అగ్నిప్రమాదంలో దగ్ధమైన నోట్లను మార్చి 15వ తేదీ తెల్లవారుజామున అక్కడినుంచి తొలగించడమే బలమైన సాక్ష్యమని వెల్లడించింది.

అసలు ఈ నోట్లను జస్టిస్ వర్మ లేదా ఆయన కుటుంబసభ్యుల స్టోరూమ్‌లో ఉంచడం అనుమానాస్పదంగా ఉందని అభిప్రాయపడింది. కాలిపోయిన నోట్లు చిన్న నోట్లు లేదా తక్కువ మొత్తం కాదని వెల్లడించింది. తమకు లభించిన ఎలక్ట్రానిక్, ప్రత్యక్ష ఆధారాలను దృష్టిలో ఉంచుకొని సీజేఐ ఆరోపణలు నిజమేనని తేలుతోందని నివేదిక పేర్కొంది. అలహాబాద్ హైకోర్టు జస్టిస్‌గా ఉన్న వర్మను విధుల నుంచి తొలగించడానికి ఈ ఆధారాలు సరిపోతాయని అభిప్రాయపడింది.

**నా జీవితంలో అంత సొమ్ము చూడలేదు: సాక్షి...** జస్టిస్ వర్మపై దర్యాప్తులో భాగంగా 10 రోజులపాటు 55 మంది సాక్షులను విచారించారు. వారి వాంగ్మూలాలను వీడియోలో చిత్రీకరించారు. ఈసందర్భంగా ఓ సాక్షి మాట్లాడుతూ "నేను ఆ గదిలోకి వెళ్లాను. అక్కడ కుడివైపు నేలపై రూ.500 నోట్ల కట్టలు భారీగా పడున్నాయి. షాకైపోయాను. నా జీవితంలో నేలపై అంత మొత్తం సొమ్ము పడి ఉండటాన్ని చూడలేదు" అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో జస్టిస్ వర్మ కుమార్తె దియా, ఆయన ప్రైవేటు కార్యదర్శి రాజేందర్‌సింగ్ కార్కి తదితరులను కూడా ప్యానెల్ విచారించింది. అగ్నిమాపక సిబ్బంది తమ నివేదికలో నోట్ల వివరాలు నమోదు చేయకుండా రాజేందర్‌సింగ్ అడ్డుకొన్నట్లు తెలిసింది. కానీ, ఆ ఆరోపణలను ఆయన తిరస్కరించారు. ఈ ఏడాది మార్చి 14న దిల్లీలోని జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా.. ఈ ఘటనలో భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. ఈ ఘటన అనంతరం మార్చి 28న సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ యశ్వంత్‌వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసి.. ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించొద్దని సూచించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. ఇది నిజమేనని ధ్రువీకరించిన త్రిసభ్య కమిటీ సంబంధిత నివేదికను సుప్రీంకోర్టుకు అందించింది.




# విమాన ప్రమాదం.. ధ్వంసమైన బ్లాక్‌బాక్స్ విదేశాలకు.!

గుజరాత్‌లో ఇటీవల జరిగిన ఘోర విమాన ప్రమాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి టేకాఫ్ అయిన ఎయిరిండియా విమానం కొద్దిసేపటికే కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ విమానానికి సంబంధించిన అత్యంత కీలకమైన బ్లాక్‌బాక్స్ పంపించేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

ఈ సమాచారాన్ని అధికార వర్గాలు తెలిపినట్లు పలు మీడియాల్లో కథనాలు వెల్లడిస్తున్నాయి. ప్రమాదం అనంతరం స్థానిక బీజే వైద్య కళాశాల భవనంపై నుంచి అధికారులు దీన్ని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ప్రమాద సమయంలో అది దెబ్బతిన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

దీంతో దానినుంచి మెరుగైన సమాచారం రాబట్టేందుకు అమెరికాలోని వాషింగ్టన్ డీసీలోని జాతీయ రవాణా భద్రతా బోర్డుకు పంపే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. యూఎస్‌కు పంపే సమయంలో ప్రొటోకాల్స్ పాటించడంతో పాటు భారత్‌కు చెందిన అధికారుల బృందం కూడా బ్లాక్‌బాక్స్‌తో పాటు వెళ్తుందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

**అహ్మదాబాద్ విమాన ప్రమాదం... బీమా సంస్థలకు చిక్కులు...** ఈనెల 12న లండన్ వెళ్లేందుకు అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన విమానం గాల్లోకి ఎగిరిన వెంటనే ఓ మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై కూలిపోయింది. ఈ ప్రమాదంలో 241 మంది ప్రయాణికులతో సహా మొత్తం 270 మంది ప్రాణాలు కోల్పోయారు. విమాన ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు బ్లాక్‌బాక్స్‌లోని సమాచారం కీలకం. దీనినుంచి సమాచారం రాబట్టేందుకు నిపుణులు నిమగ్నమయ్యారు.



# ఫైర్ టెస్టులో పేలిపోయిన స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్

అంతరిక్ష రంగంపై మరింత పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తోన్న అమెరికా వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్ కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థకు ఇటీవల వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఈ సంస్థకు చెందిన పదో స్టార్‌షిప్ ఫైర్ టెస్టు సమయంలో పేలిపోయింది. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. స్పేస్‌ఎక్స్ బుధవారం (స్థానిక కాలమానం ప్రకారం) అమెరికాలో టెక్సాస్‌లోని పరీక్ష కేంద్రం వద్ద ఈ స్టార్‌షిప్‌ను పరీక్షించేందుకు ఉంచింది. ఈక్రమంలో అది పరిశీలన దశలోనే పేలిపోయింది. స్పేస్‌ఎక్స్‌తో సహా స్థానిక అధికారులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కాగా.. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని టెక్సాస్ అధికారులు తెలిపారు. స్థానిక అధికారులతో కలిసి ఈ ప్రాంతాన్ని సురక్షితంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని స్పేస్‌ఎక్స్ తెలిపింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇదిలాఉండగా... ఇటీవల స్పేస్‌ఎక్స్ సంస్థకు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సుదూర అంతరిక్ష యాత్రల కోసం రూపొందించిన స్టార్‌షిప్ మెగా రాకెట్ ఇప్పటికే మూడుసార్లు విఫలమైంది. తొలుత నింగిలోకి విజయవంతంగా దూసుకెళ్లినా.. ఆ తర్వాత ఈ భారీ రాకెట్లు గాల్లోనే పేలిపోయాయి.



# గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు చట్టవ్యతిరేకం

## 'గోదావరి-బనకచర్ల అంశం'.. త్వరలో ఇద్దరు సీఎంల భేటీ ఏర్పాటు చేస్తామన్నారు: ఉత్తమ్

దిల్లీ: గోదావరి-బనకచర్ల చట్ట వ్యతిరేకమైన ప్రాజెక్టు అని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టుపై దిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు అభ్యంతరాలను తెలియజేసిన అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. "బనకచర్లపై ఆందోళనలను కేంద్ర మంత్రికి వివరించాం. ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రజలు, రైతుల్లో ఆందోళనలు ఉన్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి చెప్పారు. కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా చూడమని కోరాం. ఇచ్చంపల్లి-నాగార్జునసాగర్ లింక్‌తో పెన్నా బేసిన్‌కు నీరు తీసుకెళ్లొచ్చు. ఇచ్చంపల్లి-సాగర్ అనుసంధాన అంశంపై చర్చకు సిద్ధమని చెప్పాం. త్వరలో ఇరు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి పాటిల్ హామీ ఇచ్చారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఇంకా అనుమతులు లభించలేదు. ఏపీ ప్రాజెక్టులకే త్వరగా అనుమతులిస్తున్నారని చెప్పాం. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుకు నిధులివ్వాలని కోరాం. రాష్ట్ర ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశాం. పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క సారక్క, తుమ్మిడిహట్టికి కేటాయింపులు కోరాం" అని ఉత్తమ్ తెలిపారు.

# రాహుల్ ఒత్తిడితోనే కేంద్రం కులగణనకు అంగీకరించింది: మంత్రి పొన్నం



హైదరాబాద్: రాబోయే తరానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిక్సూచి అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆయన ఒత్తిడి మేరకే కేంద్ర ప్రభుత్వం కులగణనకు అంగీకరించి గెజిట్ విడుదల చేసిందని చెప్పారు. రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా గాంధీభవన్‌లో వేడుకలు నిర్వహించారు. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ అనిల్‌కుమార్‌తో కలిసి పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆలోచన మేరకే కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కులగణన చేసిందని పొన్నం అన్నారు. అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ దేశ ప్రజల కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీలో మాత్రమే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. బలహీనవర్గాలకు చెందిన మంత్రిగా పొన్నం, పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్, దళిత మంత్రిగా తాను నిదర్శనమన్నారు. సామాజిక న్యాయంలో భాగంగా సామాన్య కార్యకర్త నుంచి మంత్రినయ్యానని చెప్పారు. మంత్రిగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలకు హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు.

# ఆ ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలుగుతా: ఎంపీ ఈటల



హైదరాబాద్: కాళేశ్వరం విషయంలో తనపై బురదచల్లడం సరికాదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. చేస్తున్న ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలుగుతానని చెప్పారు. "కాళేశ్వరం అంశంలో నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. కమిషన్ విచారణ త్వరగా ముగుస్తుందన్న నమ్మకం లేదు. దీనిపై సీబీఐ విచారణ జరగాలి. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి ప్రజలకు నీళ్లివ్వాలి. ఆ ప్రాజెక్టు కేసీఆర్ నిర్మించింది కాదు.. ప్రాణహిత-చేవెళ్ల రీడిజైన్ చేసి కాళేశ్వరం కట్టారు. అన్ని సమీక్షల తర్వాతే దానిపై కొలిక్కి వచ్చాం" అని ఈటల తెలిపారు.



# దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్య

హైదరాబాద్: నగరంలోని దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్యకు పాల్పడింది. మృతిచెందిన యువతిని సుష్మ(27)గా గుర్తించారు. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ అడ్డగుట్టలో సుష్మ నివాసముంటోంది. బుధవారం హైటెక్ సిటీలోని ఆఫీస్‌కి పని నిమిత్తం ఆమె వెళ్లింది. రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆఫీస్ మేనేజర్‌కు తండ్రి అంజయ్య కాల్ చేశారు. రాత్రి 10.30 గంటలకే ఆమె బయల్దేరినట్లు మేనేజర్ తెలిపారు. కుమార్తె కనిపించడం లేదంటూ ఉదయం 4 గంటలకు మాదాపూర్ పీఎస్‌లో అంజయ్య ఫిర్యాదు చేశారు. దుర్గంచెరువులో మృతదేహం తేలియాడుతోందని గురువారం ఉదయం 7 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు.. మృతదేహం సుష్మదిగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సుష్మ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# దత్తత గ్రామం వాసాలమర్రిని కేసీఆర్ ఆగం చేశారు: మంత్రి పొంగులేటి



తుర్కపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలను ఆయన పంపిణీ చేశారు. కేసీఆర్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారని.. అభివృద్ధి చేస్తానని చెప్పి ఆగం చేశారని విమర్శించారు. "ఇక్కడి ప్రజలకు నాడు ఇచ్చిన హామీలేవీ కేసీఆర్ నెరవేర్చలేదు. రాష్ట్రానికే వాసాలమర్రిని రోల్ మోడల్ చేస్తానన్నారు. కానీ ఈ చిన్న గ్రామాన్ని ఎలాంటి పరిస్థితికి తీసుకొచ్చారో ప్రత్యక్షంగా చూశాం. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామంటూ బొమ్మలు చూపించి ఓట్లేయించుకున్నారు. ఏ గ్రామంలోనూ ఇళ్లు కట్టలేదు. భారాస ప్రభుత్వం చేసిన అప్పులకు రూ.6వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం" అని పొంగులేటి అన్నారు.



# ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ తయారీ పనులు ప్రారంభం

గణేశ్ చతుర్థి వచ్చిందంటే అందరి చూపు ఖైరతాబాద్ బడా గణేశుడి మీదే ఉంటుంది. కర్రపూజ నుంచి నిమజ్జనం దాకా ప్రతిదీ ప్రత్యేకంగానే జరుగుతుంటాయి. ఈ ఏడాది వినాయక చవితి కోసం ఇప్పటికే కర్రపూజ, పోస్టర్ రిలీజ్ పూర్తయింది. విగ్రహ తయారీ పనులూ ప్రారంభమయ్యాయి. మరో 78 రోజుల్లో విఘ్నేశ్వరుడి పూర్తి రూపం సిద్ధమవుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సారి ప్రత్యేకమైన సందేశంతో 69 అడుగుల్లో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా లంబోదరుడు దర్శనమివ్వనున్నారు.

# ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడు కోలాచలం - జూన్ 20....కోలాచలం శ్రీనివాసరావు వర్ధంతి


Kolachalam Srinivasa Rao

ఆంధ్ర నాటక రంగానికి ఆధునిక తను ప్రసాదించిన వారిలో ఎన్నదగిన వారు కోలాచలం శ్రీనివాసరావు, ధర్మవరం రామ కృష్ణమా చార్యులు. ఆధునిక ఆంధ్ర నాటక రంగానికి విశిష్ట సేవలు అందించిన ఈ ఇరువురు బళ్ళారికి చెందిన వారే కావడం విశేషం. కోలాచలం శ్రీనివాసరావు (మార్చి 13, 1854 – జూన్ 20, 1919) ప్రముఖ న్యాయవాది. నాటక కర్త, నాటక శాల నిర్మాత, కవి, పరిశోధ కులు, బహు భాషా వేత్త, సంఘ సంస్కర్త, తెలుగు సాహిత్య సేవకులు. కోలాచలం శ్రీనివాసరావు తెలుగు నాట సాహిత్యానికి, తెలుగు నాటక రంగానికి చేసిన సేవ అనన్య సామాన్యం. అనితర సాధ్యం. తెలుగు నాటక కర్తలలో ఉత్తమ శ్రేణి నాటక కర్తగా ప్రసిద్ధులు, నాటక రచనా ప్రయోగాల్లో విజయం సాధించిన వారు. సంఘంలోని దురాచారాలను నిర్మూలించి సంఘ సంస్కరణం చేయడం, వినోదంతో పాటు ప్రజలకు నీతిని బోధించడం, హాస్యం సమ్మిళితం చేసి ప్రేక్షకుల హృదయాలను చూరగొనడం, వీటికి తోడు ప్రధానంగా ప్రజలకు చారిత్రక నాటకాల ప్రదర్శనవల్ల చరిత్ర తెలియ చేయాలన్నది ఆయన లక్ష్యాలు. చారిత్రక రచనలు, సంఘానికి సంబంధించిన రచనలు సమాజానికి అత్యవ సరమని భావించి ఆ దిశగా కృషి చేశారు. అందుకే ఆయన చారిత్రక నాటక పితా మహునిగా పేరెన్నిక గన్నారు. తెలుగు నాటక రంగ అభ్యుదయ, వికాసాలకు తమ జీవితాన్ని అంకితం చేసిన కోలాచలం శ్రీనివాసరావు మల్లినాథ సూరి వంశీయులు. ఆయన పూర్వీకులు విజయనగర సంస్థాన పండి తులు. నాటక సాహిత్యాన్ని స్వాధ్యయనం చేశారు. ఆయన 1854 సంవత్సరం, మార్చి 13న బళ్ళారి జిల్లాలోని హంపి వద్ద కమలాపురం గ్రామంలో అచ్చమ్మ, సేతుపతి శాస్త్రి దంపతులకు జన్మించారు. చిన్న వయసులోనే తెలుగు, కన్నడ, సంస్కృత మరియు ఆంగ్ల భాషలలో పట్టు సాధించారు. 1876లో ఎఫ్.ఏ పరీక్ష ఉత్తీర్ణులై, అనంత పురం జిల్లా గుత్తిలో రెవిన్యూ ఇన్స్పెక్టరుగా పనిచేశారు. 1881లో అనంతపుర మండలం డిప్యూటి కలెక్టరు దగ్గర దివానుగా ఉద్యోగం చేశారు.1888లో జాతీ యోద్యమ పిలుపునందుకొని ఉద్యోగం వదిలి రెండవ తరగతి ప్లీడరు పరీక్షలో ఉత్తీర్ణుడై బళ్ళారి లో న్యాయవాద వృత్తిని చేపట్టారు. అప్పటి నుండి ఆయన సాహితీ వ్యాసంగంకు అంకితం అయినారు. వృత్తిరీత్యా న్యాయవాది అయినా, నాటక కళ అంటే అత్యంత అభిమానం. రాసిన తళ్ళికోట యుద్ధంలో కీర్తి శేషుడైన రామరాజు కథ ఆధారంగా ఆయన రామరాజు చరిత్ర చారిత్రక రచన చేశారు. మైసూరు రాజ్యము, ప్రతాపాక్బరీయము కూడా చారిత్రక రచనలే. ఆయన భారతదేశం లోనే కాక ఇతర దేశాల నాటకాల చరిత్రలను పరిశోధించి ప్రపంచ నాటక చరిత్ర (ది డ్రమాటిక్ హిస్టరీ ఆఫ్ ది వర్ల్డ్) అనే గ్రంథాన్ని ఆంగ్ల భాషలో రాశారు. తెలుగులో సునందినీ పరిణయము, సుఖమంజరీ పరిణయము మొదలైన నాటకాలు రాశారు. తెలుగులో మొదటి చారిత్రక నాటకం రాసింది కూడా ఆయనే. భగవద్గీత 18 అధ్యాయాలు సవిమర్శగా పఠించి ప్రతి అధ్యాయాన్ని వచనంగా ప్రకటించారు. వ్యవహారిక భాషోద్యమానికి వ్యతిరేకుడు. చారిత్రక నాటకాలకు జీవం పోసి, ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడన్న పేరు గాంచడమే కాకుండా, సుమనోరమా సభా నాటక సంస్థను స్థాపించిన, తెలుగు నేలపై ప్రప్రథ మంగా వాణీ విలాస నాటక శాలను బళ్లారిలో నిర్మించిన ఘనత కూడా ఆయనదే. దేశంలో తొలి ప్రపంచ నాటక చరిత్ర అనే గ్రంథం ఆంగ్లంలో రచించిన గొప్పతనం ఆయనకే చెందుతుంది. భారతీయ నాటక సాహిత్య నిర్మాతలలో ప్రాతః స్మరణీయులుగా నిలిచి పోయారు కోలాచలం శ్రీనివాసరావు. ఆయన , 1919 జూన్ 20న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# దేశంలోనే అగ్రస్థానంలో శంషాబాద్ విమానాశ్రయం




హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మరోసారి తన ప్రాముఖ్యతను చాటుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన విమానాశ్రయాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చుతూ కొత్త రికార్డును నెలకొల్పింది. మే 2025 నెలలో 27,91,217 మంది దేశీయ మరియు అంతర్జాతీయ ప్రయాణికులు ఈ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ద్వారా రాకపోకలు సాగించారు. ఇది ఇప్పటివరకు నమోదైన అత్యధిక సంఖ్యగా నిలిచింది.

**–ప్రయాణికుల సంఖ్యలో ఢిల్లీ కంటే ముందంజ!...** జీఎంఆర్ సంస్థ ప్రకారం ఈ విజయంతో శంషాబాద్ విమానాశ్రయం దేశ రాజధాని ఢిల్లీ విమానాశ్రయాన్ని కూడా పక్కన పెట్టింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన ప్రయాణికుల కంటే ఈ ఏడాది భారీ వృద్ధి నమోదైంది. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నూతన హైటెక్ వసతులతో, వేగవంతమైన సేవలతో విశ్వసనీయతతో ప్రయాణికులను ఆకట్టుకుంటోందని అధికారులు చెప్తున్నారు.

**–అంతర్జాతీయ కనెక్టివిటీ పెరిగింది...** ఇటీవలే ప్రారంభించిన అనేక అంతర్జాతీయ మార్గాలు, ముఖ్యంగా మిడిల్ ఈస్ట్, యూరప్, అమెరికా దేశాలకు నేరుగా వెళ్లే విమానాల రాకపోకలు పెరగడంతో, విదేశీ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలుగు వాసులు, యూరప్, అమెరికాలో ఉన్న NRIలు తమ ప్రయాణాలకు ప్రధానంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టునే ఎంచుకుంటున్నారు.

**– దేశీయ మార్గాల్లోనూ రికార్డు....** విశాఖపట్నం, బెంగళూరు, ముంబై, చెన్నై, ఢిల్లీ వంటి నగరాలకు విస్తృతంగా విమానాలు అందుబాటులో ఉండటం వల్ల దేశీయ ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగిందని అధికారులు చెప్పారు.

ముఖ్యంగా వేసవి సెలవులు, పండుగ కాలంలో ప్రయాణికుల సంఖ్య తక్కువయే అవకాశమే లేదని పేర్కొన్నారు.

**–ఆధునిక వసతులు.. ప్రయాణికులకు మరింత ఆకర్షణ...** శంషాబాద్ విమానాశ్రయం అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం నిర్మించబడింది. త్వరిత పార్కింగ్ సిస్టం, స్మార్ట్ చెకిన్ కౌంటర్లు, సెక్యూరిటీ క్లియరెన్స్ వేగవంతం, ఫుడ్ కోర్టులు, షాపింగ్ మాల్స్, లగ్జరీ లౌంజ్‌లు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి.

ఇటీవలే ప్రారంభించిన కొత్త డిపార్చర్ టెర్మినల్ మరింత భద్రత, వెసులుబాటు కల్పిస్తోంది.


**శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలు...** ప్రయాణికుల సంఖ్య పెరగడంతో విమానాశ్రయంలో ఉద్యోగ అవకాశాలు కూడా పెరిగాయి.

సెక్యూరిటీ, కస్టమర్ కేర్, గ్రౌండ్ హ్యాండ్లింగ్, మెంటినెన్స్ విభాగాల్లో నూతన ఉద్యోగుల నియామకం జరుగుతోంది. ఇది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది.

**– ప్రభుత్వ ప్రోత్సాహంతో ముందుకు...** తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. శంషాబాద్ విమానాశ్రయం సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు, కొత్త రన్‌వే, ఫ్రేట్ టెర్మినల్ నిర్మాణ పనులు చేపట్టారు. ఫలితంగా ద్రవ్యోల్బణం లేకుండా సరుకు రవాణా సౌకర్యాలు కూడా మెరుగుపడనున్నాయి. హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోనే అత్యుత్తమ ఎయిర్‌పోర్టుల జాబితాలో నిలిచింది. ప్రయాణికుల సంఖ్య, వసతులు, సేవల పరంగా దేశ రాజధాని ఢిల్లీ విమానాశ్రయానికి సవాల్ విసురుతోంది.

రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు స్థాపించేందుకు సిద్ధంగా ఉంది. తెలంగాణ గర్వించదగ్గ ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చెందుతున్న ఈ విమానాశ్రయం ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా మారనుంది అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

# బనకచర్ల ప్రాజెక్టుపై తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం .... కేంద్ర ప్రభుత్వ చొరవ అనివార్యం



రాయలసీమ ప్రాంతానికి సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం (Banakacharla Lift Irrigation Scheme) ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాస్పద అంశంగా మారింది. రాష్ట్రవిభజన తర్వాత గోదావరి%–%కృష్ణా జలాల వినియోగంపై తెలుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న ఉద్వేగపూరిత పోరాటానికి బనకచర్ల ప్రాజెక్టు తాజా ఉదాహరణగా మారింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి%–%బనకచర్ల లింక్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రస్తుతం తీవ్ర వివాదానికి దారి తీసింది. ఒకవైపు ఇది రాయలసీమ సాగునీటి అవసరాల తీర్చడానికని ఏపీ వాదిస్తుండగా, మరోవైపు అనుమతులు లేకుండానే ప్రాజెక్టును ప్రారంభించడంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తెలంగాణ ఇప్పటికే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంపై పోలవరం, పత్యరేడు, గాలేరు నాగరి, వేలు గోడు వంటి ప్రాజెక్టుల విషయంలో అనుమతుల లేమిపై నిరసన వ్యక్తం చేస్తోంది. ఇక బనకచర్ల లిఫ్ట్ కూడా అదే కోవలోనిదే. గోదావరి లోని మించి సముద్రంలోకి పోతున్న నీటిని ఎత్తిపోసి నంద్యాల జిల్లా బనకచర్ల వరకు తీసుకువచ్చే ఉద్దేశంతో ఈ లింక్ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇది పూర్తిగా ఎత్తిపోతల పథకంగా రూపొందించ బడింది. గోదావరి నుంచి నీటిని తీసుకొని కృష్ణా నదీ పరివాహక ప్రాంతమైన రాయలసీమకు తరలించాలన్నదే దీని లక్ష్యం. బనకచర్ల లిఫ్ట్ ప్రాజెక్టు, కృష్ణా నదిపై ఉన్న సంజీవయ్య సాగర్ (వెలిగొండ జలాశయం) వద్ద నుండి నీటిని ఎత్తిపోసి ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సాగునీటిగా వినియోగించాలనే ఉద్దేశంతో రూపొందించ బడింది. ఇది ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి నీటి అవసరాలను తీర్చడానికే లక్ష్యంగా ఉంది. ప్రాజెక్టు ద్వారా నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో కొత్తగా 7.4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు, ఇప్పటికే సాగులో ఉన్న 22.6 లక్షల ఎకరాలకు స్థిరీకరణ చేయనున్నారు. పథకాన్ని పురోగతిలో పెట్టేందుకు 9,600 కోట్ల రూపాయల టెండర్లు మే 2024లోనే విడుదల చేయడమే కాకుండా, పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ ప్రాజెక్టుపై నైతిక, న్యాయ, పారిశ్రామిక, పర్యావరణ పరంగా అనుమతుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ నుంచి టెక్నికల్ క్లియరెన్స్ (Technical Clearance), కేంద్ర పర్యావరణ శాఖ నుంచి పర్యావరణ అనుమతులు (Environmental Clearance), కేంద్ర జలకమిషన్ (CWC), గోదావరి నది నిర్వహణ మండలి (GRMB), మరియు రెండు రాష్ట్రాల సమన్వయ సంస్థ అయిన ఏపెక్స్ కౌన్సిల్ నుండి ఎలాంటి అంగీకారం లేకుండానే ఏపీ ప్రాజెక్టును చేపట్టింది. ఇది ఏకపక్ష చర్యగా భావిస్తూ తెలంగాణ రాష్ట్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా నాలుగు విషయాల్లో అభ్యంతరాలు తెలియజేసింది. మొదటిది – ఇది చట్ట ఉల్లంఘన. 2014లో అమలులోకి వచ్చిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం, రెండు రాష్ట్రాల మధ్య నీటి వినియోగానికి సంబంధించి ఏవైనా ప్రాజెక్టులు ప్రారంభించడానికి కేంద్ర అనుమతులతో పాటు ఏపెక్స్ కౌన్సిల్ అంగీకారం తప్పనిసరి. రెండవది – ఈ లింక్ ప్రాజెక్టు వల్ల గోదావరి లోని ప్రవాహం తగ్గి తెలంగాణలోని ములుగు, భూపాలపల్లి, మానుగూరు ప్రాంతాలలో బ్యాక్వాటర్ ప్రభావంతో వరద ముప్పు పెరిగే అవకాశం ఉంది. మూడవది – కృష్ణా జలాలపై ఇప్పటికే అన్యాయం జరుగుతుంటే, మరింత నీటిని డైవర్ట్ చేయడం అన్యాయమని తెలంగాణ అభిప్రాయం. నాలుగవది – కేంద్రం నిష్పక్షపాతంగా వ్యవహరించక పోవడం వల్లే ఏపీకి కొంత ధైర్యం వచ్చినట్టు తెలంగాణ నేతలు ఆరోపిస్తున్నారు. తెలంగాణ నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి హరీష్ రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై స్పష్టమైన వైఖరి ప్రకటించారు. ఇది తెలంగాణ రైతుల హక్కులపై దాడిగా పేర్కొంటూ కేంద్రాన్ని పలుమార్లు అప్రమత్తం చేశారు. ఇప్పటికే కేంద్ర జలవనరుల మంత్రికి, గోదావరి నది నిర్వహణ మండలికి, జల శక్తి మంత్రిత్వ శాఖకు లేఖలు పంపారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీ వెళ్లి, సంబంధిత మంత్రికి తమ అభ్యంతరాలు స్పష్టం చేశారు. అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామన్నది తెలంగాణ వాదన. ఇక్కడ గణాంకాలు ఆసక్తికరంగా ఉన్నాయి. గోదావరిలో ప్రతి ఏడాది సుమారు 3,000 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తుంది. ఏపీ ప్రతిపాదించిన ప్రాజెక్టు ద్వారా దాదాపు 200 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోసి రాయలసీమకు తరలించాలన్నదే ప్రధాన ఉద్దేశం. దీనిని 'పొయ్యే నీటిని వినియోగించు కుంటున్నాం' అనే పేరుతో సమర్థించు కుంటున్నారు. కానీ ఇందులోను ఓ వ్యాజ్యం ఉంది. 1980లో ఏర్పడిన గోదావరి జలాల తత్వ విచారణ కమిటీ (GWDT) తీర్పుల ప్రకారం, ఏ ఒక్క రాష్ట్రం కూడ ఇతర రాష్ట్ర అంగీకారం లేకుండా గోదావరి నీటిని వేరే బేసిన్‌కు తరలించ లేదు. ఇది న్యాయపరంగా మాత్రమే కాదు, సాంకేతికంగా, పర్యావరణ పరంగా కూడా తీవ్ర పరిణామాలను కలిగించే అంశం. ఎత్తిపోతల ద్వారా 250 మీటర్ల ఎత్తు వరకు నీటిని తరలించాలి. ఇందుకోసం విద్యుత్ వినియోగం, పారిశ్రామిక నిర్మాణం, బ్యాక్వాటర్ ప్రభావం వంటి అంశాలు వివరంగా పరిశీలించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు Detailed Project Report (DPR), Environmental Impact Assessment (EIA) వంటి కీలక నివేదికలు అందుబాటులో లేవు. ఇక కేంద్రం పాత్ర విషయానికి వస్తే, అది ఇప్పటికీ స్పష్టత ఇవ్వకుండా రెండు రాష్ట్రాలకు మధ్య వివాదాన్ని పెంపొందించేలా వ్యవహరిస్తోంది. రెండు రాష్ట్రాలు ఒకే నదిని పంచుకుంటున్నప్పుడు కేంద్రం నిష్పక్షపాత ధోరణితో మెలగాల్సిన, వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రస్తుతం కనిపిస్తున్న పరిణామాలు రాజకీయ పక్షపాతం, ప్రాంతీయ ఒత్తిళ్లకు లోనవుతున్నట్టు అనిపిస్తోంది. సంపూర్ణంగా చూస్తే బనకచర్ల ప్రాజెక్టు అవసరం కలిగిన ప్రాంతానికి నీరు అందించాలన్న మంచి ఉద్దేశంతో ప్రారంభమైనా, పారదర్శకత, చట్టపరమైన ప్రక్రియలు, పర్యావరణ ప్రమాణాలు పాటించక పోవడం వల్ల ఈ ప్రాజెక్టు వ్యతిరేకతకు గురవుతోంది. ఒక రాష్ట్రం నీటి ప్రాజెక్టును కొత్తగా గా ప్రారంభించడమంటే అది పరస్పర అపనమ్మకానికి, నదీ జలాల పంచాయితీకి, అవకాశం లేకుండా ఉండాలి. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ తమ ఆవశ్యకతలు సమర్పించుకుని, కేంద్ర ప్రభుత్వం పారదర్శక విచారణతో తేల్చాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం నీటి ప్రాజెక్టు అనేగాక, నీటి రాజకీయం, న్యాయం, సహకార పద్ధతుల పరీక్షగా భావించాలి. మిగతా రాష్ట్రాలకు ఇది ఒక ఉదాహరణ కావాలి – అవసరాల నేపథ్యంలో కూడా చట్టబద్ధతకు, సమగ్ర అనుమతులకు, సమన్వయానికి విలువ ఇవ్వాల్సిన అవసరం ఎంతగానో ఉంది. బనకచర్ల లిఫ్ట్ ప్రాజెక్టు దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కు సాగునీటి శాపమా, లేక తెలంగాణకు నదీ హక్కుల అపహరణా అనే ప్రశ్న ఇప్పటికీ తేలలేదని చెప్పాలి. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు అమలు చేయకుండా రెండు రాష్ట్రాలకు మధ్య సంఘర్షణ కొనసాగే అవకాశం ఉంది జలాలపై సమన్వయ, పారదర్శకత, న్యాయబద్ధమైన వాటా నిర్ణయాలు కేంద్రం ద్వారా తీసుకోవడం అత్యవసరం. రాష్ట్రాలు పరస్పరం నమ్మకం కలిగి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## లండన్ లో భారీ ఇల్లు కొన్న కోహ్లి.. ఇక అక్కడే సెటిల్..?

భారత్ లో అయితే కోట్లాది మంది అభిమానులు... ఏ నగరంలోనూ స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి.. వ్యక్తిగత జీవితం ఓ జైలు జీవితం తరహా.. అందుకేనేమో క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లి తన నివాసానికి వేరే దేశం ఎంచుకున్నాడా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. కోహ్లి కొంతకాలంగా యునైటెడ్ కింగ్ డమ్ (యూకే)లోనే ఎక్కువగా ఉంటున్నాడని కథనాలు వచ్చాయి. తన భార్య అనుష్క శర్మ రెండో కాన్పు కూడా అక్కడే జరిగింది. టోర్నమెంట్లు లేనప్పుడు కోహ్లి అధిక సమయం యూకేలో గడిపేందుకే ఇష్టపడుతున్నాడనేది స్పష్టమైంది. అక్కడి వాతావరణమో.. మెరుగైన జీవనమో.. స్వేచ్ఛ కోసమో.. మరేదైనా కానివ్వండి.. కోహ్లి యూకే పట్ల ఆపేక్షతో ఉన్నాడని తెలుస్తోంది. ఓవైపు అదే యూకే (ఇంగ్లండ్)కు చెందిన జట్టు భారత్ లో పర్యటిస్తుంటే, కోహ్లి తన భార్య కాన్పు కోసం సిరీస్ కు పూర్తిగా దూరమయ్యాడు. అప్పట్లోనే కోహ్లి ఇంగ్లండ్ ను తన రెండో ఇల్లుగా చేసుకుంటాడనే కథనాలు వచ్చాయి. యూకేకు గత ఏడాది వరకు ప్రధాని పనిచేసిన, ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తికి అల్లుడైన రిషిసునాక్ తోనూ కోహ్లి



మంచి సంబంధాలు ఉన్నాయి. ఈ సీజన్ లో ఆర్సీబీ ఐపీఎల్ ఫైనల్ కు చేరడతో సునాక్ ఇండియాకు వచ్చి మరీ మ్యాచ్ ను వీక్షించారు. అయితే, తాను ఎంతగానో ఇష్టపడుతున్న ఇంగ్లండ్ లో పర్యటనకు ముందు, తాను ఎంతగానో ఇష్టపడే టెస్టు ఫార్మాట్ కు కోహ్లి గుడ్ బై చెప్పి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. ఇక టీమ్ ఇండియా ప్రస్తుతం ఇంగ్లండ్ లో ఉంది. శుక్రవారం నుంచి తొలి టెస్టు మొదలుకానుంది. కొత్త కెప్టెన్ శుబ్ మన్ గిల్ సారథ్యంలో టీమ్ ఇండియా ఐదు మ్యాచ్ ల సమరానికి సిద్ధం అవుతోంది. మరో స్టార్ బ్యాట్స్ మన్, మొన్నటివరకు కెప్టెన్ గా ఉన్న రోహిత్ శర్మ కూడా రిటైర్మెంట్ ఇచ్చాడు. కోహ్లి, రోహిత్ ఇద్దరిలో ఒక్కరైనా లేకుండా 15 ఏళ్లలో తొలిసారిగా టీమ్ ఇండియా ఓ విదేశీ టూర్ చేస్తోంది. కాగా, టెస్టు క్రికెట్ కు రిటైర్మెంట్ ఇచ్చిన కోహ్లి కూడా తాజాగా ఇంగ్లండ్ చేరాడు. సహచర క్రికెటర్లు శుబ్ మన్ గిల్, రిషభ్ పంత్ తదితరులను లండన్ లో తన భారీ బంగ్లాకు ఆహ్వానించాడు. వారు కొన్ని గంటల పాటు అక్కడ గడిపినట్లు తెలిసింది. బహుశా వన్డే క్రికెట్ లో మాత్రమే కోహ్లి కొనసాగుతున్నందున అతడు ఇప్పుడు ఇంగ్లండ్ లోనే ఉంటూ టెస్టు సిరీస్ ను చూసే చాన్సుంది. పూర్తిగా రిటైర్ అయినాక కూడా కోహ్లి ఎక్కువ కాలం లండన్ లోనే నివసించే అవకాశం కనిపిస్తోంది.

## అక్కడ హస్తవాసి చూస్తున్న షర్మిల!

ఏపీలో ఎటు చూసినా కాంగ్రెస్ పార్టీ ఎత్తి గిల్లుతున్న సూచనలు లేవు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు పూర్తిగా వైసీపీకి మళ్ళిపోయింది. వైసీపీకి జగన్ వంటి ధీటైన నాయకుడు ఉన్నారు. ఆయన ఒకసారి సీఎంగా కూడా చేశారు. దాంతో పాటు పదిహేనేళ్ళుగా రాజకీయాల్లో ఉంటూ ధీటుగా మారారు. ఇక ఆయన చెల్లెలుగా జగనన్న వదిలిన బాణంగా రాజకీయాల్లోకి వచ్చిన షర్మిలకు వైసీపీలో ఏమీ లేకుండా పోయింది. దాంతో ఆమె ఒక ప్రాంతీయ పార్టీని తెలంగాణాలో పెట్టి మళ్ళీ ఏపీలోకి వచ్చారు. కాంగ్రెస్ కి ఆమె ఏపీ చీఫ్ గా ఉంటున్నారు. ఆమె ఈ పదవీ బాధ్యతలు చేపట్టి ఏణ్ణర్థం అవుతోంది. అయినా సరే ఏపీలో కాంగ్రెస్ మాత్రం బలపడింది లేదు సరికదా ఇంకా తగ్గిపోతోంది. మరో వైపు చూస్తే కాంగ్రెస్ లో సీనియర్ నేతలు కొందరు ఇంకా మిగిలారు. అయితే వారు పూర్తిగా మౌనం దాల్చారు. పార్టీలో ఉన్నట్లా లేనట్లా అన్నట్లుగా ఉన్నారు. షర్మిల అయితే తనదైన శైలిలో రాజకీయం చేసుకుని పోతున్నారు. ఇక ఆమె చూపు ఇపుడు ఉత్తరాంధ్రా జిల్లాల మీద పడింది. ఉత్తరాంధ్రాలో కాంగ్రెస్ ఏమైనా బలపడుతుందేమో అన్న ఆలోచనలతో ఆమె ముందుకు వస్తున్నారు. ఆరు జిల్లాల కాంగ్రెస్ పార్టీ నేతలతో ఆమె భేటీలు నిర్వహిస్తున్నారు. ఒక విధంగా పార్టీని కదిలించాలని చూస్తున్నారు. ఉత్తరాంధ్రాలో కాంగ్రెస్ ఏమైనా పుంజుకుంటుందేమో



అన్న ఆశలతో ఆమె ఉన్నారు. ఆమె తరచుగా విశాఖ వస్తున్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ మీద గళం విప్పుతున్నారు. అయితే ఈసారి ఆమె ఉత్తరాంధ్రలోని రూరల్ ప్రాంతాలను పర్యటించాలని నిర్ణయించుకున్నారు అని అంటున్నారు. పార్టీకి ఉన్న నాయకులకు సరైన దిశా నిర్దేశం చేయడం ద్వారా వారిని ఉత్సాహపరచాలని నిర్ణయించుకున్నారని అంటున్నారు. ఉత్తరాంధ్రాలో ఎస్టీ నియోజకవర్గాలు అయిదు ఉన్నాయి. అలాగే ఎస్సీ నియోజకవర్గాలు రెండు ఉన్నాయి. దాంతో వీటిలో అయినా కాంగ్రెస్ కి ట్రెడిషనల్ ఓటు బ్యాంక్ ని గట్టిపరచుకుంటే వచ్చే ఎన్నికలలో అయినా ఇక్కడ నుంచి బోణీ కొట్టవచ్చు అన్నది షర్మిల ఆలోచనగా ఉంది అని అంటున్నారు. ఒకనాడు విశాఖ సిటీలో కాంగ్రెస్ బలంగా ఉండేది. అనేక ఎన్నికల్లో ఎంపీ సీటుని గెలుచుకుంది. మేయర్ పదవిని కూడా పలు మార్లు అందుకుంది. దాంతో విశాఖ మీద కూడా ఫోకస్ పెడితే గతంలో ఉన్న బలాన్ని ఎంతో కొంత తిరిగి అందుకోగలమని ఆమె చూస్తున్నారు. దాంతో వరసబెట్టి ఆమె మన్యం జిల్లాలతో పాటు విశాఖ అనకాపల్లి విజయనగరం శ్రీకాకుళం జిల్లాలలో కాంగ్రెస్ నాయకులతో సమావేశాలను పెట్టి భేటీ కాబోతున్నారు. ఆమె తొందరలోనే జిల్లాల పర్యటనలు చేపడతారని అది కూడా ఉత్తరాంధ్రా నుంచి ఉండొచ్చని Sపార్టీ వర్గాలు అంటున్నాయి. మరి ఉత్తరాంధ్రాలో హస్తవాసి ఎలా ఉందో కాంగ్రెస్ చీఫ్ స్వయంగా చూడనున్నారు.


చురకలు

## సంపాదకీయం

# ఇరాన్ లో భారత్ 'ఆపరేషన్ గంగా' ఎందుకు ప్రారంభం కాలేదు?

ప్రస్తుతం పశ్చిమాసియా రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. అవిరామంగా ఇజ్రాయెల్, ఇరాన్ లు ఒకరిపై ఒకరు క్షిపణులు, డ్రోన్ లతో విరుచుకుపడుతున్నారు. మరోవైపు ఇరాన్ గగనతలం మూసివేయబడింది.. పశ్చిమాసియాలో విమానాశ్రయాలు మూతపడ్డాయి. దీంతో.. అక్కడున్న సుమారు 10,000 మంది భారతీయుల తరలింపుపై ఇప్పుడు ఓ ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అవును... 2022లో రష్యా – ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు భారత్ వేగంగా స్పందించింది. ఇందులో భాగంగా.. "ఆపరేషన్ గంగా"ను ప్రారంభించింది. దీని ద్వారా వేలాది మంది పౌరులను, విద్యార్థులను ఆ ప్రాంతం నుంచి తరలించింది. అయితే... పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పీక్స్ కి చేరుకుంటున్న వేళ.. ఇరాన్ నుంచి తరలించే విషయంలో ఇలాంటి ఆపరేషన్ చెపట్టలేదు. ఇరాన్ లో సుమారు 10,000 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో సుమారు 2000 మందికి పైగా విద్యార్థులు.. 6,000 మందికిపైగా అక్కడ నివసిస్తున్నవారు.. వీరితో పాటు భారత నావికాదళం, షిప్పింగ్ సంబంధిత కార్యకలాపాలతో సంబంధం ఉన్నవారు ఉన్నారని అంటున్నారు. వీరిలో తాజాగా 110 మందిని తొలి విడతలో రోడ్డు మార్గం ద్వారా తరలించారు! అయితే... 2022 ఫిబ్రవరి – మార్చి మధ్యలో సుమారు 22,500 మంది భారతీయ పౌరులను ఉక్రెయిన్ నుంచి భారత్ తీసుకొచ్చారు! ఆ సమయంలో ఆపరేషన్ గంగా కింద సుమారు 90 విమానాలు నడిపింది భారత్. అయితే.. అప్పుడు హంగేరీ, మోల్డోవా, రొమేనియా, పోలాండ్ వంటి ప్రాంతాల నుంచి తరలింపు విమానాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా నడిచిన పరిస్థితి. అయితే... ఇరాన్ విషయంలో అలాంటి ఆపరేషన్స్ ఏమీ భారత్ చేపట్టలేదు. దీనికి భౌగోళిక రాజకీయాలు అడ్డుగా ఉన్నాయని అంటున్నారు. తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్న భారతీయుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ.. అందుకు అవసరమైన, అందుబాటులో ఉన్న తరలింపు మార్గాలు మాత్రం పరిమితంగా ఉన్నాయి. వీటిలో ఇరాన్ తూర్పు పొరుగుదేశాలైన పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ ల ద్వారా తరలింపు అనేది లాజిస్టికల్ సవాలు మాత్రమే కాదు.. భౌగోళికంగా కూడా తాజా పరిస్థితుల్లో చాలా కష్టం. పైగా.. పాక్ వైమానిక ప్రాంతం భారత్ కు మూసివేయబడి ఉంది.. ఇక, భూమార్గం ప్రశ్నే లేదు! ఆఫ్గన్ తో భారత్ సంబంధాలు మెరుగుపడినప్పటికీ.. లాజిస్టిక్ సవాల్ అలాగే ఉన్న పరిస్థితి! ఇంకా ఇరాన్.. అర్మేనియ, అజర్ బైజాన్, తుర్క్ మెనిస్తాన్ లతోనూ భూ సరిహద్దులను పంచుకుంటుంది. అయితే... ఇటీవల పాకిస్థాన్ కు అజర్ బైజాన్ మద్దతు గా నిలిచింది. సో.. ఆ ఆప్షన్ లేదు! ఇక తుర్క్ మెనిస్తాన్ ఇప్పటికీ భారత్ కు ఒక ఎంపికగానే ఉండటంతో.. నెక్స్ట్ బ్యాచ్ ను అటు నుంచి తీసుకొచ్చే అవకాశం ఉంది. కాగా... ఇరాన్ నుంచి తరలింపు ప్రక్రియ ప్రారంభమైన వేళ 110 మందితో కూడిన మొదటి బ్యాచ్ ను అర్మీనియం మీదుగా తీసుకొచ్చిన సంగతి తెలిసిందే! ఈ సంక్షిష్ట పరిస్థితుల నేపథ్యంలోనే ఈ తరలింపుకు భారత్ ఎలాంటి ఆపరేషన్ పేరు పెట్టలేదని అంటున్నారు!

# స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవకారుడు గయా ప్రసాద్ - జూన్ 20...గయాప్రసాద్ కటియార్ జయంతి



ఎందరో వీరుల త్యాగఫలం మనం నేడు అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. భారత దేశ స్వాతంత్ర పోరాటంలో ఎంతోమంది విప్లవ వీరులు మరిచి పోలేని, వెల కట్టలేని త్యాగాలు చేశారు. ఆలాంటి వారిలో భారతీయ స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాలుపంచుకున్న భారతీయ విప్లవకారుడు గయా ప్రసాద్ ఎన్నదగిన వాడు. ఆయన గురించి నేటి తరానికి పెద్దగా తెలియక పోవడం శోచనీ యం. గయాప్రసాద్ కటియార్ (20 జూన్ 1900 10 ఫిబ్రవరి 1993) "హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్"కు చెందిన విప్లవ వీరుడు. ఆయన 1900, జూన్ 20వ తేదీన నందరాణి, మౌజీరామ్ దంపతులకు కాన్పూర్ జిల్లా బిల్హౌర్ తాలూకా జగదీష్ పూర్ గ్రామంలో జన్మించాడు. ఉన్నత పాఠశాల విద్య తర్వాత ఇతడు కాన్పూర్లో మెడిసినల్ ప్రాక్టీస్ కోర్సులో చేరాడు. తర్వాత ఆర్య సమాజంలో చేరాడు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసి యేషన్ (హెచ్.ఆర్.ఎస్.ఎ)కు చెందిన ఇతర విప్లవ కారుల వలె ఆయన కూడా 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1926లో భగత్ సింగ్, రాజ్ గురులు హెూలీ పండగ సందర్భంగా జగదీషాపుర్ వచ్చినప్పుడు వారితో ఆయనకు గట్టి అనుబంధం ఏర్పడింది. ఆయన విప్లవ పార్టీ బాంబులు తయారీ కారులకు చోటు కల్పించడం ముఖ్య మైన చర్యగా ఉండేది. ఆయన ఒక మారుపేరుతో వైద్య శాలను ప్రారంభించేవాడు. ఇతర విప్లవ కారులు ఆయన వైద్యశాలలో పనివారుగా నటించేవారు. ఆ వైద్యశాలలో రహస్యంగా బాంబులు తయారటయ్యేవి. ఆ సందర్భంగా రసాయనాల నుండి వచ్చే వాసనను మందులు తయారు చేయడంవల్ల వచ్చిందిగా చుట్టుపక్కల వారు భావించేవారు. డాక్టర్ బి.ఎస్.నిగం అనే మారు పేరుతో ఆయన ఫిరోజ్పుర్లోని తూరి బజార్లో 1928 ఆగస్ట్ 10 నుండి, 1929 ఫిబ్రవరి 9 వరకూ ఒక ఆసుపత్రి ముసుగులో బాంబుల కారా?నా నడిపాడు. దీనిలో శివ్ వర్మ అనే విప్లవకారుడు రామానారాయణ్ కపూర్ పేరుతో, మహావీర్ సింగ్ ప్రతాప్ సింగ్ పేరుతో, చంద్రశేఖర్ ఆజాద్ పండిత్ జీ పేరుతో, సుఖదేవ్ బలే జర్ పేరుతో, జయదేవ్ అనే విప్లవకారుడు గోపాల్ అనే మారు పేరుతో పనిచేసేవారు. పోలీసుల నిఘా చర్యలు అధికం కావడంతో తమ స్థావరాన్ని పరహాస్పూరు మార్చారు. ఇన్ఫార్మర్ అయిన ఫిరోజ్పూర్ నివాసి కాలూరాం అనే మంగలి స్వంతపని మీద షరహన్పూర్ వచ్చి అక్కడ డాక్టర్ నిగమ్ టను చూసి, గయా ప్రసాద్ గుర్తించి స్థానిక పోలీసులకు ఈ విషయం తెలియ జేశాడు. 1929, మే 13న పోలీ సులు చౌబే పరి ష్ ప్రాంతంలోని వీరి స్థావరంపై దాడి చేసి శివ్ వర్మ, జయదేవ్ కపూర్లను అరెస్ట్ చేశారు. కాన్పూరుకు వెళ్ళిన గయాప్రసాద్ నిధులు సమకూర్చుకోలేక 1929 మే 15న షహ రన్ పూర్కు తిరిగి వచ్చాటడ. అయితే పోలీసులు చుట్టుముట్టి క్షణాలలో ఆయన చేతికి బేడీలు తగిలించారు. ఆయనను పోలీస్ స్టేషన్కు తరలించే సమయంలో గయాప్రసాద్ తన జేబులోని ఒక కాగితంలో కాకోరీ కుట్ర కేసులో నిందితులు తరపున వాదించిన లక్నో న్యాయ వాదులు చంద్రభాను గుప్త, మోహన్లాల్ సక్సేనాల పేర్లు ఉండటాన్ని గుర్తు చేసుకుని ఆ కాగితాన్ని ఉండ చుట్టుకుని నోటిలో పెట్టుకుని మ్రింగడానికి ప్రయత్నించాడు. అది గొంతులో అడ్డం పడి విపరీతంగా దగ్గు వచ్చింది. నీరు కావాలని కానిస్టేబులు సంజ్ఞ చేసి నీటితో పాటు ఆ కాగితాన్ని మ్రింగివేశాడు. ఆయనను ఇతర హెచ్.ఆర్.ఎస్.ఎ విప్లవకారులతో కలిపి లాహెూర్ తరలించారు. అక్కడ ఆయన నిరాహారదీక్ష చేపట్టాడు. లాహెూర్ కుట్ర కేసులో విచారించి జీవిత ఖైదును విధించి అండమాన్ సెల్యులార్ జైలుకు తరలించారు. ఆ జైలులో ఖైదీల పట్ల చూపుతున్న అమానవీయ చర్యలకు నిరసనగా ఆయన అక్కడ కూడా 46 రోజుల పాటు నిరాహారదీక్ష చేశాడు. ఆయన హెచ్.ఆర్.ఎస్.ఎ. సహచరుడు మహావీర్ సింగ్ ఈ సమ్మెలో మరణించాడు. దానితో ఆయనను ఆ జైలు నుండి తరలించారు. మళ్ళీ 1937లో ఆయనను సెల్యులార్ జైలుకు పంపారు. చివరకు 1946లో విడుదల చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా తన విప్లవ ధోరణితో రైతుల, కార్మికుల పక్షాన పోరాడాడు. ఫలితంగా 1958లో 6 నెలలపాటు, మళ్ళీ 1966–68లో ఒకటిన్నర సంవత్సరాలు జైలు జీవితం గడిపాడు. ఆయన 1993, ఫిబ్రవరి 10వ తేదీన మరణించాడు. ఆయన జ్ఞాపకార్థం 2016, డిసెంబర్ 26వ తేదీన భారత తపాలాశాఖ ఒక స్మారక తపాలాబిళ్ళను, ఫస్ట్ డే కవర్ను విడుదల చేసింది. 2002లో విడుదలైన "ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్" అనే సినిమాలో ఆయన పాత్రను నీరజ్ షా పోషించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# శరణార్థులకు జీవించే హక్కులు కల్పించాలి - జూన్ 20...అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం

ప్రతి సంవత్సరం జూన్ 20న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం, మానవాళికి సానుభూతి పాఠం నేర్పించే సందర్భం. యుద్ధాలు, మత, జాతి వివక్ష, రాజకీయ హింస, లేదా ప్రకృతి విపత్తుల కారణంగా తమ స్వస్థలాలను విడిచి, జీవన రక్షణ కోసం అన్యదేశాల్లో ఆశ్రయం పొందుతున్న కోట్లాది మంది శరణార్థుల బాధలను గుర్తించడానికి, వారి హక్కులను సమర్థించడానికి, ప్రపంచాన్ని కలుపుకొనే నిబద్ధతకు ఇది గుర్తింపు సూచిక. శరణార్థులు తమకు ఉన్న అన్నిటినీ కోల్పోయిన వారు %–% ఇల్లు, ఉపాధి, కుటుంబం, దేశం, గౌరవం. కానీ వారు కోల్పోని ముఖ్యమైన గుణం ధైర్యం. అదే ధైర్యం, స్థైర్యం ప్రపంచాన్ని నిశ్శబ్దంగా కదిలిస్తుంది. వారి జీవితాలకు మద్దతుగా నిలబడే ప్రయత్నం చేయడమే ఈ దినోత్సవం యొక్క అసలైన లక్ష్యం. ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి 2000లో అధికారికంగా గుర్తించింది. 1951 శరణార్థుల ఒప్పందానికి 50 ఏళ్ళు పూర్తైన సందర్భంలో ప్రారంభమై, 2001 నుండి ప్రతి సంవత్సరం విశేషంగా నిర్వహించ బడుతోంది. ప్రతీ ఏడాది ఒక థీమ్ ఆధారంగా శరణార్థుల సమస్యలపై దృష్టి కేంద్రీకరిస్తూ, నూతన ఆలోచనలకు వేదికవుతోంది. 2025 సంవత్సరానికి ఎన్నికైన నినాదం – "Hope Away From Home: A world where refugees are always included". ఈ నినాదం శరణార్థులు తాత్కాలిక బాధితులు కాదని, శాశ్వత సమాజ భాగస్వాములని, వారికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వివరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 12 కోట్లకు పైగా శరణార్థులు, అంతర్గత వలస దారులు, దేశ విహీనులు ఉన్నారని ఐక్యరాజ్య సమితి శరణార్థుల సంస్థ 2024 నివేదిక వెల్లడించింది.




సిరియా, ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్, ఉక్రెయిన్, సూడాన్, సోమాలియా వంటి దేశాల్లో సంక్షోభాలు తీవ్రంగా ఉండటంతో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. వారిలో చాలామంది పిల్లలు, మహిళలు, వృద్ధులు %–% ప్రాథమిక హక్కుల కంటే జీవిత హక్కు కోసం పోరాడుతున్న వారే. ఈ శరణార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు %–% సురక్షిత నివాసం లేకపోవడం, ఆహార, నీరు, వైద్య సేవల కొరత, విద్యా రాహిత్యం, ఉపాధి అవకాశాల లేమి, మానసిక ఒత్తిడి, మరియు కొన్ని సందర్భాల్లో నిర్దాక్షిణ్యమైన వివక్ష. వలసలో ప్రాణాలు కోల్పోయిన వారు వేలల్లో. సముద్రం దాటి బోట్లలో ప్రాణాలతో పయనించే వారు %–% మనిషి బతుకు విలువను ప్రశ్నించే నిదర్శనాలు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, శరణార్థులకు ఆశ్రయం, ఆహారం, ఆరోగ్యం, విద్య, తమ దేశానికి తిరిగి వెళ్లే స్వేచ్ఛ వంటి హక్కులు ఉన్నాయి. కానీ వాటి అమలులోని అసమానతలు, అనేక సందర్భాల్లో రాజ్యాల రాజకీయాలకు అనుగుణంగా మారుతుండటం గమనార్హం. భారతదేశం 1951 ఒప్పందానికి అధికారికంగా సంతకం చేయక పోయినా, వాస్తవానికి శరణార్థుల పట్ల అత్యంత ఉదారంగా వ్యవహరించిన దేశాల్లో ఒకటిగా నిలిచింది. టిబెటీయులు, శ్రీలంక తమిళులు, బంగ్లాదేశ్ వలస దారులు, ఆఫ్ఘన్ హిందూ – సిక్కు మైనారిటీలతో పాటు ఇటీవల రోహింగ్యాల వలసలతో భారతం మరోసారి మానవతా విలువలను చాటింది. పలు నగరాల్లో శరణార్థుల పునరావాస శిబిరాలు, పిల్లలకు విద్య, ఉపాధి శిక్షణలూ అందించడంలో దేశం ముందుండింది. ఈ దినాన్ని పురస్కరించుకొని వివిధ స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజాసంఘాలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాయి. శరణార్థుల కథలు ప్రదర్శనలు, డాక్యుమెంటరీలు, చర్చావేదికలు, విరాళ సేకరణలు, అవగాహన ర్యాలీలు %–% ఇవన్నీ వారి బాధను ప్రపంచానికి తెలిసే ప్రయత్నమే. శరణార్థుల పట్ల మానవతా దృక్పథాన్ని సమాజంలో బలపరిచే విధంగా, ప్రతి ఒక్కరినీ చైతన్యవంతుల్ని చేసే విధంగా ఈ కార్యక్రమాలు సాగుతాయి. ఇలాంటి సందర్భంలో మనం చేయవలసినది... శరణార్థుల సమస్యలపై అవగాహన కల్పించటం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం, శరణార్థుల సంక్షేమానికి విరాళాలు అందించడం, వారిని మన సమాజంలో భాగంగా అంగీకరించటం. శరణార్థుల దినోత్సవం కేవలం గడిచి పోయిన బాధిత జ్ఞాపకానికి కాదు – అది నేడు ఉన్న బాధితులకు భవిష్యత్తును అందించేందుకు మనం చేసే ప్రయత్నానికి గుర్తింపు. ప్రతి శరణార్థి, మిగిలిన ప్రతి మనిషిలా, గౌరవంతో, హక్కుతో జీవించడానికి అనువైన పరిస్థితులు కల్పించ బడాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# తెలుగు సినీ గీత రచనకు ఆద్యులు చందాల కేశవదాసు - ప్రతిభకు ప్రతిరూపం చందాల కేశవదాసు - జూన్ 20...చందాల కేశవదాసు జయంతి




తెలుగు సినిమాలలో తొలి పాటను రాసింది ఎవరో తెలుసా? అలాంటి అవసరం, అవకాశం, సందర్భం రాలేదనుకుంటా. 1931లో తీసిన తొట్టతొలి తెలుగు టాకీ చిత్రం భక్త ప్రహ్లాదలో పరితాప భారంబు భరియింప తరమా అనే పాటను రాసింది బహుముఖ ప్రజ్ఞాశాలి చందాల కేశవదాసు. అంతేకాదు ఆయన బహుముఖ ప్రజ్ఞ గురించి తెలుసుకొనే ప్రయత్నం చేయకుంటే, ఆ మహనీయునికి తీరని అన్యాయం చేసిన వారం అవుతాం. చందాల కేశవదాసు (జూన్ 20, 1876 – మే 14, 1956) తొలి తెలుగు నాటక కర్త, తొలి సినీ గీత రచయిత, కవి, నటులు, గాయకులు, హరికథా కళాకారులు, అష్టావధాని, శతావధాని. నాటకాల్లో మొదట పాడే పరబ్రహ్మ పరమేశ్వర అనే గొప్ప కీర్తనను, తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే భలే మంచి చౌక బేరము అనే పాటను రాసింది కూడా ఆయనే. కేశవదాసు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని జక్కేపల్లి లో 1876 జూన్ 20వ తేదీన చందాల లక్ష్మీనారాయణ, పాపమ్మ దంపతులకు రెండవ కుమారుడిగా జన్మించారు. తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో వీధిబడిలోనే కేశవదాసు విద్యనభ్యసించారు. ఛందస్సు, అవధానాధి ప్రక్రియలు నేర్చుకున్నారు. విద్యాభ్యాస అనంతరం తను చదువుకున్న వీధి బడి నడుపుతూ అవధానాది ప్రక్రియలలో నేర్పు సాధించారు. అష్టావధానాలు చేస్తూ దేశాటన చేస్తున్న కాలంలో సుప్రసిద్ధ వాగ్గేయకారుడు పాపట్ల కాంతయ్యతో స్నేహం ఏర్పడి, కాంతయ్య ద్వారా సంగీతంలోని మెలకువలు నేర్చుకున్నారు. గేయరచనలో, సంగీతం కూర్పులో, హరికథనంలో, రచనలో కేశవదాసు ఆరితేరారు. కాంతయ్యనాటక సమాజంలోచేరి కవిగా, నటుడిగా పేరుగాంచారు. ఈయన సేవకుడు వేషం నుంచి రాజు వేషం వరకు ఏ వేషమైనా వేసి మెప్పించగల సమర్థులు. మైలవరం కంపెనీకి శ్రీకృష్ణ తులాభారం, రాధా కృష్ణ నాటకాలకు పాటలు రాసిచ్చారు. అలా శ్రీకృష్ణ తులాభారం కోసం 'భలే మంచి చౌక బేరము సమయము మించినన్ దొరుకదు', నాటకాల్లో మొదట పాడే 'పరబ్రహ్మ పరమేశ్వర' అనే సుప్రసిద్ధ కీర్తన కేశవదాసు రాశారు. భక్త ప్రహ్లాద, కనకతార వంటి చిత్రాలకు కేశవదాసు మాటలు, పాటలు వ్రాశారు. 1930–33ల మధ్య కేశవదాసు వ్రాసిన జాతీయ గీతాలను సినీ గాయకుడు సాలూరు రాజేశ్వర రావు, అముల నరసింహారావులు పాడగా బెంగుళూరులో రికార్డు చేశారు. ఈయన అనేక సినిమా స్క్రిప్టులతో పాటుగా, కేశవ శతకం, బలి బంధనం, సీతా కళ్యాణం, రుక్మాంగద, మేలు కొలుపులు, జోలపాటలు మొదలైన రచనలు చేశారు. బాల భారత్ సమాజం వారు ఆయన ఆధ్వర్యంలో అనేక నాటకాలను ప్రదర్శించేవారు. "కనక తార", "లంకా దహనం" వంటి నాటకాలను సినిమాలుగా కూడా తీసారు. నాటక రంగంలో చందాల కేశవదాసు మంచి పేరుతో ఒక వెలుగు వెలిగిపోతున్న సమయంలో సినిమా రంగం ఆహ్వానం పలికింది. అప్పటి దాకా భారతదేశ మంతటా మూగ సినిమాలు ఆడేవి. 1931 మార్చి 15న దేశంలో తొలిసారిగా 'ఆలం ఆరా' అనే మాటలతో కూడిన సినిమా వచ్చింది. ఇదే తొలి భారతీయ టాకీ. అదే యేడాది తెలుగులో కూడా టాకీ చిత్రం తీయాలనుకుని భక్త ప్రహ్లాద చిత్రం (1931–32)న ప్రారంభించారు. ఆ చిత్రంలో పాటలు రాయడానికి మన చందాల కేశవదాసును పిలవడంతో ఆయన సినీ జీవితం మొదలైంది. ఈచిత్రంలో ప్రహ్లాదునిగా కృష్ణాజిరావు షిండే, హిరణ్య కశ్యపునిగా మునిపల్లె సుబ్బయ్య, లీలావతిగా సురభి కమలాబాయి నటించారు. చిత్రంలో ఈమె పాడిన పరితాప భారంబు భరియింప తరమా పాటనే చందాల కేశవదాసు సినిమాకు రాసిన తొలిపాట. పరితాప భారంబు భరియింప తరమా...కటకట నే విధి గడువంగ జాలుడు పతి ఆజ్ఞను దాట గలనా పుత్రుని కాపాడ గలనా .....పరి... ఈ విషము నేనెటులను తనయుని ద్రావింపగలను? ధర్మమును కాపాడుదునా? తనయుని కావగగలనా? .... పరి... అలాగే... తనయా ఇటులన్ తగుపలుకు, మునిపల్లె సుబ్బయ్య పాడిన భీకరమగు నా ప్రతాపంబునకు భీతిలేక ఇటు చేసెదవా రెండు పాటలు కూడా చందాల రాశారు. అలా చందాల కేశవదాసు తొలి తెలుగు సినీ కవిగా చరిత్ర కెక్కారు. తొలి చిత్రం భక్త ప్రహ్లాద (1931–32)కు రాసిన పాటలు, 1942లో తీసిన భక్త ప్రహ్లాదలోనూ వాడుకున్నారు. శ్రీకృష్ణ తులాభారం (1935)లో రాసిన పాటలు ఆ తరువాత 1956, 1966లోనూ అందుకే ఆయన తెలుగు సినిమా వాచస్పతిగా చరిత్రకెక్కారు. 'భక్త ప్రహ్లాద' (1931–32) తరువాత కేశవదాసు గారు రచయితగా పని చేసిన సినిమా 'సతీ సక్కు బాయి' (1935). భారత లక్ష్మీ ఫిలింస్ వారి ఈ చిత్రంలో 'కృష్ణా పోబోకురా', 'రాదేల కరుణా', 'ఆటలాడు కోరా', 'పాలుమీగడ పలుమార్లు భుజియించి', 'పాషాణ మెటులైతివో', 'జాగేలా కావగ రారుగా' పాటలు రాశారాయన. శ్రీ కృష్ణతులాభారం' ముత్తరాజు సుబ్బారావు రాసిన రంగస్థల నాటకం తొలిసారిగా చిత్ర రూపం దాల్చి 1935లో విడుదలైంది. జయసింగ్ కృష్ణుడు, ఋష్యేంద్ర మణి సత్యభామ, కపిలవాయి రామనాథశాస్త్రి నారదుడు. ఋష్యేంద్ర మణి, కాంచనమాల, రేలంగి, లక్ష్మీరాజ్యం వంటి నటులకు ఇదే తొలిచిత్రం! 1955లో రాజరాజేశ్వరీ వారు ఇదే చిత్రం తీశారు. సి.ఎస్.రావు దర్శకుడు కాగా, రఘురామయ్య కృష్ణుడు, సూరిబాబు నారదుడు, ఎస్.వరలక్ష్మి సత్యభామ. ఇక 1966లో డి.రామానాయుడు సురేష్ పతాకం కింద మళ్లీ 'శ్రీ కృష్ణ తులాభారం' తీశారు. రామారావు కృష్ణుడు, కాంతారావు నారదుడు, జమున సత్యభామ, కమలాకర రామేశ్వరరావు దర్శకుడు. 1935 లో సి.పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన కాశీ ఫిలింస్ వారి శ్రీకృష్ణ తులాభారం'లో ఆయన రాసిన మూడు పాటలు... భలే మంచి చౌకబేరము, మునివరా తుదికిట్లు నానున్ మోసగింతువా, కొట్టు కొట్టండి బుర్ర పగలు గొట్టండి. ఈ మూడు పాటలను ఆ తరువాత మరో రెండుసార్లు శ్రీకృష్ణ తులాభారం చిత్రాన్ని 1955, 1966ల్లో నిర్మించినపుడు కూడా వాడుకున్నారు. 1935లో అరోరా ఫిలిమ్స్ ఆరోరా ఫిలిమ్స్ వారు 'అనసూయ' చిత్రాన్ని కోల్కత్తాలో తీశారు. ఈ సినిమాకి మాటలు, పాటలు, పద్యాలూ అన్నీ కేశవదాసే రాశారు. 1935లో సతీ అనసూయ, ధ్రువవిజయం, సినిమాలకు రచయితగా పని చేశారు. చందాల కేశవదాసు1936లో వచ్చిన 'లంకాదహనం' సినిమాకు కూడా మాటలు, పాటలు, పద్యాలూ రాశారు. కనకతారకు రాసిన కథ, పాటలు 1937, 1956లోనూ యధాతథంగా ఈ సినిమాల్లో వినియోగించు కున్నారు. మైలవరం కంపెనీ వారి బాలభారతి సమాజం పక్షాన నాటక ప్రదర్శనకోసం పలు ప్రాంతాలు తిరిగారు. హరికథలు చెప్పడంలో కేశవదాసుది అందెవేసిన చేయి. అష్టావధానిగా, హరిదాసుగా నాటి తెలుగు సమాజంలో కేశవదాసుది ఒక ప్రత్యేక స్థానముండేది. స్వాతంత్ర్య సమర సమయంలో గాంధీజీ విధానాలకు ముగ్ధుడై గాంధీని తన రచనలతో ప్రశంసించకుండా వుండలేక పోయారు. "జయతు జై" అంటూ పాట రాయడమే కాక దానిని ఆకుల నరసింహారావు, సాగి రాజేశ్వర రావులతో పాడించి బెంగుళూరులో స్వంత ఖర్చులతో రికార్డు చేయించి ఉద్యమానికి దోహదకారి అయ్యేలా దానిని విడుదల చేసారు. తన కళా ప్రదర్శనల ద్వారా పొందిన బంగారు కంకణాలను, పతకాలను దాచుకోకుండా సత్కార్యాలకోసం ఖర్చుచేసి మార్గదర్శకంగా నిలిచాడు. హరికథా గానంతో వచ్చిన డబ్బుతో భద్రాచలంలో భక్తుల సౌకర్యార్థం బావి త్రవ్వించి, భోజన, విశ్రాంతి ఏర్పాట్లు చేశారు. తన ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న కలపను సీతారామ చంద్రస్వామి రథగోపుర నిర్మాణానికి వాడారు. తమ్మరలో గాలిగోపురం, ధ్వజస్తంభం పనులు డబ్బులేక ఆగిపోతే ఇంటికి మనిషిని పంపించి బార్యచేతి బంగారు గాజులు తెప్పించి అమ్మారు. నల్గొండ జిల్లా హుజూర్నగర్ దగ్గర్లో వున్న సీతారామ చంద్రస్వామి ఆలయానికి గాలిగోపురం నిర్మించారు. ఒంటిమిట్టలోని కోదండ రామస్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ కావించారు. భద్రాచలం తిరువూరు మార్గం నుండి వేళ్లే భక్తులకు తిరువూరులో సత్రాలు ఏర్పాటు చేశారు. స్వంత ఖర్చుతో వీటిల్లో భక్తులకు ఉచిత అన్న దానం చేశారు. కోదాడ మండలం తమ్మరలో సీతారామచంద్రస్వామి ఆలయానికి గాలిగోపురం నిర్మించారు. రజాకార్లు జక్కేపల్లిలో కేశవదాసు ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు. ఆ దాడిలో ఆయన ఆస్తిపాస్తులు, ధనమే గాక అంతకన్న విలువైన ఆయన సాహిత్య సంపద కూడా నాశనమైనది. కేశవదాసు 1956 మే 14న అంటే దుర్ముఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ పంచమి నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం లో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## పల్లె ప్రకృతి వనం.. పట్టించుకుంటే ఆహ్లాదం

తాండూరు : జిల్లాలో పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలు వర్షాలకు జీవం పోసుకుంటున్నాయి. వనాల్లోని నేలలు తేమగా మారుతున్నాయి. వేసవిలో మోడువారిన వృక్షాలు, మొక్కలు ప్రస్తుతం పచ్చని పత్రాలు, కొమ్మలతో కళకళలాడుతున్నాయి. గ్రామీణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే వాటిల్లో సేదతీరేందుకు అనువుగా మారుతున్నాయి. గత భారాస ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకు ఆయా పంచాయతీల పరిధిలో వినియోగంలో లేని ప్రభుత్వ స్థలాలను కేటాయించింది. ఆ స్థలాల్లో అధికారులు వేల్లో మొక్కలు నాటారు.

**ఏడాదిన్నరగా నిర్వహణ కరవు..**

పల్లెల్లోని ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతలను అప్పట్లో గ్రామీణ ఉపాధిహామీ పథకం అధికారులు చూసుకున్నారు. దీనికిగాను ఒక్కో కూలీని ప్రత్యేకంగా నియమించారు. రోజువారీగా మొక్కలకు నీరు పట్టడం, పాదులు సరిచేయడం వంటి పనులు చేయించారు. దీంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. అయిదేళ్లపాటు నిర్వహణ సవ్యంగా




సాగడంతో గ్రామాల సమీపంలోని వనాలు పచ్చని లోగిళ్లుగా తయారయ్యాయి. ఏడాదిన్నరగా నిధుల మంజూరు నిలిచిపోవడంతో నిర్వహణ కరవైంది. పంచాయతీలే చూసుకోవాల్సి ఉండగా.. పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఎండాకాలంలో వనాల్లోని మొక్కలు మోడువారాయి. కొన్ని ఎండిపోయాయి. ప్రస్తుత వర్షాలకు మళ్లీ జీవం పోసుకున్నాయి. వర్షాకాలం తరవాత వనాలు పచ్చగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు. ఇందు కోసం పభుత్వం పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలంటున్నారు.

జిల్లాలో పంచాయతీలు: 566

ఒక్కో వనంలో నాటిన మొక్కలు: 100- 200

## ఏ డిగ్రీ చేస్తే.. ఎలాంటి ఉద్యోగావకాశాలు!

సంగారెడ్డి : ఇంటర్ తర్వాత బీటెక్, ఎంబీబీఎస్‌ల వైపు వెళ్లని వారికి డిగ్రీ చక్కటి ప్రత్యామ్నాయం. గతంతో పోలిస్తే.. విద్యార్థుల కోసం ప్రభుత్వం డిగ్రీలోనూ ఎన్నో కొత్త కోర్సులు తీసుకొచ్చింది. వాటిల్లో బీకాం ఇన్సూరెన్స్, బీబీఏ రిటైలింగ్, బీకాం హెచ్‌ఆర్, బీఎస్సీ (మత్స్య శాస్త్రం), బీఎస్సీ (డేటాసైన్స్) తదితరాలున్నాయి. కంపెనీల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వమే విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తూ.. ఉద్యోగావకాశాలు లభించేలా చేస్తోంది. స్వయం ఉపాధి అవకాశాలు



ఉండనే ఉన్నాయి. ఇప్పటికే ఉన్న పాత కోర్సులు చేస్తే ఎలాంటి ఉద్యోగావకాశాలు ఉంటాయి. కొత్త కోర్సులు చేస్తే ఎలాంటి అవకాశాలు ఉంటాయి.. తదితర సందేహాల నివృత్తి కోసం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. సంగారెడ్డిలోని ప్రభుత్వ తారా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్, డోస్ట్ కన్వీనర్ జగదీశ్వర్, అసిస్టెంట్ ప్రొఫెసర్(కామర్స్) కరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్(స్టాటిస్టికల్) నిర్మల ఫోన్లకు అందుబాటులో ఉంటారు. దిగువ పేర్కొన్న చరవాణుల నంబర్లకు కాల్ చేసి వారితో నేరుగా మాట్లాడి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సూచన. ఫోన్‌ఇన్ నిర్వహించే తేదీ: ఈనెల 17న (మంగళవారం) కాల్ చేయాల్సిన సమయం: 11.30 నుంచి 12.30 వరకుసంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 80085 73233, 80085 73235

## పేదింటి కథ మారుతోంది!

సిరిసిల్ల : పేదల సొం తింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. మొదటి విడతలో 1,023 ఇళ్లు ఎంపిక కాగా, అధికారుల ఆధ్వర్యంలో 439 నిర్మాణాలు ముగ్గులు పోయగా చాలావరకు పనులు ప్రారంభమయ్యాయి. 159 ఇళ్ల బేస్‌మెంట్ పూర్తికాగా 150 ఇళ్ల లబ్ధిదారుల ఖాతాల్లో రూ.లక్ష చొప్పున జమ అయ్యాయి. మరో 200 నిర్మాణాలకు సంబంధించిన బేస్‌మెంట్ పనులు పురోగతిలో ఉన్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. రెండో విడతలో 6,798 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా చెయ్యికిపైగా ఇళ్లకు ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు.

ఎప్పటికప్పుడు ఫొటోలు తీస్తూ..

మొదటి విడతలో ప్రారంభించిన 1,028 ఇళ్లలో ఇప్పటి వరకు రూఫ్ లెవెల్ వరకు 37 ఇళ్లు పూర్తయ్యాయి. మరో ఏడు ఇళ్లకు స్లాబ్‌లు పోశారు.

ఇళ్ల నిర్మాణాలు నిర్మించుకోవడానికి ఆర్థిక స్తోమత లేనివారికి మహిళా సంఘాల నుంచి రూ.లక్ష రుణం మంజూరు చేస్తున్నారు. వీటిని విడతల వారీగా చెల్లించి రుణం తీర్చాల్సి ఉంటుంది.బేస్‌మెంట్‌తోపాటు ఇతర దశలు పనులు పూర్తి కాగానే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్నారు.

లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు చెల్లింపు చేస్తున్నారు. బేస్‌మెంట్ స్థాయిలో రూ.లక్ష, స్లాబ్ వరకు గోడల నిర్మాణానికి రూ.లక్ష, స్లాబ్ వేసిన తర్వాత రూ.2 లక్షలు, మిగతా పనులు పూర్తి చేసిన తర్వాత రూ.లక్ష చెల్లిస్తారు. ఇంటి నిర్మాణానికి దాదాపు పది ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉంటుందని, ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లి ఇసుక తరలింపు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. ఆయా గ్రామ వారీగా లబ్ధిదారులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఇళ్ల పురోగతి తెలియజేయాలని సూచించారు. దీంతో గ్రామాల వారీగా లబ్ధిదారులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల పురోగతి ఫొటోలను గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారు.

# పంచాయతీలపై బకాయిల బండ



వికారాబాద్ : ట్రాక్టర్ల నిర్వహణ మాకొద్దని ఈనెల 12న ధారూర్ మండల పంచాయతీ కార్యదర్శులు తాళాలను ఎంపీడీవోకు అప్పగించారు. వచ్చే వేతనాలతో కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని, దీనికితోడు ట్రాక్టర్ల నిర్వహణ బాధ్యతలు చేపట్టలేమని విన్నవించారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లు పంచాయతీ కార్యదర్శులకు తలకు మించిన భారంగా పరిణమించాయి. సర్పంచులు ఉన్నప్పుడు పల్లెప్రగతి, కేంద్రం 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యేవి. వాటి మంజూరు ఆలస్యమైనా సర్పంచులు సొంత డబ్బులు వెచ్చించి ట్రాక్టర్ల నిర్వహణ చూసుకునేవారు. వారి పదవీకాలం గతేడాది ఫిబ్రవరి 1న ముగియడంతో అప్పట్నుంచి ఆ బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై పడింది. స్థానిక ఎన్నికలు నిర్వహించకపోవడంతో వివిధ మార్గాల్లో నెలకు వచ్చే రూ. 10.4 కోట్ల నిధులు నిలిచిపోయాయి. దీంతో ట్రాక్టర్ల నిర్వహణ అటకెక్కింది. గ్రామాల్లో చెత్త సేకరణ, ఇతర అభివృద్ధి పనులు నిలిచి పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి.

**చిన్న పంచాయతీలకు చాలా కష్టం..** పంచాయతీలకు ట్రాక్టర్ల నిర్వహణ భారమవుతోంది. వాయిదాలు, రహదారి పన్నులు సకాలంలో చెల్లించక పోవడంతో రూ. 3 కోట్ల వరకు బకాయిలు పేరుకున్నట్లు తెలిసింది. పంచాయతీ సేవలకే ట్రాక్టర్లను వినియోగిస్తున్నందున పన్నులు రద్దు చేయించాలని అప్పట్లో కలెక్టర్లు ప్రభుత్వానికి విన్నవించినా ఉత్తర్వులు రాలేదు. దీంతో రహదారి పన్నుల భారం పంచాయతీలపైనే పడుతోంది. ఇన్నాళ్లు రోజూ డీజిల్, అప్పుడప్పుడు మరమ్మతులకు అయ్యే ఖర్చునూ పంచాయతీ కార్యదర్శులే సర్దుబాటు చేశారు. మేజర్ పంచాయతీల కార్యదర్శులు ఎలాగోలా నెట్టుకొస్తున్నా.. చిన్న పంచాయతీలకు ఎలాంటి నిధులు రాకపోవడంతో చాలాచోట్ల మూలన పడేశారు.

**సమస్యలు అధిగమిస్తాం..**

గ్రామాలకు క్రమం తప్పకుండా వచ్చే నిధుల మంజూరు నిలిచిపోవడం తోనే సమస్య ఏర్పడింది. డీజిల్‌కు సంబంధించి రూ. 2 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక వనరులు, ఇంటి పన్నులు, నల్లా బిల్లులు వసూలు చేసి ట్రాక్టర్ల నిర్వహణకు వాడుకోవాలని సూచించాం. ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలోనే సమస్యలను అధిగమిస్తాం.

జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి.

# భావితరాలకు నవోదయం




చొప్పదండి: కార్పొరేట్ పాఠశాలల దీటుగా అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య, ఉత్తమ విలువలు, దేశభక్తి, క్రీడలు ఇలా అన్ని రంగాల్లో విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దుతూ ఆదర్శంగా నిలుస్తోంది చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయం. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిన నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి దేశవ్యాప్తంగా నోటిఫికేషన్ విడుదలైంది. ఆరోతరగతిలో ప్రవేశాలకుగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

**అంతర్జాలంలో దరఖాస్తుల ఆహ్వానం**

విద్యాలయంలో ప్రవేశానికి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో అంతర్జాలంలో దరఖాస్తులు సమర్పించాలి. పాఠశాలలో ఆరోతరగతిలో 80 సీట్లకుగాను ఉమ్మడి జిల్లా నుంచి గతేడాది 10 వేలకుపైగా దరఖాస్తులు రాగా ఈ ఏడాది 12 వేలకుపైగా వస్తాయని విద్యాలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దరఖాస్తు సమర్పణకు జులై 29వ తేదీ చివరి తేదీగా ప్రకటించారు. ఈ ఏడాది డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. జగిత్యాల జిల్లాకు నూతన నవోదయ విద్యాలయం మంజూరు కావడంతో 40 సీట్లు అదనంగా వచ్చే అవకాశముంది.

**అర్హతలు ఇలా..**

3,4,5 తరగతులు ప్రభుత్వం లేదా గుర్తింపు పొందిన పాఠశాలలో చదవాలి.అయిదో తరగతి తప్పనిసరిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చదివి ఉండాలి.

ఆధార్‌కార్డు తప్పనిసరి. లేదా తహసీల్దార్ కార్యాలయం నుంచి నివాస ధ్రువీకరణపత్రం అవసరం.

అభ్యర్థి తల్లిదండ్రులు ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన వారై ఉండాలి. అభ్యర్థులు 01.05.2014 నుంచి 31.07.2016 మధ్య జన్మించిన వారు అర్హులు.

**సీబీఎస్‌ఈ సిలబస్.. నాణ్యమైన విద్య**

ఆరోతరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా బోధిస్తారు. విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించేలా వలస(మైగ్రేషన్) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఏటా తొమ్మిదో తరగతి చిన్నారులను ఇతర రాష్ట్రాలకు పంపిస్తారు. ఇతర రాష్ట్రాల వారిని ఇక్కడికి తీసుకొస్తారు. ఆరోతరగతి నుంచే కంప్యూటర్ విద్య బోధిస్తారు. అధునాతన వసతులతో కూడిన సుమారు 50 వేలకుపైగా పుస్తకాలు కలిగిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఏటా శతశాతం ఉత్తీర్ణత సాధిస్తూ ప్రతిభ చాటుతున్నారు.

**రిజర్వేషన్లు ...**

విద్యాలయంలోని 80 సీట్లలో 75 శాతం (60 సీట్లు) గ్రామీణ ప్రాంత, 25 శాతం (20 సీట్లు) పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. అందులో 15 శాతం ఎస్సీ, 7.5 శాతం ఎస్టీ, 3 శాతం దివ్యాంగులు, బాలికలకు 1/3 వంతు రిజర్వేషన్ అమలు చేస్తారు. అభ్యర్థి ఫొటో, సంతకం, తల్లి/తండ్రి/సంరక్షకుడి సంతకంతో దరఖాస్తులు సమర్పించాలి.

**పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ**

విద్యాలయంలో ప్రవేశాల పరీక్ష, ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉంటుంది. విద్యార్థుల మార్కుల ఆధారంగానే ప్రవేశాలు ఉంటాయి. దళారులను నమ్మొద్దు. దరఖాస్తు, ప్రవేశ పరీక్ష, ఎంపిక ప్రక్రియ పూర్తిగా అంతర్జాలంతోనే ఉంటుంది. ప్రవేశ పరీక్షపై భయం వీడి విద్యార్థులు కష్టపడి పది చదివితే సులువుగా ప్రవేశం పొందవచ్చు.

- పి.మంగతాయారు, ప్రధానాచార్యులు

# అన్నదాతకు సేవలు.. మరింత చేరువ

మంథని : సాగులో ఆధునిక విధానాలపై అన్నదాతలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశం, వారి సందేహాలు నివృత్తి చేయాలనే సంకల్పంతో.. ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల్లో దృశ్య, శ్రవణ మాధ్యమాలను ఏర్పాటు చేసింది. ఇందులో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండనున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి ఒకటి, రెండో విడతలో మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం మూడో దశలో జిల్లాలో 24 అమర్చారు. అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. రైతులకు సూచనలు, సలహాలు మరింతగా చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సేవలను విస్తరిస్తుంది.

**అధిక దిగుబడులకు ఆస్కారం**

వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశు సంవర్ధక, నీటి పారుదలశాఖలకు సంబంధించిన విషయాలపై సలహాలు అందిస్తారు. ఆసక్తి గలవారు ఇందులో పాల్గొని శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు వీక్షించి సాగులో దిగుబడులు పొందే ఆస్కారం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

**38 మాధ్యమాలు**

జిల్లాలోని 14 మండలాల్లో మొత్తం 54 రైతు వేదికలున్నాయి. మొదటి విడతలో 3, రెండో విడతలో 11, మూడో విడతలో 24 కలిపి మొత్తంగా 38 దృశ్య శ్రవణ మాధ్యమాలు ఏర్పాటు చేశారు. అనుభవమున్న శాస్త్రవేత్తలు పంటల సాగు విధానాలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, వ్యాపించే తెగుళ్ల నివారణలపై సూచనలు అందిస్తూ సందేహాలను నివృత్తి చేయనున్నారు.

**ఏఈవోలకు బాధ్యతలు**

జిల్లాలో చాలావరకు రైతు వేదికలకు రక్షణ కరవైంది. వీటిలో ఏర్పాటుచేసిన దృశ్య శ్రవణ మాధ్యమాల విలువ రూ. 4 లక్షల వరకు ఉంటుంది. వీటి బాధ్యత ఏఈవోలకు అప్పగించారు. ఇప్పటికే రైతు వేదికల నిర్వహణ భారంతో సతమతమవుతున్న ఏఈవోలకు వీటి భద్రత చూసుకోవడం తలకు మించిన భారం కానుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని రైతు వేదికల్లో తలుపులు, కిటికీలు సరిగాలేక ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు.

**ప్రతి మంగళవారం కార్యక్రమాలు**

జిల్లాలో రైతులకు సూచనలు, సలహాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు వేదికల్లో దృశ్య శ్రవణ మాధ్యమాలను ఏర్పాటు చేస్తోంది. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, ఉద్యానవనశాఖ అధికారులతో వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలను తెలుసుకోవచ్చు. - ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

## తేలని భూసేకరణ.. ముందుకెళ్లని విస్తరణ

కరీంనగర్ : ఇటీవల గంగాధర మండలం ర్యాలపల్లికి చెందిన ఓ యువకుడు కొత్తపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ముందు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టడంతో మృతి చెందాడు.రాష్ట్ర రాజధానికి వెళ్లాలన్నా, వ్యాపార, పుణ్యక్షేత్రాల నిమిత్తం రైల్వే జంక్షన్‌కు చేరుకోవాలన్నా ఈ రహదారిపైనే ప్రయాణిస్తుంటారు. 40 ఏళ్ల కిందట వేసిన రెండు ప్రధాన జిల్లాలను కలిపే కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి-563 విస్తరణ జరగక ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి.

న్యూస్‌టుడే, గంగాధర: ఒకప్పటి ఉమ్మడి జిల్లా కేంద్రం కరీంనగర్ నుంచి జగిత్యాల వెళ్లే ప్రధాన రహదారి పెరిగిన వాహనాల రద్దీతో ఇరుకుగా మారింది. ఈ దారి వెంట వెళ్లే వాహనాల వరుస చూస్తే ఒక్కోసారి రైలిని తలపిస్తుందంటే అతిశయోక్తి కాదు. కొండగట్టు, ధర్మపురి పుణ్యక్షేత్రాలు, జగిత్యాలలోని పొలాస, కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రకు ఇదే మార్గం కావడంతో నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఇక జగిత్యాల నుంచి



కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వెళ్లాలన్నా ఇదే మార్గం దిక్కు.

**జాప్యంతో ఇబ్బంది**

భారత్‌మాల పరియోజనలో భాగంగా జాతీయ రహదారిగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

వరంగల్ నుంచి హుజూరాబాద్, కేశవపట్నం వరకు రహదారి విస్తరణ పనులు జరుగుతుండగా కరీంనగర్ నుంచి జగిత్యాల రహదారికి మోక్షం కలగడం లేదు.

ఇప్పటికే సర్వే చేయగా భూ నిర్వాసితులకు పరిహారం విషయంలో ఎటూ తేలకపోవడంతో వారికి డబ్బులు ఇవ్వలేదు. భూసేకరణ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

జగిత్యాల జిల్లాలో మాత్రం భూసేకరణ ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. మొత్తం 245.94 హెక్టార్లు అవసరమని గుర్తించి అప్పట్లో 124 ఎకరాలు సేకరించారు.

ఆయా గ్రామాల వద్ద 14 చోట్ల ప్రయాణ ప్రాంగణాలు, 18 చోట్ల బస్సు షెల్టర్లు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించారు.

కరీంనగర్, వెదిర, గంగాధర, జగిత్యాల సమీపంలో 4 నుంచి 5 కి.మీ మేర బైపాస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ మార్గంలో ప్రమాదాలు నివారించడంలో రద్దీ సమస్యను అధిగమించడానికి మొత్తం 31.1 కి.మీపాటు బైపాస్ రోడ్లు నిర్మించనున్నారు.

## కమీషన్‌కు ఎదురుచూపులు

పెద్దపల్లి : అన్నదాతకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. స్వయం సహాయక సంఘాలు, సహకార, డీసీఎంఎస్, మార్కెటింగ్ శాఖలకు కొనుగోళ్ల బాధ్యతలు కట్టబెట్టింది. ఏడాదిలో వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యాన్ని సేకరిస్తున్నారు. అయితే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు కమీషన్ చెల్లింపులో జాప్యం నెలకొంది. ముందుగా ఖర్చు చేస్తున్నప్పటికీ కమీషన్ సకాలంలో రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదు. మరోవైపు రైతులకు హమాలీ ఛార్జీలు రైతులకు గుదిబండగా మారడంతో.. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

**క్వింటాల్‌కు రూ.31.25..**

కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు నిర్వాహకులకు క్వింటాల్ సాధారణ రకానికి రూ. 31.25, 'ఏ' గ్రేడ్ రకానికి రూ. 32 కమీషన్ చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీటి వసతి, విద్యుత్తు, మరుగుదొడ్డు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడంతోపాటు.. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా పరదాలు కప్పుతున్నారు. తేమ శాతం వచ్చేందుకు తూర్పార పడుతున్నారు. బస్తాలకు కుట్టు వేయడం, ధాన్యం లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అయితే సీజన్ ముగిసిన వెంటనే కమీషన్ విడుదల చేస్తామని ప్రభుత్వ ప్రకటన మాత్రం ఆచరణ సాధ్యం కావడంలేదు.

**పేరుకుపోతున్న బకాయిలు**

ధాన్యం సేకరణలో స్వశక్తి సంఘాల మహిళలు, సహకార సంఘాల్లోని సిబ్బంది భాగస్వాములవుతున్నారు. 2024-25 వానాకాలంలో ఏ గ్రేడ్ 29,03,612 క్వింటాళ్లు, సాధారణ రకం 70,182 క్వింటాళ్లు



, యాసంగిలో ఏ గ్రేడ్ 16,86,753 క్వింటాళ్లు, 23,24,328 క్వింటాళ్లు సాధారణ రకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

జిల్లాలో ప్రతి సీజన్‌లో సుమారు 320 కేంద్రాల్లో ధాన్యం సేకరిస్తున్నారు. రెండు సీజన్లలో రూ. 22.16 కోట్ల కమీషన్ విడుదల కావాల్సి ఉంది. పలు రకాల కారణాలతో కమీషన్ బకాయిలు పేరుకు పోతున్నాయి.

ఏడాదిగా కమీషన్ డబ్బులు విడుదలకు నిరీక్షణ తప్పడంలేదు. ఆ సొమ్ముతోనే స్వశక్తి, సహకార సంఘాలు ఆర్థిక బలోపేతం అవుతున్నాయి. వాటి నిర్వాహకులు తీసుకొచ్చిన అప్పులు భారమవుతున్నాయని వాపోతున్నారు.

**వచ్చిన వెంటనే జమ చేస్తాం**

స్వశక్తి, సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. రెండు సీజన్లకు సంబంధించిన కమీషన్ సొమ్ము విడుదల కావాల్సి ఉంది. ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. సొమ్ము వచ్చిన వెంటనే వారి ఖాతాల్లో జమ చేసేలా చూస్తాం.- శ్రీకాంత్, జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

చురకలు



## తక్కువ ధర ఆన్‌లైన్‌లో ఎర.. ఆశపడి ఆర్డర్ పెడితే మొదటికే మోసం

హైదరాబాద్ : రూ.10 వేల విలువైన వస్తువు రూ.5 వేలకే ఇస్తామని ఆన్‌లైన్‌లో ప్రకటన కనిపించిందా..! మంచి బేరం దొరికిందనుకొని సంబరపడి ఆర్డర్ పెట్టారా..! మీ బ్యాంకు ఖాతా లూటీ అయినట్లే..! ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేసే సైబర్ నేరగాళ్లు 'తక్కువ ధర' పేరుతో ఎర వేస్తున్నారు. ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు గుప్పిస్తూ అందినకాడికి దోచేస్తున్నారు. వివిధ వ్యాపారాలకు సంబంధించిన వస్తువులు, గృహోపకరణాలు మార్కెట్‌లో లభించే ధరతో పోలిస్తే 50 శాతం తక్కువ ధరకే ఇస్తామంటూ గాలం వేస్తున్నారు. వాటిని నమ్మి సంప్రదిస్తే మోసపోయినట్టేనని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ బ్రౌజింగ్ చేసే సమయంలో ఇలాంటి ప్రకటనలు ఎక్కువగా వెల్లువెత్తుతున్నాయి. ప్రముఖ ఈ-కామర్స్ వెబ్‌సైట్లకు ఏ మాత్రం తీసిపోని ప్రచార చిత్రాలు, వీడియోలు ఉంటున్నాయి. 'లిమిటెడ్ ఆఫర్' పేరుతో ఖరీదైన వస్తువుల్ని




రాయితీలతో ఇస్తామని ఫోన్ నంబరు అందుబాటులో ఉంచడం ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది.

**ఇవీ జాగ్రత్తలు..!**

ఖరీదైన వస్తువుల్ని తక్కువ ధరకే ఇస్తామంటూ ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనల్ని గుడ్డిగా నమ్మకూడదు.

ప్రముఖ ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో మాత్రమే కొనుగోలు చేయాలి.

ఆఫర్లు ఉన్నాయంటూ ఈ-కామర్స్ వెబ్‌సైట్ల పేరుతో వచ్చే లింకుల్ని ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దు.

వస్తువు ఏదైనా సరే ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో ఆర్డర్ బుక్ చేసేందుకు కొంత మొత్తం కట్టాలని అడగరు.

ఒకవేళ మోసపోతే..ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ లేదా స్థానిక పోలీసులను ఆశ్రయించాలి.ఈ తరహా నకిలీ వెబ్‌సైట్లపై ఫిర్యాదు చేస్తే మరొకరు మోసపోవడానికి అవకాముండదు. ఫలితంగా పోగొట్టుకున్న డబ్బు వెంటనే రికవరీ చేయడానికి సాధ్యమవుతుంది.

## కాగ్నాలో కాసుల వేట

తాండూరు : కాగ్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అనుమతుల మాటున కొందరు.. అవేవీ లేకుండానే మరికొందరు తవ్వుకుపోతున్నారు. దీంతో నదిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అనుమతుల్లేకుండా ఇసుక తరలింపుపై అధికారుల పర్యవేక్షణ కరవైంది. బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గే ప్రమాదముందని పరిసరాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**నాలుగైదు ట్రిప్పులకే అనుమతి ఉన్నా..**

మురుగు కాలువలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరిట ఇసుక తరలిం చేందుకు అధికారులు అనుమతులు జారీ చేస్తున్నారు. తాండూరు మండలం ఖాంజాపూర్, పాత తాండూరు కాగ్నా నది నుంచి రోజుకు నాలుగైదు ట్రిప్పులు తరలించేందుకు అనుమతిస్తున్నారు. ఆ తరవాత తవ్వినా అధికారులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో సదస్సులకు వెళుతున్నారు. ఇదే అదనుగా ట్రాక్టర్ యజమానులు అనుమతులు పొందిన దానికి రెట్టింపుగా ఇసుక తరలిస్తున్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల దాకా తోడేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ద్వారా రోజుకు పది ట్రిప్పులు నడుపుతున్నారు. దీంతో సగానికిపైగా ఇసుకను ప్రైవేటు పనులకు



విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రోజుకు రూ.10- 20వేల వరకు దండుకుంటున్నారు.

**అధికారుల కళ్లుగప్పి..**

నెల కిందట పెద్దేముల్ మండలంలోని ఓ గ్రామంలో సీసీ రహదారి నిర్మించారు. ఆ పనుల పేరిట తిరిగి తాండూరు తహసీల్దారు కార్యాల యం అధికారుల నుంచి అనుమతులు పొందారు. పూర్తయిన రహదారి నిర్మాణానికి ఇసుక అనుమతులు జారీ చేసినట్లు గుర్తించిన అధికారులు ఖంగుతిన్నారు. వెంటనే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. ఖాంజాపూర్ కాగ్నా నది నుంచి ఇసుక తరలించేందుకు అనుమతుల జారీ ప్రక్రియ నిలిపివేశారు. తాజాగా అధికారులు అనుమతులు జారీ చేస్తుండటంతో అక్రమ రవాణాకు మార్గం సుగమమైంది.

**రాత్రివేళల్లో దర్జాగా..**వీర్‌శెట్టిపల్లి, నారాయణ్‌పూర్ కాగ్నా నదిలో ఇసుక తరలించరాదంటూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం దశాబ్దం కిందటే ఉత్తర్వులు జారీ చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. కొన్ని నెలలుగా వీర్‌శెట్టిపల్లి కాగ్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. నిబంధనలు ఉల్లంఘించి రాత్రివేళ దర్జాగా తరలిస్తున్నారు. దీంతో మోకాలి లోతు గుంతలు పడ్డాయి.

## పనిపడదాం.. పడగొడదాం



హైదరాబాద్: నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకొనేలోపు.. అవతలి వారు అక్రమ నిర్మాణాలను పూర్తి చేస్తున్నారంటూ సుప్రీంకోర్టు, హైకోర్టు చేసిన వ్యాఖ్యలతో జీహెచ్‌ఎంసీ అప్రమత్తమైంది. న్యాయస్థానాల సూచనతో నగరంలో అనుమతి లేకుండా చేపడుతోన్న భవనాలను, ఆమోదం పొందిన ప్లాన్‌ను ఉల్లంఘించి చేపట్టే అంతస్తులు, నిర్మాణాలను సీజ్ చేయడమే లక్ష్యంగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఎస్ఓపీ(స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను రూపొందించారు. మొదటి తాఖీదును జారీ చేయడంతోనే అక్రమ నిర్మాణాలకు తాళం వేయాలని ఆదేశిస్తూ జోనల్, సర్కిల్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేశారు. విచారణ పూర్తయ్యాక, సదరు భవనాలపై చర్యలను నిలుపుదల చేయాల్సిన సమయంలో.. సీజ్ చేసిన భవనాలను ఏ స్థాయి అధికారులు, ఎలా విడుదల చేయాలో తెలుపుతూ ఆయన మార్గదర్శకాలు జారీ చేశారు. సీజ్ చేయడం, విచారణ పూర్తయ్యాక అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆయన యంత్రాంగాన్ని హెచ్చరించారు.

**కోర్టులు ఏం చెప్పాయంటే..**

గతేడాది చివర్లో సుప్రీంకోర్టు, ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అనుమతి లేని భవనాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. అడ్డుకునేందుకు పలు సూచనలు చేశాయి. అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలకు షోకాజ్ నోటీసు ఇచ్చి, తదుపరి విచారణ చేపట్టే క్రమంలో నిర్మాణ పనులు ముందుకు సాగకుండా.. ఆయా భవనాలను సీజ్ చేయాలని స్పష్టం చేశాయి. షోకాజ్ నోటీసు జారీ అయ్యాక చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని, కూల్చివేస్తారనే భయం, చట్టంపై గౌరవం వారిలో కనిపించడం లేదని, కఠిన చర్యలతోనే జీహెచ్‌ఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాల సంస్కృతి కట్టడి అవుతుందని హైకోర్టు ఆదేశించింది.

**ఏ సెక్షన్ కింద..**

కూల్చివేత ఉత్తర్వు(స్పీకింగ్ ఆర్డర్)కు ముందు లేదా ఆ ఉత్తర్వు ఇచ్చాక ఆమోదం పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా జరిగే నిర్మాణాలను, అనుమతి లేని భవనాలను జీహెచ్‌ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 461-ఏ కింద, టీజీబీపాస్ చట్టం ప్రకారం జీహెచ్‌ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ సీజ్ చేయవచ్చు.

**నిర్మాణాలను సీజ్ చేసే విధానం..**

నిర్మాణ ప్రాంతాన్ని తనిఖీ చేసి.. అనుమతి లేకుండా చేపట్టిన భవనం లేదా అంతస్తులు, ప్లాన్ ఉల్లంఘనలను తెలుపుతూ.. వాటిని 15 రోజుల్లో ఎందుకు కూల్చవద్దో సమాధానం ఇవ్వాలంటూ నిర్మాణ సంస్థకు లేదా యజమానికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలి.

తాఖీదు అందుకున్నాక కూడా పనులు కొనసాగుతుంటే.. భవనాన్ని సీజ్ చేయవచ్చు. తలుపులకు తాళం వేసి, లక్కతో సీల్ చేయడం, భవనం చుట్టూ ఎరుపు రంగు రిబ్బన్‌ను చుట్టి దానిపై అధికారి సంతకం చేయాలి. ప్రక్రియలో పాల్గొన్న అధికారులు, పోలీసుల పేర్లతో.. ఎలా సీల్ వేశామో తెలుపుతూ.. ఫొటోలు, వీడియోలను జత చేసి కమిషనర్‌కు నివేదిక పంపాలి.

సమాంతరంగా విద్యుత్తు, జలమండలికి నివేదికను పంపించి.. విద్యుత్తు, తాగునీటి కనెక్షన్లను నిలిపేయాలని లేఖ రాయాలి. పోలీసుస్టేషన్‌కు, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుకూ సమాచారాన్ని చేరవేయాలి. విషయం న్యాయస్థానం పరిధిలో ఉంటే జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్‌కూ నివేదిక అందాలి.

కమిషనర్ లేదా న్యాయస్థానం ఆదేశాల్లేకుండా.. సీల్‌ను తొలగించే అధికారం ఎవరికీ లేదు.

డిప్యూటీ కమిషనర్ సీజ్ చేసిన భవనాన్ని జోనల్ కమిషనర్, జోనల్ కమిషనర్ సీజ్ చేసిన భవనాన్ని కమిషనర్ మాత్రమే తొలగించాలి.

మెట్రోకి 'రైల్వే సేఫ్టీ ఎక్సలెన్స్ ఆఫ్ ది ఇయర్' అవార్డు మెట్రో రైల్ లిమిటెడ్‌కి 'రైల్వే సేఫ్టీ ఎక్సలెన్స్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం దక్కింది. దిల్లీలో జూన్ 13న నిర్వహించిన ఎకనామిక్ టైమ్స్ (ఈటీ) ఇన్‌ఫ్రా రైల్ షో-2025లో అవార్డు వరించినట్లు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. భారతీయ రైలు, మెట్రో మౌలిక సదుపాయాల రంగ వృద్ధికి దోహదపడిన సంస్థలను ఈటీ సత్కరించింది. భద్రత, సాంకేతికత, డిజిటల్ ఆవిష్కరణలు, అర్బన్ కనెక్టివిటీలో అగ్రగామిగా నిలుస్తున్న సంస్థలకు పురస్కారాలు అందజేశారు. అర్బన్ మొబిలిటీ భవిష్యత్తులో మరింత తీర్చిదిద్దాల్సిన బాధ్యత మాపై ఉందని ఈ అవార్డు గుర్తుచేసిందని ఎల్‌అండ్‌టీ ఎంఆర్‌హెచ్‌ఎల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి పేర్కొన్నారు.

**జీహెచ్‌ఎంసీకి రూ.30కోట్ల చెల్లని చెక్కులు**

ఆస్తిపన్ను చెల్లింపుల రూపంలో జీహెచ్‌ఎంసీకి రూ.30.11 కోట్ల చెల్లని చెక్కులు అందాయి. పన్ను కట్టకపోతే భవనాలకు తాళం వేస్తామంటూ బల్దియా హెచ్చరించడంతో.. చర్యల నుంచి తప్పించుకునేందుకు వాటిని అందజేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా బేగంపేట సర్కిల్ నుంచి రూ.3.12 కోట్ల చెక్కులు అందగా, సరూర్‌నగర్ నుంచి రూ.2.87 కోట్లు, జూబ్లీహిల్స్‌లో రూ.2.39 కోట్లు, శేరిలింగంపల్లి, మూసాపేటలో రూ.2.08 కోట్లు, ఖైరతాబాద్‌లో రూ.2.06 కోట్లు, గోషామహల్‌లో రూ.1.85 కోట్లు, ఎల్బీనగర్‌లో రూ.1.84 కోట్ల విలువైన చెల్లని చెక్కులు వచ్చాయి. మొత్తం 2,145 చెక్కులు ఖజానాకు చేరడం ఆందోళనకు గురి చేస్తోంది. విచారణ జరిపి, బాధ్యులను గుర్తిస్తామని జీహెచ్‌ఎంసీ స్పష్టం చేస్తోంది.

**ఫ్యూచర్ సిటీ పరిధిలోకి అనుమతులు**

ఫ్యూచర్ సిటీ పరిధిలోని 56 గ్రామాల్లో లే-అవుట్లు, భవన నిర్మాణాల అనుమతులు ఇకపై ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి సంస్థ ఇవ్వనుంది. డీటీసీపీ అనుమతించిన డ్రాఫ్ట్ ప్రణాళికలను హెచ్‌ఎండీఏ/ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి సంస్థ వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయాలి. సాంకేతిక అనుమతులను హెచ్‌ఎండీఏ లేదా ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి సంస్థ ఆమోదిస్తుందని పురపాలకశాఖ ఉత్తర్వులు జారీచేసింది. వీటి ప్రకారం దరఖాస్తులను డీటీసీపీ అధికారులు పరిశీలించకుండా ఉంటే.. వాటిని అక్కడితో నిలిపేయాలి. కొత్తగా హెచ్‌ఎండీఏ/ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి సంస్థకు దరఖాస్తు చేసుకోవాలి. డీటీసీపీ అనుమతి ఇచ్చిన నిర్మాణాల ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలి. దరఖాస్తుదారులు హెచ్‌ఎండీఏ లేదా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను సంప్రదించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## భూగర్భ తీగలు.. తడబడుతున్న అడుగులు



హైదరాబాద్: 'ఉట్టికి ఎగరలేని అమ్మ స్వర్గానికి ఎగురునా?' అనే సామెత చందంగా నగరంలో విద్యుత్తు పంపిణీ సంస్థ తీరు ఉంది. అవుటర్ రింగ్‌రోడ్డు వరకు ఓవర్‌హెడ్ విద్యుత్తు తీగల స్థానంలో భూగర్భ కేబుళ్లు వేయాలని ఒకవైపు ప్రణాళికలు వేస్తూ.. ఇంకోవైపు భూగర్భ కేబుళ్ల కొరతతో రెండున్నర కిలోమీటర్లు వేయలేక చేతులెత్తేసింది. జేబీఎస్ వద్ద రెండు కిలోమీటర్లు భూగర్భ కేబుల్ వేశాక స్టోర్‌లో భూగర్భ తీగలు లేవని పాత పద్ధతిలోనే ఓవర్‌హెడ్ లైన్లు వేసుకోమని గుత్తేదారుకు అనుమతిచ్చారు.

**సమస్యలు తగ్గేలా..**

నగరంలో 84,560 కి.మీ. 33కేవీ, 11కేవీ, ఎల్‌టీ విద్యుత్తు తీగలుంటే.. అందులో భూగర్భ తీగలు 2237 కి.మీ. మాత్రమే. మిగతా 82,323 కి.మీ. ఓవర్‌హెడ్ లైన్లే ఉన్నాయి. ఆదివారం సాగర్‌రింగ్‌రోడ్డు సమీపంలో 11కేవీ తీగలు తెగి ఇద్దరు అభాగ్యులు మృత్యువాతపడ్డారు. ప్రమాదాలే కాకుండా ఎక్కువ అంతరాయాలకు కారణం అవుతున్నాయి. వీటికి పరిష్కారంగా అవుటర్ రింగ్‌రోడ్డు లోపల వరకు భూగర్భ కేబుల్స్ వేయాలని ప్రభుత్వ ఆదేశం మేరకు డిస్కం కసరత్తు మొదలెట్టింది. ఈ ప్రక్రియను వేగవంతం చేస్తే భవిష్యత్తులోనైనా అంతరాయాల సమస్యలు తగ్గే సూచనలు ఉన్నాయి. కానీ ఆచరణలో అడుగులు ముందుకు పడటం లేదు. నిధుల కొరత పెద్ద సమస్యగా ఉందని అధికారులు అంటున్నారు.

**టెండర్లు పిలిచినా...**

నగరంలో ఇప్పటివరకు 33కేవీ విద్యుత్తు ఉపకేంద్రాల మధ్య భూగర్భ కేబుళ్లు వేస్తున్నారు. వచ్చే ఏడాది వేసవి నాటికి మెట్రోజోన్, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ పరిధిలో పెద్దఎత్తున విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణానికి గ్లోబల్ టెండర్లను ఆహ్వానించారు. కొన్నిసార్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో టెండర్లు రద్దు చేశారు. స్థలాల కొరత కూడా ఉపకేంద్రాలకు సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో 800 కి.మీ. వరకు 33కేవీ భూగర్భ కేబుల్స్‌కు టెండర్లు పిలిచామని.. ఉపకేంద్రాల నిర్మాణం మొదలు కాకపోవడంతో యూజీ కేబుళ్ల టెండర్లు రద్దు చేశామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పనులకు అనుమతించిన వాటికీ యూజీ కేబుల్ లేని పరిస్థితి. దీంతో అత్యవసరం పేరుతో మళ్లీ ఓవర్‌హెడ్ లైన్లు వేసేందుకు అనుమతి ఇస్తోంది.

**ప్రస్తుతం నగరంలో**

1280 కి.మీ. భూగర్భ విద్యుత్తు తీగలు (33కేవీ)

3725 కి.మీ. ఓవర్‌హెడ్ తీగలు (33కేవీ)

957 కి.మీ. భూగర్భ తీగలు (11కేవీ)

21,643 కి.మీ. ఓవర్‌హెడ్ తీగలు (11కేవీ)

56,955 కి.మీ. ఎల్‌టీ లైన్లు

## స్కాన్ చెయ్.. చరిత్ర చదివెయ్

గోల్కొండ : చారిత్రక గోల్కొండ కోటను వీక్షించిన పర్యాటకులు ఓ మధురానుభూతిని పొందుతారు. అయితే ఇంతటి విశిష్టత కలిగిన గోల్కొండ కోటకు సంబంధించిన చరిత్ర పుస్తకాలు ఇప్పటికీ అందుబాటులో లేవు. కోటకు వచ్చిన ప్రతి పర్యాటకుడు దాని గురించి తెలుసుకోవడానికి పుస్తకాలపై వాకబుచేసి లేవని నిరాశ చెందుతున్నాడు. పర్యాటకుల అభిరుచిని తెలుసుకున్న కేంద్ర పురావస్తుశాఖ అధికారులు కొత్తగా కోట ప్రధాన ద్వారం వద్ద ఓ క్యూఆర్‌కోడ్‌ను అందుబాటులోకి తెచ్చారు. నిర్మాణాల చిత్రాలు : గోల్కొండ కోటలో పురావస్తుశాఖ ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను చరవాణిలో ఉన్న గూగుల్ స్కానర్‌తో స్కాన్ చేస్తే కోటకు చెందిన సంక్షిప్త చరిత్ర వివరాలు ప్రత్యక్షమవుతున్నాయి. కోటకు మునుపు కాకతీయుల కాలంలో గొల్లకొండగా ఉన్న విషయాలతో పాటు కోట పరిధి 2 కిలోమీటర్ల దూరంలో ఉందని వివరించారు. కోట చుట్టూ ప్రహరీ 7 కిలోమీటర్లుందని, 8 దర్వాజాలు ఉన్నాయని తెలిపారు. కోటలో ఉన్న వాటర్ సిస్టమ్‌పై వివరించారు. అలాగే పాటు కోటలోని వివిధ నిర్మాణాలకు చెందిన 23 కట్టడాల చిత్రాలను పొందుపరిచారు.

**పూర్తి సమాచారం ఇస్తే బాగుంటుంది**

కోటలో పురావస్తుశాఖ అధికారులు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రశంసించిన పర్యాటకులు చరిత్రపై పూర్తి సమాచారం ఇస్తే బాగుంటుందంటున్నారు. కోటను పరిపాలించిన కుతుబ్‌షాహీ రాజుల పేర్లు, వారు పరిపాలించిన చరిత్ర లేకపోవడం లోటుగా భావిస్తున్నారు. నిర్మాణాలను ఒక్కొక్కటిగా చేరుకునేందుకు గూగుల్‌మ్యాప్‌ను అందుబాటులోకి తెస్తే మరింత సౌకర్యంగా ఉంటుందనితెలిపారు.

## పేరుకే భద్రత.. లేదు భరోసా

హైదరాబాద్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. వందల మంది సెక్యూరిటీ గార్డులు, సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంటోంది. కొన్ని వార్డుల్లో పేరుకే సీసీ కెమెరాలు ఉంటున్నాయి. పిల్లల కిడ్నాప్, ఇతరత్రా పెద్ద సంఘటనలు జరిగినప్పుడు హడావుడి చేయడం.. తరువాత షరామామూలే. రెండు రోజుల కిందట గాంధీ ఆసుపత్రి నుంచి ముగ్గురు పరారయ్యారు. ఇందులో ఇద్దరు వార్డుల్లో చికిత్స తీసుకుంటున్న రోగులు కాగా....మరొకరు రోగితో పాటు వచ్చిన మహిళ ఉన్నారు. సిబ్బంది కళ్లుగప్పి వెళ్లిపోయారు.

ఉస్మానియాలోనూ అదే పరిస్థితి ఉంది. ఇక్కడా సగటు ముగ్గురు నలుగురు చెప్పాపెట్టకుండా వెళ్లిపోతున్నారు. పోలీసులకు ఫిర్యాదు అందించిన వెంటనే కొందరిని వెతికి పట్టుకొని తిరిగి అప్పగిస్తున్నారు. మరికొందరి ఆచూకీ మాత్రం లభ్యం కావడం లేదు.

**వార్డుల వద్ద సెక్యూరిటీ డొల్ల...**

గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు నిత్యం 3-4 వేల మంది అవుట్ పేషెంట్ సేవల కోసం వస్తుంటారు. మరో 500 మంది ఆసుపత్రిలో చేరుతుంటారు. రెండుచోట్ల 500 మంది వరకు సెక్యూరిటీ మూడు



షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. సీసీ కెమెరాల నిఘా ఉంది. ప్రతి వార్డు వద్ద సెక్యూరిటీ తప్పనిసరి. లోపలకు ఎవరు వెళుతున్నారు.. బయటకు ఎవరు వస్తున్నారు...అనేది కీలకం. ఇక్కడ పిల్లల వార్డులు సైతం ఉన్నాయి. గాంధీ నుంచి గతంలో పసిపిల్లలను అపహరించిన ఘటనలు ఉన్నాయి. ఇవన్నీ భద్రత డొల్లతనాన్ని చూపెడుతున్నాయి. కొందరు సెక్యూరిటీ గార్డులు చేయి తడిపితే చాలు ఎవరినైనా వార్డుల్లోకి విడిచిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డిశ్చార్జి చేయకుండానే రోగులు బయటకు వెళ్లిపోతున్నా అడ్డుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

గాంధీ నుంచి మిస్సింగ్ కేసులు (జనవరి నుంచి ఇప్పటివరకు)

మొత్తం కేసులు 78 మహిళలు 43 పురుషులు 30 బాలురు 04 బాలికలు 01

## చిరునామా లేని సంస్థలు.. వినియోగదారుల తిప్పలు

హైదరాబాద్ : ఊరూపేరూలేని సంస్థలు వినియోగదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. నకిలీ చిరునామాలతో సేవాలోపాలకు పాల్పడుతూ మోసం చేస్తున్నాయి. దీంతో చట్టపరంగా ఫిర్యాదు చేయాలన్నా, నోటీసులు పంపాలన్నా గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ముఖ్యంగా ఆన్‌లైన్ సంస్థలపై ఇలాంటి ఫిర్యాదులు ఎక్కువగా నమోదవుతున్నాయి. జిల్లా వినియోగదారుల కమిషన్లను ఆశ్రయించాక చిరునామాలపై స్పష్టత కొరవడటంతో లీగల్ నోటీసులు ఎక్కడికి పంపాలనే ప్రశ్న తలెత్తుతోంది. స్పష్టత లేని వివరాలతో నోటీసులు పంపినా ప్రతివాదులకు చేరక తిరిగొస్తుండటంతో ఫిర్యాదుదారులే వాటిని అందించి 'ప్రూఫ్ ఆఫ్ ఫైలింగ్' సమర్పించాలని కమిషన్లు ఆదేశిస్తున్నాయి. దీంతో నష్టపోయిన డబ్బు పొందడం ఎలా అంటూ వాపోతున్నారు.

**ఆన్‌లైన్‌లో ఇబ్బందులు..**

రాజధాని పరిధిలో 4 జిల్లా వినియోగదారుల కమిషన్లుండగా.. ప్రతినెలా 30కి పైగా కేసులు నమోదవుతున్నాయి. ఇందులో 4-5 కేసులు చిరునామాలు సరిగా లేనికారణంగా విచారణవరకు వెళ్లడం లేదు. విమాన ప్రయాణాల్లో రాయితీలు.. విహారయాత్రల్లో అందుబాటు ధరల్లో హోటళ్లంటూ ఆన్‌లైన్‌లో ఆశ చూపుతున్న కొన్ని సంస్థలు వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నాయి. ముషీరాబాద్‌కు చెందిన కిషోర్ సిక్కింలోని పాక్యోంగ్ వెళ్లేందుకు 'వయా.కామ్' ద్వారా టికెట్లు బుక్ చేశారు. చివరి నిమిషంలో ప్రయాణం రద్దయిందంటూ సమాచారం రావడంతో రీఫండ్ కోసం స్పైస్‌జెట్ సిబ్బందికి మెయిల్ చేశారు. ఆడబ్బు వయా.కామ్ ద్వారా వస్తుందని చెప్పడంతో ఆ వెబ్‌సైట్‌లో వివరాల ప్రకారం మెయిల్ చేసినా స్పందన రాలేదు. సికింద్రాబాద్‌లో కార్యాలయం ఉందని తెలుసుకొని వెళ్లగా అలాంటిదేమీ లేదని తేలింది.

**నోటీసులు తీసుకోకుండా ప్రలోభాలు**

ఎమ్మార్పీ మోసాలకు పాల్పడుతున్న కొందరు వ్యాపారులు నోటీసులు తీసుకోకుండా మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. చిరునామాలో



లేమంటూ, పోస్ట్‌మ్యాన్‌ను ప్రలోభాలకు గురిచేస్తూ నోటీసులు తిప్పి పంపుతున్న దాఖలాలున్నాయి. ఈ తరహా కేసులపై ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి కమిషన్లలో ఫిర్యాదులు దాఖలు చేశాం. ఫిర్యాదుదారులు నేరుగావెళ్తే చిరునామా తప్పు అని వెనక్కి పంపుతున్నారు. దీంతో ప్రూఫ్ ఆఫ్ ఫైలింగ్ సమర్పించాలని కమిషన్లు ఆదేశిస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో సమగ్ర వివరాలతో పత్రికా ప్రకటన ఇస్తే కేసు విచారణను కొనసాగించే అవకాశం ఉంది. ఈ నిబంధన ఆధారంగా కేసులపై న్యాయపోరాటం చేస్తాం.

మహేశ్, సఫిల్‌గూడ, ఫిర్యాదుదారు

# నడ్డివిరుస్తున్నాయ్..!

కోరుట్ల: జిల్లాలో జగిత్యాల తర్వాత రెండో అతిపెద్ద పట్టణం కోరుట్ల. పట్టణంలో దారులన్నీ గుంతలమయంగా మారి అధ్వానంగా మారాయి. మొత్తం 33 వార్డులుండగా సుమారు 86 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. రోజురోజుకు పట్టణం విస్తరించినంతగా అభివృద్ధి కనిపించడం లేదు. నాలుగేళ్ల కిందట అర్బన్ మిషన్ భగీరథ పథకం కింద సుమారు 190 కి.మీల పైగా సీసీరోడ్లు, మట్టిరోడ్లను తవ్వి ఇంటింటికీ కుళాయిలను బిగించారు. భగీరథ పైపులైన్ నిర్మాణంతో సిమెంట్ రోడ్లను తవ్వారు. నాసిరకంగా మరమ్మతు చేసి వదిలేశారు. దీంతో పట్టణంలో ఏవార్డుకు వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు నడిపించే వారి నడ్డి విరిచేలా సిమెంట్‌రోడ్లు మారాయి.అయిదేళ్లుగా దెబ్బతిన్న సీసీరోడ్లపై నూతన రోడ్ల నిర్మాణాలు చేట్టాలని పట్టణ ప్రజలు బలియా అధికారులు, పాలకులతో మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేకుండా పోయాయి. టీయూఎఫ్ఐడీసీ కింద పట్టణంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణాలకు రెండేళ్ల కిందట రూ.15 కోట్ల నిధులు మంజూరుకాగా నవంబరు 2024లో అప్పటి ఎమ్మెల్యే భూమి పూజ సైతం చేశారు. అనంతరం రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో పాత టీయూఎఫ్ఐడీసీ నిధులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అనంతరం కొత్తగా ఎన్నికైన కోరుట్ల శాసనసభ్యులు



డా.సంజయ్ ప్రతి అసెంబ్లీ సమావేశాల్లోనూ కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు టీయూఎఫ్ఐడీసీ కింద గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.30 కోట్ల నిధులు విడుదల చేయాలంటూ వాపోయినా ప్రభుత్వం విడుదల చేయడం లేదు. పట్టణంలో 200 కి.మీ వరకు మురుగు కాలువలున్నాయి. చాలావరకు కాలువలు దెబ్బతిని గోడలు కూలిపోతున్నాయి. కాలువల పైకప్పులు దెబ్బతిని బుంగలు పడుతున్నా నిధులు లేవంటూ నూతన నిర్మాణాలు చేపట్టకుండా బల్దియా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. రాత్రిపూట దెబ్బతిన్న రోడ్లు, మురుగు కాలువతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి బోల్తాపడి గాయాలపావుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పురపాలక సంఘ ఏఈ అరణ్‌కుమార్‌ను వివరణ కోరగా రెండేళ్ల కిందట రూ.15 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరయ్యాయని, తర్వాత ప్రభుత్వం వాటిని నిలిపివేసిందన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే పట్టణంలో నూతనంగా సిమెంట్‌రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు.

# మట్టి తరలిస్తూ.. గట్టును సాగు చేస్తూ



మల్యాల: మల్యాల మండలంలో రాజారం గ్రామ శివారు నుంచి తాటిపల్లి వరకు దాదాపు 15 కి.మీల పొడవు కాకతీయ కాలువ ఉంది. దీనికి ఇరువైపులా మట్టి మాయం కావడంతో ఆయా గ్రామాల పరిధిలో వందలకొద్ది ఎకరాల విస్తీర్ణంలోని కాలువ భూములను ఆక్రమించుకొని పొలాలుగా మారుస్తున్నారు. కొందరు మామిడి తోటలను కూడా సాగు చేసుకున్నారు. ఇళ్లకు ఆనుకొని ఉన్న భూముల్లో నిర్మాణాలు చేపట్టినా అధికారులు స్పందించడంలేదు. రాజారం వద్ద కాకతీయ కాలువగట్టుపై భవనాలు, ఇతర నిర్మాణాలు జరిగినా ఎలాంటి చర్యలు లేవు. మండలంలోని రాంపూర్ శివారు నుంచి బల్వంతాపూర్ శివారు వరకు దాదాపు 20 కి.మీ వరద కాలువ గట్టుపై ఉన్న మట్టిని తరలిస్తున్నారు. మట్టి తరలింపు కోసం తక్కువ చలానా చెల్లిస్తూ పెద్ద ఎత్తున మట్టిని అక్రమంగా తరలిస్తుండటంతో కనుమరుగవుతున్నాయి. గుత్తేదారుల నుంచి సంబంధిత శాఖ సిబ్బంది మామూళ్లు తీసుకుంటూ అక్రమ దందాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. చదునుగా మారిన భూములను ఆక్రమించుకొని కొందరు సాగు చేసుకుంటుండగా కొన్ని చోట్ల అక్రమ నిర్మాణాలు కూడా వెలిశాయి. వరద కాలువ స్థలంలో క్రషర్లు ఏర్పాటు చేసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. మల్యాల మండలంలో వరద కాలువ, ఎస్సారెస్పీ కాకతీయ కాలువ గట్లు మాయమవుతున్నాయి. దాదాపు 75 మీటర్ల కుడి 75 మీటర్ల ఎడమ వైపు వెడల్పుగల కాలువ గట్లపై గుట్టలుగా ఉన్న రాళ్లు, మట్టిని కొందరు అక్రమంగా తరలించుకుపోతున్నారు. కొందరు గుత్తేదార్లు మట్టి, రాళ్లు తీయడానికి ఇరిగేషన్ శాఖకు తక్కువ మొత్తంలో చలానా చెల్లిస్తూ అధిక మొత్తంలో రోజుల తరబడి మట్టిని రవాణా చేయడం సర్వ సాధారణమైపోయింది.

**సర్వే చేయించి చర్యలు**

ఎస్సారెస్పీ కాలువ స్థలాల ఆక్రమణలను గుర్తించేందుకు సర్వే చేపట్టి వివరాలను డిజిటలైజేషన్ చేయిస్తాం. 1970లో ప్రాజెక్టు కాలువలు, క్యాంపుల నిర్మాణాలకు సేకరించిన స్థలాలను పరిరక్షిస్తాం. తాజా మ్యాప్‌ల ప్రకారం స్థలాల హద్దులను నిర్ణయించి భూములు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటాం. లక్షలాది ఎకరాల పంటపొలాలకు సాగునీరందించే కాలువ భూముల పరిరక్షణకు ప్రజలు కూడా సహకరించాలి. – ఎహెచ్.ఖాన్, నీటిపారుదల శాఖ అధికారి

**మొక్కలు నాటిస్తాం..**వరద కాలువకు ఇరువైపులా రాళ్లు, మట్టిని అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేయించి, వాహనాలు సీజ్ చేయిస్తున్నాం. వరద కాలువ స్థలంలో అక్రమంగా క్రషర్లు, ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా సర్వే చేయించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. వరద కాలువ స్థలం ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు హద్దులు ఏర్పాటు చేయించి అందులో మొక్కలు నాటేందుకు ఈజీఎస్‌కు అప్పగిస్తాం.– తిరుపతి, ఇరిగేషన్ డీఈ

# సహజ సాగుకు సమాయత్తం

కొత్తగూడెం: ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సహజ పద్ధతుల్లో విభిన్న పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు 'నేషనల్ మిషన్ అండ్ నేచురల్ ఫార్మింగ్' పథకానికి శ్రీకారం చుట్టింది. మూసపద్ధతిలో సాగుకు స్వస్తిపలికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించే పంటలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. ఇందుకోసం ఖమ్మం జిల్లాలో 15, భద్రాద్రి జిల్లాలో 22 క్లస్టర్లలో 33 గ్రామాలను ఎంపిక చేసింది. త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

జాతీయ సహజ వ్యవసాయ మిషన్ విశేషాలు..

సురక్షితమైన పోషకాహారాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సహజ సాగు పద్ధతులను ప్రోత్సహిస్తుంది.

2025–26లో ఈ పథకం కోసం వెచ్చించే రూ.2,481కోట్ల మూలధనంలో కేంద్ర ప్రభుత్వం రూ.1,584కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.897కోట్లు ఖర్చు చేయనున్నాయి.

ఇప్పటికే సాగులో సేంద్రియ పద్ధతులు పాటిస్తున్న రైతులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్‌లు), వ్యవసాయదారుల ఉత్పత్తి సంఘాలు(ఎఫ్‌పీఓలు), స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీలు) వంటి వాటికి ఈ పథకంలో ప్రాధాన్యమిస్తారు.

సేంద్రియ వ్యవసాయానికి అవసరమయ్యే సహజ ఉత్పత్తులను రైతులకు సులభంగా అందుబాటులో ఉంచేందుకు అవసరాన్ని బట్టి జీవాధార వనరుల కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, రైతుల పొలాల్లో 2వేల వరకు నమూనా



సహజ వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పుతారు.

ఆసక్తి గల రైతులకు నిపుణులైన శిక్షకులు (మాస్టర్‌ట్రైనర్లు) సహజ వ్యవసాయ పద్ధతులు, జీవ ఎరువుల తయారీ వంటి వాటిలో శిక్షణనిస్తారు.

జిల్లాల్లో ఎంపిక చేసిన వ్యవసాయ క్లస్టర్లలో ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు, స్థానిక రైతుల మధ్య సహకారం పెంచేందుకు 'కృషి సఖులు, సాగు సహాయకుల(సీఆర్పీ)ను ఉపయోగించుకోనున్నారు.

**చేకూరే ప్రయోజనాలు..**

సేంద్రియ ఎరువులు, జీవసంబంధ పద్ధతుల వాడకం వల్ల నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, భూసారం మెరుగుపడుతుంది.

రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గటం వల్ల వాతావరణంలో కార్బన ఉద్గారాలు తగ్గుతాయి. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్, ధర ఉండటం వల్ల రైతులకు ఆదాయం పెరుగుతుంది. సేంద్రియ ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి సురక్షితమైనవి. పోషక విలువలను అధికంగా కలిగి ఉంటాయి.

సహజ వ్యవసాయం పర్యావరణ అనుకూలమైన, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. స్థానిక వనరుల వినియోగం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుంది.

శ్రీనివాస్, కేవీకే, శాస్త్రవేత్త, భద్రాద్రి

# వరదొస్తే రాకపోకలు బంద్



ఇబ్రహీంపట్నం : వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసిన సమయాల్లో వరదలతో మండలంలోని ఫకీర్ కొండాపూర్, వర్షకొండ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఆయా గ్రామాల శివార్లలో లోలెవల్ వంతెనల వద్ద వరద ఉధృతంగా ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అత్యవసర సమయాల్లో సైతం ఇతర గ్రామాలకు రాకపోకలు సాగించలేరు. ఇన్నేళ్లు రెండు గ్రామాలు దిగ్బంధంలో ఉంటున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

**నిలిచిన పనులు**

ఫకీర్ కొండాపూర్ గ్రామ జనాభా సుమారు 1150 వరకు ఉంటుంది. గ్రామానికి ఒక దారి మండలంలోని యామాపూర్ గ్రామం నుంచి ఉండగా, మరో దారి మల్లాపూర్ మండలం నడికుడ గ్రామం నుంచి ఉంటుంది. ఫకీర్ కొండాపూర్ గ్రామశివార్లలో రెండు రహదారులపై లోలెవల్ వంతెనలున్నాయి. భారీ వర్షం కురిసినప్పుడల్లా లోలెవల్ వంతెనల వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆయా సమయాల్లో అత్యవసర పరిస్థితులున్నా ఏమి చేయలేని పరిస్థితి గ్రామస్థులది. ఫకీర్ కొండాపూర్ నుంచి యామాపూర్ వెళ్లే దారిలో లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేయగా నిర్మాణ పనులు ప్రారంభించారు. పిల్లర్ల దశకు చేరిన తర్వాత పనులు నిలిచిపోయాయి. కొన్ని నెలలుగా పనులు నిలిచి పోవడంతో ఈ సంవత్సరం కూడా తిప్పలు తప్పేలా లేవని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

**శంకుస్థాపనకు రెండేళ్లు**


వర్షకొండ గ్రామ జనాభా సుమారు 6000 వరకు ఉంటుంది. గ్రామానికి ప్రధానంగా ఇబ్రహీంపట్నం నుంచి రెండు వరుసల రహదారి, నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల గ్రామం నుంచి రెండు వరుసల ప్రధాన రహదారి ఉంటుంది. ఇబ్రహీంపట్నం, వర్షకొండ మధ్య రహదారిపై రెండు లోలెవల్ వంతెనలు, ఏర్గట్ల నుంచి వర్షకొండ మధ్య రహదారిపై ఏర్గట్ల గ్రామశివారులో ఓ లోలెవల్ వంతెన ఉంటుంది. వర్షకొండ, డబ్బా గ్రామాల మధ్య రహదారిపై వర్షకొండ శివారులో ఓ లోలెవల్ వంతెన ఉంటుంది. దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడు ఆయా వంతెనల వద్ద వరద ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి. ఇబ్రహీంపట్నం, వర్షకొండ మధ్య రహదారిపై ఉన్న రెండు లోలెవల్ వంతెనల స్థానంలో హైలెవల్ వంతెనల నిర్మాణానికి రెండేళ్ల కిందట రూ.2 కోట్ల చొప్పున నిధులు మంజూరు కాగా అప్పటి ఎమ్మెల్యే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి రెండేళ్లు అవుతున్నప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

# పెరిగిన రద్దీ..
# సౌకర్యాలు లేక ఇబ్బంది

మిర్యాలగూడ : మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరగడంతో పాటు సంస్థ సైతం ఆదాయ బాట పట్టింది. ఈ తరుణంలో సంస్థ ఉన్నతాధికారులు పలు వినూత్న కార్యక్రమాలు చేపడుతూ..ప్రయాణికులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే వారు చేపట్టే కార్యక్రమాల ఫలాలు క్షేత్ర స్థాయిలో ప్రయాణికులకు అందకపోవడం, సేవలు నాణ్యతతో లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఇదే తీరు నెలకొంటుంది.

**మరుగుదొడ్లకు తాళం..**

అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉచితంగా వాడుకునే సదుపాయాన్ని సంస్థ కల్పించింది. ఇందుకు గాను టికెట్‌తో పాటే ప్రత్యేక సెస్సును సైతం ప్రయాణికుల నుంచి వసూలు చేస్తుంది. పలు బస్టాండ్లలో ఆర్టీసీ మరుగుదొడ్లతో పాటు ప్రైవేట్ మరుగుదొడ్లు సైతం ఉన్నాయి. ఆర్టీసీ మరుగుదొడ్లను నీళ్లు లేవనే కారణంతో ఎక్కువ సమయం మూసి ఉంచుతుండడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు డబ్బులు చెల్లించి ప్రైవేట్ మరుగుదొడ్లను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. మిర్యాలగూడలో ఆర్టీసీ మరుగుదొడ్ల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది.. ప్రైవేటు వారితో కుమ్మక్కై తరచూ ఉచిత మరుగుదొడ్లకు తాళం వేస్తున్నారనే



ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

**కానరాని ప్రథమ చికిత్స పెట్టెలు..**

ఆర్టీసీ బస్సుల్లో పల్లె వెలుగు నుంచి ఏసీ బస్సు వరకు ప్రథమ చికిత్స పెట్టెలు తప్పని సరిగా ఉండాలి. అందులో చిన్న చిన్న గాయాలైతే ప్రథమ చికిత్స చేసేందుకు అవసరమైన మందులు, కాటన్, కట్టు కట్టే వస్త్రం వంటివి అందుబాటులో ఉంచాలి. ఇటీవల కొత్తగా వచ్చిన బస్సులను మినహాయిస్తే మిగిలిన 70 శాతం బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు లేకపోగా పెట్టెలు ఉన్న బస్సుల్లో వాటిని సిబ్బంది మందులకు బదులుగా టిక్కెట్ ముద్రణ కాగితం, ఇతర సామగ్రి దాచుకునేందుకు ఉపయోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో సుమారు 590 బస్సులు ఉండగా వేలాది మంది ప్రయాణికులు నిత్యం వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు.

**వేసవిలో వేడి నీరే గతి...**

సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే వారికి తాగునీటి సీసా అందిస్తున్నారు. ఇందుకు గాను ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.10 అదనంగా ఛార్జీతో పాటే వసూలు చేస్తున్నారు. వేసవిలో నీళ్ల సీసాలు మొత్తం వేడిగా మారుతుండడంతో ప్రయాణికులు ఆ నీటిని తాగేందుకు వెనుకాడుతున్నారు. తమ వద్ద నుంచి డబ్బు వసూలు చేస్తున్నప్పటికీ కనీసం వేసవిలో నైనా చల్లని నీరు అందించే ఏర్పాటు చేయట్లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటాం

కొణతం జాన్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం, నల్గొండ ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు ఉండాలి. పాత బస్సుల్లో చికిత్స సామగ్రి గడువు తేదీ ముగియడంతో తీసేస్తున్నాం. కొత్తగా వచ్చిన బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో ఉన్నాయి. పాత వాటిలో సామగ్రి అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం. సూపర్ లగ్జరీ బస్సుల్లో వేసవిలో తాగునీరు వేడిగా ఉండకుండా చర్యలు తీసుకుంటాం. అన్ని బస్టాండ్లలో 24 గంటల పాటు ఉచిత మరుగుదొడ్లు తెరిచే ఉంచేలా ఆదేశాలు జారీ చేస్తాం.

# సీలింగ్ భూముల్లో రిజిస్ట్రేషన్లు రద్దు



కరీంనగర్: నిషేధిత జాబితాలో ఉన్న సీలింగ్ భూముల్లో జరిగిన రిజిస్ట్రేషన్లను కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి రద్దు చేశారు. లోకాయుక్త ఆదేశాలతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లి హవేలిలో సర్వే నంబర్లు 175, 197, 198లలో దాదాపుగా 20 ఎకరాల సీలింగ్ భూమి ఉంది. ఈ భూముల విషయంలో కొన్నేళ్లుగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ స్థలాలను కొందరు ఆక్రమించుకుని ఇంటి నంబర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన నరెడ్ల శ్రీనివాస్ 2015లో లోకాయుక్తను ఆశ్రయించగా ఈ భూముల్లో ఎలాంటి లావాదేవీలు, రిజిస్ట్రేషన్‌లు జరపకూడదని 2016లో ఆదేశాలిచ్చింది. అప్పటి నుంచి ఈ సర్వే నంబరు భూములను నిషేధిత జాబితాలో పెట్టినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కరోనా సమయంలో 2021 ఫిబ్రవరిలో నరెడ్ల శ్రీనివాస్ మృతి చెందారు. ఆ తరువాత ఎవరూ పట్టించుకోకపోవడంతో చదరపు గజాల రూపంలో పలు ప్లాట్లను ఇంటి సంఖ్యలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారులు ఇటీవల గుర్తించారు. 2018 నుంచి 2024 వరకు మొత్తంగా ఈ భూముల్లో 476 డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ భూముల్లో ఎందుకు రిజిస్ట్రేషన్లు జరిగాయని లోకాయుక్త ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేయడంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం నివేదికను అందించింది. కలెక్టర్ పమేలా సత్పతి ఈ నెల 12న ఈ భూముల్లో జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


**కొనుగోలుదారుల్లో ఆందోళన**

నిషేధిత జాబితాలో ఉన్న భూములు కొన్నవారు రిజిస్ట్రేషన్లు రద్దు చేయడంతో ఆందోళనలో మునిగిపోయారు. ఈ భూముల విలువ బహిరంగ మార్కెట్లో దాదాపు రూ.80 కోట్ల వరకు ఉంటుంది. కొందరు స్థిరాస్తి వ్యాపారులు చక్రం తిప్పారనే ఆరోపణలున్నాయి. కొత్తపల్లి మండలంలోని భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు గంగాధరలోని కార్యాలయంలో జరుగుతుండటం వల్ల కూడా రిజిస్ట్రేషన్ల వ్యవహారం కొత్తపల్లి రెవెన్యూ అధికారులు గుర్తించలేదనే వాదనలున్నాయి. నిషేధిత భూములకు సంబంధించి ఎఫ్1/07/2015 లేఖ ద్వారా కలెక్టర్ కార్యాలయం నుంచి 2016 ఆగస్టు 23వ తేదీన జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ఈ భూముల వివరాల్ని పొందుపరుస్తూ లేఖ రాసినట్లు కలెక్టరేట్ వర్గాలు స్పష్టం చేశాయి. 2016 డిసెంబరు 29న అప్పటి డీఆర్వో మరో లేఖని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరవేశారు. అయినా ఈ భూముల్లో ఏకంగా 476 ప్లాట్లకు సంబంధించిన క్రయవిక్రయాలు జరగడంతో రిజిస్ట్రేషన్ శాఖ ఉదాసీనంగా వ్యవహరించిందన్న ఆరోపణలు వస్తున్నాయి. సర్వే నంబర్లు కాకుండా ఇంటి నంబర్లతో ఈ రిజిస్ట్రేషన్‌లు చేస్తూ వచ్చినట్లు డాక్యుమెంట్‌లను బట్టి తెలుస్తోంది. ఈ విషయమై కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్‌ను సంప్రదించగా గతంలో ఈ భూముల విషయంలో అప్పటి కలెక్టర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ రాశారని తెలిపారు. కొత్తపల్లి హవేలిలోని మూడు సర్వే నంబర్లలో జరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను జిల్లా కలెక్టర్ రద్దు చేసిన మాట వాస్తవమేనన్నారు. ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రద్దు చేయమని జిల్లా కలెక్టరు ఉత్తర్వులిచ్చారని తెలిపారు.

# సాగర్ కళకళ..
# గోదావరి వెలవెల

ఖమ్మం: గతేడాది కన్నా భిన్నంగా ఈసారి సాగర్ జలాశయం నీటితో కళకళలాడుతోంది. జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండటంతో వేసవిలో తాగునీటి గండం నుంచి గట్టెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు భద్రాద్రి జిల్లాలోని గోదావరిలో నీటిమట్టం క్రమేణా తగ్గుతోంది. నీటిని పొదుపుగా వాడటంతో పాటు.. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది.

**ఢోకా లేనట్టే..** పాలేరు జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 2.558 టీఎంసీలు. ప్రస్తుతం 1.975 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. ఇక్కడి నుంచి సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లోని 2,375 ఆవాసాల తాగునీటి అవసరాలకు 137 క్యూసెక్కుల జలాలు సరఫరా అవుతున్నాయి. ప్రస్తుత నిల్వలతో ఈ వేసవికాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు ఢోకాలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వైరా రిజర్వాయర్ నుంచి వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని పదకొండు మండలాల్లో 465 గ్రామాలకు రోజుకు పదికోట్ల లీటర్ల తాగునీరు సరఫరా అవుతుంది. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.30 అడుగులు కాగా.. ప్రస్తుతం 14.90 అడుగుల వద్ద నీరు ఉంది. వేసవి అవసరాలకు ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి పాల్వంచకు 0.2 టీఎంసీలు, కొత్తగూడెం పట్టణానికి 0.473 టీఎంసీల నీరందుతుంది. వీటితోపాటు



పారిశ్రామిక ప్రాంతాలైన కేటీపీఎస్, నవభారత్‌కు జలాలు సరఫరా అవుతాయి. 'కిన్నెరసాని' పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా.. ప్రస్తుతం 396.7 అడుగుల వద్ద నీరు ఉంది. ఈ నిల్వలు వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చనున్నాయి.

**గోదావరి పరీవాహకంలో ఇక్కట్లు**

గోదావరి పరీవాహకంలో కాస్త ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం రెండు అడుగులకే పరిమితమైంది. పర్ణశాలలోని మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ నుంచి చర్ల, దుమ్ముగూడెం మండలాలకు రోజుకు 50 లక్షల లీటర్లు, భద్రాచలం పట్టణానికి గోదావరి నుంచి నిత్యం 65 లక్షల లీటర్ల తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగితే గోదావరి నీటిమట్టం మరింత తగ్గుతుంది. తాగునీటి అవసరాలను బట్టి ఎగువ ప్రాంతాల నుంచి గోదావరి జలాలను రప్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

# ‘పోషక్’ భూముల్లో కబ్జాల కంచె

కర్నూలు: కోసిగి మండలం ‘పోషక్ ఫార్మింగ్ ఫారెస్ట్రీ అండ్ ఫైనాన్స్ లిమిటెడ్’ భూములను వైకాపా నేతలు కొందరు పప్పు బెల్లాల్లా పంచేసుకొన్నారు. మంత్రాలయం ఎమ్మెల్యే బావమరిది మురళీమోహన్‌రెడ్డి ఆక్రమించుకొన్న విషయం కొద్ది రోజుల కిందట వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే.. తాజాగా మరికొందరు వైకాపా నేతల పేర్లు బయటకొచ్చాయి. కందుకూరులో 16, 18, 20, 25, 139, 190, 161, 164, 189, 192, 241, 242, 100ఎ, 201, 261, 267 సర్వే నంబర్లు, కర్రదొడ్డిలో 13, 14, 15 సర్వే నంబర్లు, బొమ్మలాపురంలో 61, 71, 77, 52 సర్వే నంబర్లలోని భూములను భూములను పోషక్ సంస్థ గతంలో కొనుగోలు చేసింది. ఆయా సర్వే నంబర్లలో ఆన్‌లైన్‌లో ఇతరుల పేర్లు కనిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారుల సహకారంతో ఆన్‌లైన్‌లో పేర్లు మార్చుకొన్నట్లు తెలుస్తోంది. కొందరికి వారసత్వంగా వచ్చినట్లు చూపించారు. అక్రమార్కుల పేర్లతో పాస్ పుస్తకాలనూ జారీ చేశారు.

**ఎమ్మెల్యే బావమరిది ఆగడాలు**

మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి బావమరిది మురళీమోహన్‌రెడ్డి కందుకూరులోని సర్వే నంబరు 324–2లో 6.52 ఎకరాలు, సర్వే నంబరు–312లో 4.6 ఎకరాలు స్వాధీనం చేసుకొన్నారు. 11.12 ఎకరాల గ్రామ సర్వీసు ఇనాం భూమీ ఆయనకు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. అదే గ్రామంలో సర్వే నంబరు 328–2లోని రెండెకరాలు ఆయనకు అనువంశికంగా వచ్చినట్లు దస్త్రాల్లో చూపారు. మురళీమోహన్‌రెడ్డిది మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామం కాగా, ఆ ప్రాంతానికి 10 కి.మీ. దూరంలోని కోసిగి మండలం



కందుకూరు గ్రామంలో అనువంశికంగా వచ్చినట్లు భూములు ఉ ండటం గమనార్హం.

**వీరికీ రాసిచ్చేశారు**

గంగాధరస్వామి మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన పేరుతో కోసిగి మండలం కందుకూరు గ్రామంలో సర్వే నంబరు 324–1లో 5.89 ఎకరాలు, సర్వే నంబరు 312లో 4.6 ఎకరాల గ్రామ సర్వీస్ ఇనాం భూమి ఉంది. అతని కుటుంబం గ్రామానికి ఎలాంటి సేవలు అందించలేదని, ఆయనకు గ్రామ సర్వీస్ ఇనాం భూమిని ఎలా కేటాయించారో అధికారులకే తెలియాలి. ఆ రెండు సర్వే నంబర్లలోని భూమిని 2023లో ఫ్రీహోల్డ్ చేశారు.గంగాధర స్వామికి కందుకూరు గ్రామంలోని సర్వే నంబరు 49–1లో 4.28 ఎకరాలు, 49–ఎ సర్వే నంబరులో 0.78 ఎకరాలు, 328–1 సర్వే నంబరులో 3 ఎకరాలు అనువంశికంగా వచ్చినట్లు చూపారు. 269–బి1లో ఒక ఎకరం భూమి డీపట్టా ఉన్నట్లు రికార్డులో నమోదు చేశారు. గంగాధర స్వామికి అనువంశికంగా వచ్చిన భూములను, సర్వీసు ఇనాం భూములు అన్నింటికీ కలిపి 2023 ఫిబ్రవరి 21న మ్యూటేషన్ జరగడం గమనార్హం.

కందకూరు గ్రామంలో కోసిగి మండల వైకాపా కన్వీనర్ బెట్టన గౌడ పేరుతో సర్వే నంబరు 16/1లో 9.15 ఎకరాలు, 100ఎలో 3 ఎకరాలు, 201లో ఒక ఎకరం భూమి వారసత్వంగా వచ్చినట్లు చూపారు. ఆయా సర్వే నంబర్లు పోషక్ సంస్థకు చెందిన సర్వే నంబర్లలో ఉన్నాయని విశ్రాంత డీఎస్పీ భాస్కర్‌నాయుడు ఆరోపిస్తున్నారు.

# అరణ్యం వదిలిన చిరుతలు

ఆత్మకూరు : నల్లమలలో పెద్ద పులులు, చిరుతల సంఖ్య పెరిగింది.. ఒక మగ పులి 100 చదరపు కి.మీ. మేర తన సామ్రాజ్యంగా హద్దుల్ని నిర్దేశించుకొంటుంది. ఆ పరిధిలో చిరుతలు తిరగడానికి ఇష్టపడవు.. నల్లమల ప్రాంతంలో ప్రస్తుతం 90 వరకు పెద్ద పులులు ఉన్నాయి.. వీటి సంఖ్య పెరగడంతో బతుకుజీవుడా అంటూ చిరుతలు అరణ్యం వదిలి.. ఆరుబయటకొచ్చేస్తున్నాయి. పశ్చిమ ప్రాంతంలో ఎక్కువగా కొండలు, గుట్టలు ఉన్నాయి. చిరుతల ఆవాసానికి అనువుగా ఉ ండటంతో ఇక్కడికి వలస బాట పట్టాయి. నల్లమలను వీడిన చిరుత పులులు శ్రీశైలం, సున్నిపెంట, బైర్లూటి, సంజీవనగర్‌తండా, మహానంది, బనకచర్ల, కోసిగి ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. గుట్టల్లో దాగి ఉంటూ పశువులు, కుక్కలు, జింకలను వేటాడుతున్నాయి. అడ్డొచ్చిన రైతులపై దాడులకు దిగుతున్నాయి. వీటి నుంచి ప్రాణాలు కాపాడుకోవడం రైతులకు సవాలుగా మారింది. కొన్ని జాగ్రత్తలు తీసుకొని సమాచారం ఇవ్వాలని ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా సూచిస్తున్నారు.

**వీధి కుక్కలంటే ఇష్టం**



చిరుత పిల్లి జాతికి చెందింది. వేగంగా కదిలే జంతువు. దీని జీవిత కాలం 21–23 ఏళ్లు.. కానీ చాలావరకు 12–17 ఏళ్లే జీవిస్తాయి. ఇది మహా సిగ్గరి. మనుషుల కంట పడేందుకు ఇష్టపడదు. ఒంటరిగా నివాసం ఉండాలని చూస్తుంది. జనావాసాల్లోకొస్తే అలజడి సృష్టిస్తుంది. ఇవి గొర్రెలు, జింకలు, మేకలు, అడవి పందులు, కుక్కలను వేటాడుతుంటాయి. వీధి కుక్కల మాంసాన్ని ఇష్టంగా తింటాయి. చిరుతలు 2–3 పిల్లలకు జన్మనిస్తాయి. జీవన పోరాటంలో ఇతర జంతువులు వాటి పిల్లల్ని చంపేస్తాయి.

**చేతులు పైకెత్తి వెనక్కి నడవాలి**

మనుషులు ఎదురైనా దూరాన్ని బట్టి చిరుత దాడికి దిగుతుంది. చిరుత కనిపిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తిరిగి పరుగెత్తవద్దు.. పొదల చాటున దాక్కోవడం వంటివి చేయకూడదు. అలాంటప్పుడే మనుషులపై దాడికి దిగుతుంది.ఆకారంలో తనకంటే పెద్దగా ఉన్న జంతువులపై చిరుతలు దాడి చేయవు. దీన్ని దృష్టిలో పెట్టుకొని చిరుత ఎదురైనప్పుడు చేతులు పైకి పెట్టి అరుస్తూ నెమ్మదిగా వెనక్కి నడవాలి. చిరుతలు సాధారణంగా జంతువుల వీపు భాగాన దాడులు చేస్తాయి. వీపుపై ఫేస్‌మాస్క్ (మనిషి ముఖం లేదా తలను పోలిన ముసుగు) ధరిస్తే దాడి నుంచి బయటపడొచ్చు.

# మారనున్న ‘వీధి’రాత




నర్సీపట్నం : వీధి వ్యాపారులకు శాశ్వత చిరునామా చూపడంలో పురపాలక సంఘాలు వెనుకబడ్డాయి. వీధి వ్యాపారుల విక్రయ కేంద్రాలు (హాకర్స్ జోన్స్) ప్రతిపాదనలకే పరిమితయ్యాయి. పోలీసులు, ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక తదితర విభాగాల సిబ్బంది అదిలింపులు, బెదిరింపులకు తలొగ్గుతూ రహదారులకు ఇరువైపులా కాయగూరలు, పండ్లు, పూలు, తినుబండారాలు విక్రయిస్తూ జీవనం సాగించే వారంతా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రముఖుల పర్యటనలున్నా, భారీ సభలు ఏర్పాటవుతున్నా తొలువ మూతపడేది వీరి వ్యాపారాలే. తమకు శాశ్వత చిరునామా చూపాలని పలుమార్లు విన్నవించడంతో కూటమి ప్రభుత్వం స్పందించింది. వీధి వ్యాపారులు ఎందరున్నారో లెక్క తేల్చేందుకు పురపాలక సంఘాల్లో సర్వే జరుగుతోంది. నర్సీపట్నంలో నిర్వహించిన సర్వేలో ఇప్పటివరకు 1,043 మందిని గుర్తించారు. గతంలో 670 మంది ప్రభుత్వం నుంచి రుణాలు పొందారు. తమకు వ్యాపారమే జీవనాధారమని 705 మంది సచివాలయాల సిబ్బందికి తెలిపారు. వీరికి గుర్తింపు కార్డులు, ధ్రువపత్రాలు అందించేందుకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. 2014–19 మధ్య తెదేపా అధికారంలో ఉన్నప్పుడు వీధి వ్యాపారుల కోసం సర్వే జరిగింది. వ్యాపారాలు చేసుకోవడానికి వీలుగా గ్రీన్‌జోన్ల ఎంపిక జరిగినా వ్యాపారులను ఆ ప్రాంతాలకు పంపడంలో శ్రద్ధ చూపలేదు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే పూర్తయిన తర్వాత జోన్ల ఏర్పాటుపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించనున్నారు. నెలాఖరులోగా సర్వే పూర్తయ్యే ఆస్కారముంది.

ఎలమంచిలిలో గతంలో 600 మంది వీధి వ్యాపారులకు ప్రభుత్వం రుణాలు ఇప్పించింది. తాజా సర్వేలో మరో 814 మంది వీధి వ్యాపారులను గుర్తించారు. వీరందరికీ కొత్తగా గుర్తింపు కార్డులు ఇవ్వనున్నారు. ఇప్పటికే 70 మంది కార్డులు పొందేందుకు రుసుం చెల్లించారు. ఎలమంచిలి పరిసర మండలాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండటంతో కొంతమంది చిరు వ్యాపారులు పరిశ్రమల్లో పనులకు వెళ్తున్నారు. గతంలో వ్యాపారాలకు వీలుగా జోన్లు గుర్తించినప్పటికీ అక్కడకు వెళ్లేందుకు చాలామంది ఆసక్తి చూపలేదు. ఇప్పటికీ ఎక్కువమంది రహదారులపైనే వ్యాపారాలు చేసుకుంటున్నారు. **ఏ జోన్ ఎందుకంటే..**

గ్రీన్ జోన్‌గా అధికారులు గుర్తించిన ప్రాంతాల్లో వీధి విక్రయ కేంద్రాలను వ్యాపారులు నడుపుకోవచ్చు. యాంబర్ జోన్లలో నిర్ణీత సమయాల్లో మాత్రమే వ్యాపారాలకు అనుమతిస్తారు. రెడ్ జోన్లలో వీధి వ్యాపారాలు నిషిద్ధం. కూరగాయలు, పండ్లు, తినుబండారాలు, పూలు తదితరాలు అమ్ముకునే వారు జనం ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఉండాలని కోరుకోవడం సహజం. రోడ్లు ఇరుకుగా మారడంతో చిరు వ్యాపారులకు ఇబ్బందిగా మారింది. వీరి వ్యాపారాలు సజావుగా సాగేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

# రూ.కోట్లు కొల్లగొట్టి.. అనర్హులకు కట్టబెట్టి..



కాకినాడ : వైకాపా హయాంలో పేదల ఇళ్ల పేరుతో పెద్దలు స్థిరాస్తి వ్యాపారం చేసుకున్నారు. ప్రభుత్వానికి, లబ్ధిదారులకు మధ్య దళారులుగా అవతారమెత్తి రూ.వందల కోట్లు దోచుకున్నారు. భూముల కొనుగోలు నుంచి మెరక పనుల వరకు అందినకాడికి వెనకేసుకున్నారు. ఇళ్ల స్థలాలను అనుయాయులకు కట్టబెట్టుకున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జగనన్న కాలనీల పేరిట జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. కూటమి సర్కారు ఈ అడ్డగోలు వ్యవహారాలపై సాగించిన ప్రాథమిక విచారణలో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.

**అక్రమాల విలువ దాదాపు రూ.652 కోట్లు**

ఉమ్మడి జిల్లాలో ‘పేదలందరికీ ఇళ్లు’ పథకంలో భాగంగా 2.54 లక్షల మందికి ప్రభుత్వ భూములతో పాటు 6,967 ఎకరాల ప్రైవేటు భూములు అప్పట్లో సేకరించారు. వీటి కొనుగోలులో నేతలు అక్రమాలకు తెరలేపారు. మార్కెట్ విలువకు మించి, రేట్లు పెంచి అధికారుల నుంచి నేతల వరకు వాటాలు పంచుకున్నారు. సుమారు రూ.652 కోట్ల వరకు అదనపు లబ్ధి పొందినట్లు ప్రాథమికంగా గుర్తించారు. మరోవైపు ముంపు ప్రాంతాల్లోని కాలనీలను గ్రావెల్‌తో చదును చేసే పనుల పేరిట రూ.వందల కోట్లు కొల్లగొట్టేశారు. దీనిపైనా విచారణ సాగుతోంది. మరో వైపు ఎన్నికల్లో లబ్ధికి అర్హత లేకున్నా వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం గమనార్హం. కొన్నిచోట్ల స్థానిక నేతలు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూళ్లు చేశారు.

కాకినాడ జిల్లాలోనే అయిదు వేల మందికి పైగా అనర్హులున్నట్లు తేలింది. తూర్పుగోదావరి జిల్లాలో 991 మందికి అర్హతలు లేకున్నా ఇళ్ల పట్టాలిచ్చారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అనర్హుల వివరాలు బయటపెట్టకుండా గోప్యత పాటిస్తున్నారు.

**కాకినాడలోనే అనర్హులు అధికం..**

గత ప్రభుత్వంలో 2020 నుంచి 2024 ఎన్నికల ముందు వరకు పట్టాల పంపిణీ ప్రహసనంలా సాగింది. ఓట్ల కోసం ఆరు దశల పరిశీలన (సిక్స్ స్టెప్ వెరిఫికేషన్) చేయకుండానే తమ పార్టీ కార్యకర్తలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. అలాంటి వారిలో చాలామంది గృహాలు నిర్మించుకోకుండా వాటిని ఇతరులకు అమ్మి సొమ్ముచేసుకున్నారు.

కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో అత్యధికంగా 1,208 మంది అనర్హులున్నట్లు గుర్తించారు. జగ్గంపేట మండలంలో 940, పెదపూడి మండలంలో 416, తాళ్లరేవు మండలంలో 392, కాకినాడ గ్రామీణంలో 313, రౌతులపూడిలో 240 మంది అర్హతలు లేకున్నా పట్టాలు పొందారు.

తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలో 292, సీతానగరం మండలం 195, రాజమహేంద్రవరం పట్టణంలో 124, దేవరపల్లి మండలంలో 107 మందికి అనర్హుల చేతిలో ఇళ్ల స్థలాలున్నట్లు గుర్తించారు.

గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలపై సచివాలయ సిబ్బందితో గతంలోనే ప్రాథమిక విచారణ చేశాం. అర్హులు..అనర్హుల జాబితాతో కూడిన నివేదికలు ప్రస్తుతం తహసీల్దారు లాగిన్‌లో ఉన్నాయి. మరోసారి తనిఖీలు చేపట్టి పూర్తిస్థాయిలో విచారణ నివేదికను ప్రభుత్వానికి పంపిస్తాం.

అని కాకినాడ డీఆర్వో వెంకటరావు అన్నారు.

# కోకో రైతుకు ఆ‘ధర’వు

రాజమహేంద్రవరం: సరైన ధర లేక ఇబ్బంది పడుతున్న కోకో రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రైతుల నుంచి కిలో రూ.450కు ప్రైవేటు సంస్థలు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అదనంగా రూ.50 చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. జిల్లాలో దాదాపు 12 వేల ఎకరాల్లో కోకో సాగవుతుండగా సుమారు 4వేల మెట్రిక్ టన్నుల గింజల దిగుబడి వస్తుందని అంచనా. ఇంకా విక్రయించని రైతుల వివరాలను మూడు రోజులపాటు అధికారుల బృందం క్షేత్రంలో పర్యటించి సేకరించారు. 530 మెట్రిక్ టన్నుల మేర రైతుల వద్ద నిల్వలున్నాయని గుర్తించి వాటిని తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

**200 మెట్రిక్ టన్నుల సేకరణ..**

తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వం అదనపు ధర నిర్ణయించిన తరువాత 392 మంది రైతులకు చెందిన 200 మెట్రిక్ టన్నుల నిల్వలను కొనుగోలు చేయించారు. 1,024 మంది రైతులకు చెందిన మరో 331 మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారిణి బి.సుజాతకుమారి, ఏపీఎంఐపీసీ జిల్లా అధికారి దుర్గేశ్ తదితరులకు కలెక్టర్ ప్రశాంతి సోమవారం ఆదేశించారు. ఒకటి రెండ్రోజుల్లో మొత్తం నిల్వల సేకరణ పూర్తవాలన్నారు. ప్రభుత్వం కిలో గింజలకు చెల్లించే రూ.50 అదనపు మొత్తం వల్ల జిల్లాలో 1,416 మంది రైతులకు రూ.2.65 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. వర్షాలు కురిసేలోగా సేకరణ పూర్తి చేస్తామని జిల్లా ఉద్యానశాఖాధికారిణి తెలిపారు. ఇక కాకినాడ జిల్లాలో 80 టన్నుల



మేర కొనుగోలుకు చర్యలు చేపట్టారు.

**కోనసీమలో 70 మెట్రిక్ టన్నులు**

డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దాదాపు 2,500 ఎకరాల్లో కోకో సాగు చేస్తుండగా సుమారు 800 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అవుతుందని అంచనా. ప్రభుత్వం కిలోకు రూ.50 అదనంగా చెల్లిస్తామని ప్రకటించగా.. ఆ సమయానికి 226 మంది రైతుల నుంచి 70 కిలోలు సేకరించాలని అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట, అయినవిల్లి, రావులపాలెం, కె.గంగవరం మండలాల పరిధిలో 168 మంది రైతుల నుంచి 43 మెట్రిక్ టన్నుల గింజలు తీసుకున్నారు. రెండ్రోజుల్లో కొత్తపేట, అయినవిల్లి, రావులపాలెంలో సేకరిస్తామని జిల్లా ఉద్యానశాఖాధికారి బి.వి.రమణ తెలిపారు. ప్రభుత్వం కిలోకు చెల్లించే అదనపు ధర వల్ల రైతులకు రూ.35 లక్షల మేర లబ్ధి చేకూరనుంది.

# పోనీ.. అడగరులే కానీ

పాలకొల్లు : జిల్లాలో రవాణాశాఖ తనిఖీలు పడకేశాయనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో రవాణశాఖ కార్యాలయాలున్నాయి. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు లెర్నింగ్ లైసెన్సులు, వాహన సామర్థ్య పరీక్షలు నిర్వహించేందుకే పరిమితమవుతున్నారు. అక్రమంగా చలామణి అవుతున్న వాహనాలను, సరైన కాగితాలు లేకుండా తిప్పుతున్న లారీలను నియంత్రించడంలో విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. రోడ్లపై మట్టి, ఇసుకతో దూసుకుపోతున్న ట్రాక్టర్లు నడిపేవారిలో 50శాతం మందికి కూడా లైసెన్సులు ఉండటం లేదు. ఆటోల విషయమైతే చెప్పనవసరం లేదు. ప్రయాణికులు వెళ్లే ఆటోలో లోడు రవాణా చేస్తుంటారు. లోడు తీసుకెళ్లేవాటిలో జనాన్ని తీసుకెళ్తుంటారు. ఇది 216వ జాతీయ రహదారిపై రొయ్యల ఎగుమతి కోసం వెళ్తున్న లారీ. రవాణా నిమిత్తం లారీకి శీతల గది ఉన్నా వెనుక భాగంలో ఖాళీ ట్రేలను కట్టి మరీ నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళ్తున్నారు.



ట్రేలకు కట్టిన తాడు తెగినా, కుదుపుల్లో ట్రే పైకి ఎగిరి కిందపడినా వెనుక వచ్చే వాహనదారులకు ఎంత ప్రమాదమో ఊహించవచ్చు. జిల్లాలో నిత్యం ఇటువంటి లారీలు వందల సంఖ్యలో తిరుగుతున్నా ఒక్కటీ పట్టుకున్న దాఖలాలు లేవు.

ఆకివీడులో ఈ నెల 15న మద్యం మత్తులో ఒక యువకుడు కారుతో వీరంగం సృష్టించాడు. జాతీయ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని, మరో మహిళను ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రగాయాలపాలయ్యారు. నరసాపురంలోను ఇటీవల కాలంలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. తనిఖీలు నిర్వహించి మందుబాబుల అరాచకాలను అరికట్టిన సందర్భాలు లేవు.

**భయపెడుతున్న టిప్పర్లు..** రహదారిపై టిప్పర్ కనిపించిందంటే ప్రజలు ఆందోళనకు గురయ్యే పరిస్థితులున్నాయి. యలమంచిలి మండలం అడవిపాలెంలో మే 28న అతివేగంగా దూసుకొచ్చిన ఇసుక లోడు టిప్పర్ రోడ్డు పక్కన నిలిచి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రక్కుతో సహా తిరగబడింది. డ్రైవర్ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ప్రమాదం దూసుకొస్తే తప్ప రవాణా, పోలీసు సిబ్బంది అటువైపు కూడా చూడటం లేదు. కార్యాలయాల నుంచి బయటకు వచ్చి తనిఖీలు ముమ్మరం చేస్తే తప్ప ప్రమాదాలను, నిబంధనల ఉల్లంఘనను నియంత్రించలేరని పలువురు వాపోతున్నారు. దీనిపై భీమవరం రవాణా శాఖాధికారి ఉమామహేశ్వరరావును సంప్రదించగా లక్ష్యసాధనకు కృషి చేస్తున్నామన్నారు. తనిఖీలను ముమ్మరం చేస్తామని చెప్పారు.

# ఆ మూడు.. అభివృద్ధి తోడు

ఏలూరు: జిల్లాలో మూడు రాష్ట్ర రహదారులను ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో అభివృద్ధి చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. వాటి స్థితిగతులపై సర్వే పూర్తయింది. సవివర ప్రణాళికలు(డీపీఆర్) తయారుచేసే బాధ్యతను ఓ కన్సల్టెన్సీకి అప్పగించారు. అవి అందగానే ప్రభుత్వ ఆమోదానికి పంపి రహదారుల నిర్మాణం, నిర్వహణకు టెండర్లు పిలవాలని యోచనలో రహదారులు, భవనాలశాఖ అధికారులు ఉన్నారు.

జాతీయ రహదారుల ప్రమాణాలను అనుసరించి వాటికి దీటుగా జిల్లాలో 3 రహదారులు అభివృద్ధి చేసి వాటిల్లో టోల్ రుసుములు విధానం పెట్టాలనేది ప్రభుత్వ యోచనగా ఉంది. పనులు దక్కించుకున్న గుత్తేదారే నిర్మాణం చేపట్టి కొన్నాళ్లపాటు నిర్వహిస్తారు. ఆ కాలంలో టోల్ రుసుములను నిర్మాణ సంస్థ వసూలు చేసుకుంటుంది. వ్యవధి పూర్తయ్యాక ప్రభుత్వ అధీనంలోకి రాగానే టోల్ భారం తీసేస్తామని ఆర్ అండ్ బీ వర్గాలు తెలిపాయి. నిర్మాణ వ్యయాలన్నీ గుత్తేదారే భరిస్తారు. రి ఇవి అభివృద్ధి చెందితే జిల్లా నుంచి ఆయా ప్రాంతాలకు తక్కువ వ్యవధిలో చేరుకుంటారు. మార్గంలో ప్రధాన పట్టణాల వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్లు, నిఘా కెమెరాలతో పాటు వేగాన్ని నిరోధించే కెమెరాలు ఏర్పాటు చేస్తారు.

ప్రయాణ దూరాభారం తగ్గుతుంది. ఒక వైపు హైదరాబాద్, మరోవైపు విశాఖ, ఇంకోవైపు చెన్నై వైపు వెళ్లటానికి వీలుగా ఈ రహదారులను జిల్లా నుంచి ప్రతిపాదించారు. ఇవి అందుబాటులోకి వస్తే రాకపోకలు పెరిగి వ్యాపార లావాదేవీలతో జిల్లాకు ఆదాయం సమకూరుతుందని అంచనా.

ఇప్పటికే నిర్వహించిన సర్వేలో దారి పొడవునా ఎన్ని మలుపులు, ఎత్తుపల్లాలు ఉన్నాయో గుర్తించారు. గతంలో ఎక్కడెక్కడ బ్లాక్ స్పాట్లు గుర్తించారో ఆ ప్రదేశాల్లో మరిన్ని జాగ్రత్తలు తీసుకుని నిర్మాణం చేపట్టేలా సర్వే సాగినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రస్తుత 7 మీటర్ల వెడల్పు కలిగి రెండు వరుసల రహదారులుగా అధ్వానంగా ఉన్న వీటిని 10 మీటర్లకు పెంచి వెడల్పు చేసేలా ప్రతిపాదించారు. రహదారి వెడల్పు కావటంతో ఇటుగా ప్రయాణించే వాహనాలు బాగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

ఆ మూడు రహదారులివీ.. వాటి పరిధి ఇలా

1. ఏలూరు–మేడిశెట్టివారిపాలెం 70.98 కి.మీ
2. ఏలూరు–జంగారెడ్డిగూడెం 52 కి.మీ
3. నరసాపురం–అశ్వారావుపేట 118 కి.మీ

# తరగని.. తోతాపురి కష్టాలు

పాకాల : ప్రభుత్వం పెట్టుబడి రాయితీ ఇచ్చి సహకరిస్తున్నా మామిడి రైతుల కష్టాలు తీరడం లేదు. కోత కూలీలు రాక, మార్కెట్‌కు కాయలు తరలించేందుకు ట్రాక్టర్లు దొరక్క తంటాలు పడుతున్నారు. ముందస్తు బుకింగ్ టోకెన్ దక్కించుకుని గుజ్జు పరిశ్రమలకు కాయలు తరలించినా వాటిని దింపే పరిస్థితి కనిపించడం లేదు. మ్యాంగోనగర్ పరిసరాల్లోని ర్యాంపుల వద్ద సైతం వందలాదిగా ట్రాక్టర్లు నిలిచిపోయాయి.

**పెట్టుబడి రాయితీకి అడ్డదారులు**

ఒకరోజు ముందు అనుమతి పొందిన వారికి ఓ వ్యాపారి టన్ను తోతాపురి కాయలను రూ.4 వేలకు కొంటున్నారు. మిగతాచోట్ల రూ.3 వేలతోనే సరిపెడుతున్నారు. ప్రభుత్వం అందించే పెట్టుబడి రాయితీ కోసం 1బి, ఇతర వివరాలు తెస్తున్నా రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో రైతులు వాటిని ర్యాంపు యజమానుల చేతికిస్తున్నారు. వారు వాటిని పక్కనపడేసి రాయితీ కాజేసేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు.

## జల్‌జీవన్‌కు గ్రహణం

గుత్తి : జల్‌జీవన్ పథకం అమలు కోసం గ్రామీణులు ఎదురుచూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పథకానికి నిధులు ఇచ్చినా గత వైకాపా సర్కారు తన వాటా నిధులు ఇవ్వకుండా పథకం పనులను నిలిపివేసింది. తొలి, మలిదశల్లో మంజూరైన పనులు చాలా గ్రామాల్లో పడకేశాయి. గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో ప్రధానంగా రెండో విడత పనుల కోసం ప్రజలు నిరీక్షిస్తున్నారు. అనేక గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం నానాపాట్లు పడుతున్నారు. మూడు నియోజకవర్గాల్లో రూ.156.55 కోట్లతో పనులను చేపట్టాల్సి ఉంది. 2022 లోనే పనులు మంజూరు చేశారు. ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వలేకపోయింది. కేంద్రం ఇచ్చిన నిధులను ఇతర అవసరాలకు వాడుకుంది.



**సమగ్ర నివేదిక ఇలా...**

గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాలకు గార్లదిన్నెలోని ఎంపీఆర్ డ్యాం నుంచి నీరు ఇవ్వనున్నారు. డ్యాం నుంచి గ్రామాలకు పైపులైన్లను విస్తరించాల్సి ఉంది. తాడిపత్రి నియోజకవర్గానికి గండికోట నుంచి నీరు ఇవ్వడానికి ప్రణాళిక రూపొందించారు. ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు పీఏబీఆర్ నుంచి నీరు ఇవ్వాలని సమగ్ర నివేదిక రూపొందించారు.

**స్వయం సహాయ సంఘాలతో..**

గత ప్రభుత్వం నిధులు ఇవ్వకుండానే పనులు చేయించడానికి స్వయం సహాయ సంఘాల మహిళలకు కాంట్రాక్టు విధానంపై శిక్షణ ఇప్పించింది. గ్రామాల్లోని నీటి పథకాలను బలోపేతం చేసి.. పైపులైన్లు వేసి ప్రతి ఇంటికి కుళాయిలను ఇవ్వాల్సి ఉంది. తొలివిడతలో సైతం పెద్దగా పనులు జరగలేదు. రెండో విడతలో జరిగితే గ్రామీణులకు ప్రయోజనం చేకూరుతుంది.దీనిపై గుత్తి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రెహెనా వాసీం మాట్లాడుతూ పాత పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా మంజూరు ఉత్తర్వులు ఇచ్చి.. టెండర్లు పిలవాల్సి ఉంది. టెండర్లు పూర్తవ్వగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

## రూపు మారే.. కలత తీరే..

ముమ్మిడివరం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ వసతి గృహాల్లో ఉండేవారిలో ఇంచుమించు అందరూ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే. మండల కేంద్రాలు, పట్టణల్లో పేద విద్యార్థులు మెరుగైన విద్యావకాశాలు పొందేలా ఏర్పాటు చేసిన వీటిని గత వైకాపా పాలకులు విస్మరించారు. కూటమి అధికారంలోకి వచ్చాక అన్ని వసతులు కల్పించాలనే లక్ష్యంతో నిధులు విడుదల చేసింది. వసతి గృహాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో పిల్లల్ని చేర్పించాలని సిబ్బంది తమ పరిధిలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు.

**జిల్లాలో పరిస్థితి ఇదీ..**

జిల్లాలో అయిదో తరగతి నుంచి పదో తరగతి వరకు 23 ఎస్సీ, 9 బీసీ వసతి గృహాలు ఉన్నాయి. ఎస్సీ వసతి గృహాలు ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. బీసీ వసతి గృహాల్లో నాలుగు ప్రభుత్వ భవనాల్లో, అయిదు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.

**గత సర్కారు నిర్వాకంతో ముందుకు రాని గుత్తేదారులు**

ప్రస్తుతం జిల్లాలోని 22 ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.4.93 కోట్లు విడుదల చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో



ఎదురైన పరిణామాల కారణంగా గుత్తేదారులు కొన్ని పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. గతంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో 21 చోట్ల టెండర్లు ఖరారు కావడానికి చాలా సమయం పట్టింది. ఒకటి నుంచి మూడు సార్లు టెండర్లు పిలిస్తేగాని గుత్తేదారులు స్పందించలేదు. రావులపాలెం వసతి గృహంలో రూ.15 లక్షలతో మరమ్మతు పనులకు ఏడు సార్లు టెండర్లు పిలిచినా నేటికీ ఖరారు కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. టెండర్లు పూర్తయిన అన్ని వసతి గృహాల్లో 90 శాతం పనులు పూర్తయ్యాయి.

**మౌలిక వసతులు కల్పిస్తూ..**

అమలాపురం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, రాజోలు మండలాల్లోని 13 వసతి గృహాల్లో పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. గదుల మరమ్మతులు, పంకాలు, దోమలు రాకుండా కిటికీలకు మెస్‌లు, గుమ్మాలు, కిటికీలు, తలుపుల ఏర్పాటు వంటి పనులు చేపట్టారు. గచ్చులను టైల్స్‌తో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన వాటికి మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికే పాఠశాలలు తెరిచిన నేపథ్యంలో వసతి గృహాలకు ఈనెలాఖరు నాటికి విద్యార్థులు చేరుకునే అవకాశం ఉంది.

**వేగంగా పూర్తి చేశాం..-సుబ్బరాజు, ఈఈ, ఏపీఎస్‌డబ్ల్యూఐడీసీ**

పాఠశాలలు తెరిచేనాటికి వసతి గృహాల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేశాం. టెండర్లు ఆలస్యమైనా గుత్తేదారులతో వేగంగా పనులు చేయించాం. ఇప్పటికే 13 వసతి గృహాల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన వాటిలో 10 శాతం పనులు మిగిలి ఉన్నాయి. మూడునాలుగు రోజుల్లో పనులు పూర్తి చేస్తాం.

# పరిశ్రమల్లో భద్రతకు పాతర!



హిందూపురం : ఉమ్మడి అనంత జిల్లాలో స్టీలు పరిశ్రమలకు ప్రసిద్ధి చెందిన హిందూపురంలోని తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడల్లో కార్మికులకు భద్రత కరవైంది. వారికి హెల్మెట్, బూట్లు, బ్లౌజ్, మాస్కు, మంచినీరు అందుబాటులో ఉంచాలి. పలుచోట్ల ఎలాంటి రక్షణ లేకుండానే విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఆ సమయంలో ప్రమాదాలు చోటు చేసుకొంటే ప్రాణాలకే ముప్పు. పర్యవేక్షణకు సేఫ్టీ అధికారిని నియమించుకోవాలి.. చాలాచోట్ల అధికారి కనిపించటం లేదు.

**తనిఖీలు ఏవి?..** స్టీలు, రసాయన పరిశ్రమలను తరచూ తనిఖీ చేస్తూ భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా ? అనేది పరిశీలించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులు ఇచ్చి విచారించాలి. తనిఖీలు లేవు, తాఖీదులు కనపడవు.

**వలసదారులే అధికం**

ఇక్కడ పని చేయడానికి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఎక్కువగా వస్తుంటారు. ప్రమాదాల బారిన పడుతున్నారు. కార్మికులు మృతి చెందినా వెలుగుచూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వలసకార్మికుల చట్టం అమలు చేయాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

**కొన్ని ఘటనలు ఇలా..**

ఈనెల 10న తూముకుంట పారిశ్రామిక వాడలోని మీనాక్షి స్టీల్ పరిశ్రమ రోలింగ్ విభాగంలో ప్రమాదం చోటు చేసుకొని బిహార్ కార్మికుడు చోటుయాదవ్ మృతి చెందాడు.

గతేడాది మార్చిలో ఫ్లోకిమ్ రసాయన పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు హనుమంతప్ప చేతిపై రసాయనాలు పడి తీవ్రంగా గాయపడ్డాడు.తూముకుంట పారిశ్రామిక వాడలో రొల్వేల్ కన్వేయర్స్ పరిశ్రమలో రామాంజనేయులు కుడిచెయ్యి యంత్రంలో చిక్కుకొని రెండు వేళ్లు దెబ్బతిన్నాయి.

2023, మార్చిలో శ్యాంఫెరస్ అలైస్ స్టీలు పరిశ్రమలో గౌరిబిదనూరుకు చెందిన కార్మికుడు వెల్డింగ్ పనిచేస్తుండగా విద్యుదాఘాతం చోటు చేసుకొని చనిపోయాడు.

**భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు - రాధాకృష్ణ, పరిశ్రమల సేఫ్టీ జిల్లా అధికారి**

పరిశ్రమల యజమానులు తప్పని సరిగా భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకొంటాం. అధిక ఉష్ణోగ్రత విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు తప్పని సరిగా రక్షణ చర్యలు కల్పించాలి. సేఫ్టీ అధికారిని ప్రతి పరిశ్రమ నియమించుకొనేలా ఆదేశాలు జారీ చేస్తాం.

# కృష్ణదేవరాయా.. ప్రవేశాలు పెరిగేనా?



గుంతకల్లు :శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 33 పీజీ కోర్సులున్నాయి. గతేడాది అప్లయిడ్ మ్యాథమాటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, వ్యాయామ విద్య విభాగాల్లో కనీసం ఒక్క విద్యార్థి చేరలేదు.

పాలిమర్ సైన్స్‌లో ఒకరు, వయోజనవిద్య విభాగంలో ఇద్దరు, తెలుగు, హిందీ, గ్రామీణాభివృద్ధి విభాగంలో ముగ్గురు చొప్పున విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరారు. ఐదేళ్ల క్రితం ఆయా విభాగాల్లో ప్రవేశాలు లభించడమే కష్టంగా ఉండేది. ర్యాంకులు వచ్చిన వారికే సీట్లు దక్కేవి. కొన్నేళ్లుగా సగం సీట్లు కూడా భర్తీకాని దుస్థితి.

విశ్వవిద్యాలయ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గుతున్నాయి. వర్సిటీలో 33 గ్రూపులు, 1064 పీజీ సీట్లు ఉన్నాయి. గతేడాది 296 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. ఆర్ట్సులోనే కాదు.. సైన్స్ కోర్సుల్లో ఇదే పరిస్థితి. సైన్స్ గ్రూపుల్లో 18 విభాగాలకు 454 సీట్లు ఉండగా 206 భర్తీ అయ్యాయి. ఆర్ట్స్ గ్రూపుల్లో 610 సీట్లకుగాను కేవలం 90 భర్తీ కాకపోవడంతో వర్సిటీ వెలవెలబోతోంది. 2023లో కేవలం 306 మంది ప్రవేశాలు పొందారు. ఈ ఏడాది పీజీసెట్ ఇటీవల ముగిసింది ఈసారైనా పెరుగుతాయో.. లేదో చూడాలి.

**వైకాపా ప్రభుత్వ నిర్ణయాలతో..**

గతంలో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎస్కేయూలోనే ప్రవేశపరీక్ష నిర్వహించేవారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపేవారు. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశపరీక్ష పేరుతో పీజీసెట్ నిర్వహిస్తూ వచ్చింది. దీంతో సీటు ఏ విశ్వవిద్యాలయంలో వస్తుందో తెలియని పరిస్థితి. దూరంగా ఉన్న జిల్లాల విద్యార్థులు ఎస్కేయూకి రావడానికి ఇబ్బందిగా మారింది. గత తెదేపా పాలనలో విద్యార్థులకు అందించే బోధన ఫీజులు, ఉపకారవేతనాలు.. వర్సిటీ ఖాతాలో జమ చేసేవారు. వైకాపా ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేసేది. సక్రమంగా జమ చేయకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి భారంగా మారింది.

**ఆచార్యుల కొరత..**

తగిన సంఖ్యలో ఆచార్యులు, సహాయ ఆచార్యులు లేక బోధన కుంటుపడుతోంది. ఇది కూడా ప్రవేశాలపై ప్రభావం చూపుతోంది. వివిధ విభాగాల్లో 300 పైగా ఖాళీలు ఉండగా.. ప్రస్తుతం రెగ్యులర్ ఆచార్యులు 45 మంది, కాంట్రాక్టు ప్రాతిపదికన 110 మంది పని చేస్తున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయలేదు. కూటమి ప్రభుత్వమైనా వర్సిటీకి పూర్వవైభవం తీసుకొచ్చి.. బోధన ఉద్యోగాలు భర్తీ చేస్తుందని విద్యార్థులు, విద్యావేత్తలు ఆశిస్తున్నారు.

# పుష్కరం... విస్త'రణం'



రాజమహేంద్రవరం : రానున్న పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరంలో రోడ్లు విస్తరణ చేయాలని నగరపాలక సంస్థ నిర్ణయించింది. దీంతో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు భావించి ఆక్రమణలపై దృష్టి సారించారు. మూడు నెలల కిందట రోడ్డు, కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రణాళిక రూపొందించారు. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

**ఇలాగైతే ఎలా..**

నగరంలో తొలుతగా రెండు దశల్లో రోడ్ల విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. ఫేజ్ -1లో తూర్పురైల్వే స్టేషన్ రోడ్డు, మోరంపూడి రోడ్డు, గుండువారి వీధి, కోరుకొండ, గాదాలమ్మ రోడ్లపై దృష్టిసారించారు. హడావుడిగా పనులు చేపట్టి కాలువలపై కొంత మేర తొలగించి వదిలేశారు. ఇక ఫేజ్-2లో కోటిలింగాలపేట రోడ్డు, కాతేరు రోడ్డు, జెండాపంజా రోడ్డు, బైపాస్ రోడ్డు, స్టేడియం రోడ్డు, మూలగొయ్యి రోడ్డు, శేషయ్యమెట్ల రోడ్లను ప్రతిపాదించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు అనువుగా ఉండే విధంగా ఈ మార్గాలను గుర్తించారు. ఇప్పటికీ ఫేజ్-1 కొలిక్కి రాకపోగా, ఫేజ్-2 పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రోడ్ల విస్తరణ అధికారులకు కత్తి మీద సాములా మారింది.

**ఒత్తిళ్లతో వెనకడుగు**

నగర అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాల్సిన యంత్రాంగం ఒత్తిళ్లకు తలొగ్గుతోంది. నేతలు కూడా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా అధికారులను వెనక్కి లాగేస్తున్నారు. పూర్తిగా కాలువలను ఆక్రమిస్తే, ఏదో చేశామనే రీతిన ఒక మెట్టు కొట్టేసి వదిలేస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాలకు ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న రాజమహేంద్రవరంలో మెయిన్ రోడ్డు, ఎస్వీజీ మార్కెట్, తాడితోట సెంటర్లలో విస్తరణ పనులను పూర్తిగా పక్కన పెట్టారు. ఇక్కడ అధికార యంత్రాంగం అడుగుపెట్టాలంటే రాజకీయ నేతలను కలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా గోదావరి బండ్ రోడ్డును ఆనుకొని ఉన్న మెయిన్ రోడ్డు, కోటగుమ్మం మధ్యలో వీధులన్నీ పాత నగరంలో ముడిపడి ఉన్నాయి. కనీసం ఇక్కడకు అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. గత పుష్కరాలకు ఈ మార్గాల మీదుగా అనేక మంది గోదావరి గట్టుపైకి స్నానాల కోసం వెళ్లారు. రానున్న పుష్కరాలకూ ఇవే కీలకంగా మారనున్నాయి. కచ్చితంగా ఈ వీధులను విస్తరించాల్సి ఉంది. ఇక్కడే ప్రధాన మార్కెటు ఉండడంతో రాజకీయం మొత్తం మెయిన్ రోడ్డు చుట్టూ తిరుగుతుంది. గతంలో భారీ అపార్టుమెంటు కూలిపోయినప్పుడు, దుకాణాల్లో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక వాహనం ఇక్కడకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా నేతలు జోక్యం తగ్గించి, రోడ్ల విస్తరణకు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కొండలను కొట్టేయ్.. ఆక్రమించేయ్..!

కార్వేటినగరం : ప్రభుత్వం మారి ఏడాదైనా కబ్జాదారుల తీరు మారలేదు.. కొండలు, గుట్టలు, కుంటలు, చెరువులు, పంట కాలువలను సైతం ఆక్రమించుకుంటున్నారు.. గత ప్రభుత్వం అనర్హులైన వారికి కూడా డీకేటీ పట్టాలు మంజూరు చేయడంతో వాటి ముసుగులో మిగిలిన ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు.

కార్వేటినగరం మండలం కేఎంపురం గ్రామానికి సమీపంలో కొందరు కబ్జాదారులు రోడ్డు పక్కనే కొండలను యంత్రాలతో చదును చేసి



ఆక్రమణకు పాల్పడుతున్నారు. వైకాపా హయాంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న ఆ పార్టీ నేతలు.. ప్రస్తుతం ద్వితీయ శ్రేణి కూటమి నాయకుల సహకారంతో వాటిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కేఎంపురం సమీపంలోని కొండ ప్రాంతంలో గతంలో ఎవరికైనా డీకేటీ పట్టాలు ఇచ్చారా లేదా విచారణ చేపడతాం. ప్రభుత్వ భూమి కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు యంత్రాలు సీజ్ చేస్తాం.

- నాగరాజు, తహసీల్దారు

## అన్నదాత సుఖీభవకు కసరత్తు

తిరుపతి : సూపర్ సిక్స్‌లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం అమలుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.. ఈ నెల 20న తొలి విడత నగదు జమ చేస్తామని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించారు.. తదనుగుణంగా చిత్తూరు జిల్లాలో 1,45,255 మందిని ఎంపిక చేశారు.. ఈ మేరకు రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా తుది జాబితా విడుదల చేశారు.. రైతు సేవా కేంద్రాల్లో ఎంపికైన లబ్ధిదారులతో చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియ వేగవంతమైంది. ఇప్పటి వరకు 1,39,969 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు.

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని కూటమి ప్రభుత్వం



ప్రకటించింది. అందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు అందించనున్నాయి. కేంద్ర ప్రభుత్వం మూడు విడతల్లో రూ.2 వేలు చొప్పున రూ.6 వేలు జమ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తొలి రెండు విడతల్లో రూ.5 వేలు చొప్పున, మూడో విడత రూ.4 వేలు చొప్పున సాయం అందించనుంది. తొలి విడత ఈ నెల 20న పీఎం కిసాన్ రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ కింద రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.7 వేలు ఎంపిక చేసిన రైతులకు నగదు జమ చేయనున్నారు.

## పిలిచినా రాలేను.. వచ్చినా మోయలేను

భీమవరం : అత్యవసర సమయంలో ప్రాణాలు నిలిపే 108 అంబులెన్సులు అనారోగ్యానికి గురవుతున్నాయి. గత ప్రభుత్వం రాష్ట్రంలో వేల సంఖ్యలో 108 వాహనాలు కొనుగోలు చేసి జిల్లాలకు కేటాయించింది. అప్పట్లో రహదారులు అధ్వానంగా ఉండటంతో మరమ్మతులకు గురయ్యాయి.వాటి నిర్వహణ బాధ్యతలు చూసే అరబిందో సంస్థ పట్టించుకోకపోవడంతో దెబ్బతిన్న వాహనాల్లోనే రోగులకు సేవలు అందిస్తున్నారు. ఆపదలో ఉన్న వారు ఫోన్ చేసిన 15 నుంచి 20 నిమిషాల్లో రావాల్సి ఉండగా ఆలస్యంగా వచ్చిన సందర్భాలు ఉన్నాయి. వాటి లోపల సీట్లు పాడవడం, లైట్లు, బ్యాటరీలు సరిగా పనిచేయకపోవడం, అదనపు టైర్లు లేక నడిరోడ్డుపై వాహనాలు నిలిపివేసిన ఘటనలు నిత్యకృత్యంగా మారాయి.

జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 20 వాహనాలు కేటాయించారు. ఒకటి అదనంగా ఉంది. వీరవాసరం, మొగల్తూరు, ఆచంట తదితర మండలాల్లోని వాహనాలు నెలల తరబడి మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. ఇటీవల ఆచంట వాహనాన్ని బాగు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు.

**వేతనాల కోసం ఎదురుచూపులు..** జిల్లాలో 108 అంబులెన్సుల్లో వివిధ కేటగిరీలో 104 మంది పని చేస్తున్నారు. వీరికి రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక వీరికి నిర్వహణ సంస్థ నుంచి గ్రాట్యుటీ, సెలవులకు సంబంధించిన బకాయిలు రావాల్సి ఉంది.ఒక్కో ఉద్యోగికి వేతనాల రూపంలో రూ.60 వేల నుంచి రూ.90 వేల వరకు రావాల్సి ఉండగా, గ్రాట్యుటీ, సెలవులకు సంబంధించిన బకాయిలు మరో రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఉందని సిబ్బంది చెబుతున్నారు.

**కూటమి ప్రభుత్వంపైనే ఆశలు..** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వ్యవస్థలన్నింటినీ గాడిలో పెడుతోంది. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు 108 సర్వీసు ప్రొవైడర్‌గా ఉన్న అరబిందోను ఆ బాధ్యతల నుంచి తొలగించి భవ్య సంస్థకు అప్పగించిందని 108 వాహనాల పర్యవేక్షణ జిల్లా మేనేజర్ డి.రాజు తెలిపారు. వచ్చే నెల నుంచి ఈ సంస్థ బాధ్యతలు తీసుకుంటుందన్నారు. సిబ్బంది వేతన బకాయిలు, మరమ్మతుల విషయమై ఉన్నతాధికారులతో చర్చించామని, మొగల్తూరు, వీరవాసరం వాహనాలను వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు.

# వరి దిగుబడుల్లో నాతవరం ముందంజ

అనకాపల్లి : జిల్లాలో ఈ ఏడాది వరి దిగుబడుల్లో నాతవరం మండలం ముందుండగా దేవరాపల్లి వెనుకబడింది. గత సీజన్ కంటే 818 కేజీల ధాన్యం అదనంగా పడింది. ఖరీఫ్‌లో హెక్టారుకు 5,331 కేజీలు ధాన్యం రాగా, 2023-24 సీజన్‌లో 4,513 కేజీల దిగుబడి వచ్చింది. నాతవరంలో హెక్టారుకు 6,022 కేజీల దిగుబడులొచ్చాయి. గత సీజన్‌లోనూ ఈ మండలంలోనే అధిక దిగుబడులు వచ్చాయి. అన్ని మండలాల కంటే ఇక్కడే సాగు విస్తీర్ణం ఎక్కువ. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 55,985 హెక్టార్లలో వరి సాగు చేయగా నాతవరం మండలంలో 6,492 హెక్టార్లలో సాగైంది. ఏడాదిలో 120 రోజులు అంటే వరి సాగు చేసినన్ని రోజులు తాండవ జలాశయం నుంచి పంటలకు నీరు విడుదలైంది.

**హెక్టారుకు 71 బస్తాలు...** ఖరీఫ్‌లో అన్ని పంటలు కలిపి 63,286 హెక్టార్లలో సాగు చేయగా.. వరి ఒక్కటే 55,985 హెక్టార్లలో సాగైంది. ఎక్కువగా వర్షాధారంగానే సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో సగటున హెక్టారుకు 71 బస్తాల దిగుబడి వచ్చింది. గత సీజన్‌లో సరాసరి దిగుబడి హెక్టారుకు 60 బస్తాలే.నాతవరం తర్వాత పాయకరావుపేట మండలంలో అధిక దిగుబడులు వచ్చాయి. ఇక్కడ



హెక్టారుకు 5,877 కేజీల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇక్కడ పలు ఆనకట్టలు ఉండటంతో పొలాలకు నీరు పుష్కలంగా అందుతోంది. ఎస్.రాయవరం, గొలుగొండ, కోటవురట్ల, మునగపాక, నక్కపల్లి, రావికమతం, ఎలమంచిలి, బుచ్చెయ్యపేట మండలాల్లోనూ వరి దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. ఇక్కడ 5,400 కేజీలకు పైగా దిగుబడులు వచ్చాయి. నీటి ఎద్దడితోపాటు పంటకు చీడపీడలు సోకడంతో దేవరాపల్లి మండలంలో హెక్టారుకు 4,710 కేజీల దిగుబడే వచ్చింది. సుడిదోమ అధికంగా సోకడంతో కొన్ని మండలాల్లో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. మాడుగుల, రోలుగుంట మండలాల్లో ఐదు వేల కేజీల కంటే తక్కువ దిగుబడులు వచ్చాయి.

దిగుబడులు బాగున్నాయి... రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరాకు 32 బస్తాల దిగుబడి వచ్చింది. నారు నుంచి కోత వరకు వాతావరణం అనుకూలంగా ఉంది. కోత సమయంలో వర్షం వస్తే భయపడ్డాం. పెద్దగా ఇబ్బంది పడలేదు. గత ఏడాది 25 బస్తాలకు మించి రాలేదు.పిట్ట శ్రీనివాసరావు, నాగవరం, రైతు

# నిగ్గు తేల్చండి.. పరిహారం ఇవ్వండి

అచ్యుతాపురం : ఏపీఐఐసీ పైపులైన్ ప్యాకేజీ పంపిణీలో అవకతవకలు జరిగాయని నిర్ధారించి ఏళ్లు గడుస్తున్నా బాధ్యులపై చర్యల్లేవు. ప్యాకేజీ పంపిణీలో చోటుచేసుకున్న అవినీతిపై అప్పట్లో మత్స్యకారులు నిలదీసినా పాలకులు పట్టించుకోలేదు. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ఏర్పాటు చేసిన రసాయన పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే సముద్రంలోకి విడుదల చేయాలని, పూడిమడక మత్స్యకారుల్లో 18 ఏళ్లు నిండిన వారికి ఒక్కొక్కరికి రూ.1.25 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు గతంలో అంగీకారం కుదిరింది. దీన్ని అవకాశంగా మార్చుకునేందుకు వీధికొకరు దళారులుగా అవతారమెత్తారు.

రెవెన్యూ అధికారులతో లాలూచీ పడి 485 మందికి ప్యాకేజీ అందకుండా చేశారు. ఒకే పేరుతో రెండు ప్యాకేజీలు, ఆడపిల్లల పేరుతో కొంత, అత్తవారి ఇంట్లోనూ, పుట్టింట్లోనూ ఒకే పేరుతో ఉన్న వారికి ప్యాకేజీ అందజేశారు. ఇలా దళారులు రూ.4 కోట్ల వరకు అవినీతికి



పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి.

280 మంది సింగిల్ యూనిట్ రేషన్ కార్డులు, 40 మందికి వయసు లేకపోయినా 18 ఏళ్లు నిండినట్లు చూపి పరిహారం పొందారని రెవెన్యూ అధికారులు నివేదిక అందజేసినా ఇప్పటికీ అతీగతి లేదు. ప్యాకేజీ పంపిణీకి ముందు గుర్తించిన జాబితాలో పేర్లు లేని 30 మందికి పరిహారాన్ని అందించారు. రాజకీయ నాయకుల సిఫార్సులతో 280 మంది ప్యాకేజీ పొందినట్లు సమాచారం.

బ్రాండిక్స్ పైపులైను ఏర్పాటు సమయంలో 2,700 మందికి ప్యాకేజీ ఇవ్వగా ఏపీఐఐసీ ప్యాకేజీ వచ్చే సమయానికి ఈ సంఖ్య 4,828కి పెరగడం గమనార్హం. ఇప్పటికే 4,331 మందికి ప్యాకేజీ అందించిన అధికారులు రూ.2.5 కోట్ల మేర అవినీతి జరిగిందని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.

కూటమి సర్కారు చర్యలు తీసుకోవాలి... న్యాయంగా రావాల్సిన ప్యాకేజీ ఇవ్వడంలో వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు కాలయాపన చేసింది. కూటమి ప్రభుత్వం న్యాయం చేసి ప్యాకేజీ ఇవ్వాలని మత్స్యకారులు కోరుతున్నారు. తెదేపా ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీని తీసుకోవద్దని గతంలో మోసగించి ఎన్నికల్లో లబ్ధి పొందిన జగన్.. అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఒక్కమాటా మాట్లాడలేదని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాడు మోసపోయిన వారంతా ఎన్నికల్లో కూటమికి మద్దతిచ్చామని, అవినీతిపై విచారణ చేపట్టి అర్హులందరికీ పరిహారం అందజేయాలని పూడిమడకకు చెందిన మత్స్యకారులు కోరుతున్నారు.

**ఐదేళ్లు కాళ్లరిగేలా తిరిగినా..** పరిహారం ఇవ్వాలని గత ఐదేళ్లు కాళ్లరిగేలా తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. పంపిణీకి రూ.60 కోట్లు అవసరంకాగా ప్రభుత్వం రూ.68 కోట్లు విడుదల చేసినా అందరికీ అందలేదు. 31 మంది తక్కువ వయసు వారు, ఆరుగురు మూడుసార్లు ప్యాకేజీ తీసుకున్న వారు, 14 మంది భార్యాభర్తలు ఇద్దరూ ప్యాకేజీ పొందిన వారున్నా చర్యల్లేవు.వాసుపల్లి రాజేశ్, పూడిమడక

# ఆర్టీసీ సరకు రవాణా.. అదుర్స్



కాకినాడ : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) బస్సుల ద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడమే కాకుండా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి సారించి విజయవంతంగా సాగుతోంది. సంస్థకు ఆదాయాన్ని పెంచుకునే చర్యల్లో భాగంగా అమల్లోకి తెచ్చిన కార్గో, పార్సిల్ సేవలు ప్రజాదరణ పొందుతున్నాయి. కాకినాడ డిపో పరిధిలో 6 కార్గో పార్సిల్ కార్యాలయాలతో పాటు 5 బుకింగ్ పాయింట్లు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌లోని ఇతర సంస్థలకు దీటుగా అందుబాటు ధరలతో సరకు రవాణాలో సంస్థ దూసుకుపోతోంది. ఒక చోటు నుంచి మరోచోటుకు పంపే పార్సిళ్లకు ఆన్‌లైన్ ట్రాకింగ్ విధానం అమలుచేస్తూ అది ఎక్కడుందో ఫోన్ ద్వారా సంబంధిత వ్యక్తికి సమాచారం అందిస్తున్నారు. ఈ విధానం సత్ఫలితాలిస్తుండడంతో ఇతర రవాణా సంస్థల కంటే ఆర్టీసీ వైపు మొగ్గుచూపుతున్నారు.


**రెండు కొత్త కౌంటర్లు ప్రారంభం..**

కార్గో, పార్సిల్ సేవలకు వినియోగదారుల నుంచి ఆదరణ లభిస్తుండటంతో అదనంగా మరో రెండు కేంద్రాలను ప్రారంభించారు. ప్రస్తుతం కాకినాడ డిపో పరిధిలో కాకినాడ బస్టాండుతో పాటు సర్పవరం జంక్షన్, జీజీహెచ్, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం బస్టాండు, తాళ్లరేవులో కౌంటర్లు ఉండగా కొత్తగా రమణయ్యపేట, యానాం సమీపంలోని నీలపల్లి వద్ద బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. కాకినాడ డిపో పరిధిలో కార్గో పార్సిళ్ల రవాణా ద్వారా 2021 సంవత్సరంలో రూ.1.66 కోట్ల ఆదాయం సమకూరింది. 2022లో రూ.1.84 కోట్లు, 2023లో రూ.2.13 కోట్లు, 2024లో 2.20 కోట్ల ఆదాయం వచ్చింది.

**సేవలు విస్తృతం చేస్తున్నాం..**

ఆర్టీసీ కొరియర్, పార్సిల్ రవాణా సేవలకు ఆదరణ పెరిగింది. అనుకున్న లక్ష్యాలు సాధించాం. వ్యాపారుల్లో కూడా నమ్మకం కల్పించాం. అందుబాటులో ఉన్న అన్ని సదుపాయాలు, సౌకర్యాలు, సిబ్బందిని సద్వినియోగం చేసుకుంటే మరిన్ని లక్ష్యాలు చేరుకోవచ్చు. ప్రయాణికులతో పాటు సరకు రవాణాకు అత్యం త ప్రాధాన్యం ఇస్తున్నాం.
ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్, కమిషనర్, కాకినాడ డిపో

# స్వర్ణాంధ్ర సంకల్పం.. క్షేత్ర పర్యటనలకు సిద్ధం



మామిడికుదురు: గ్రామాలను మరింత ఉన్నతంగా ఏవిధంగా తీర్చిదిద్దాలి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు ఏవిధంగా ఉపయోగించుకుంటున్నారు.. వాటితో ఆయా కుటుంబాల్లో పురోగతి ఎలా ఉంది.. ప్రజలు ఏవిధమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు.. గ్రామ, వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఏమున్నాయి.. ఇలా సకల అంశాలపై వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకోవాలంటే క్షేత్ర పర్యటనలతోనే సాధ్యమవుతుంది. ప్రజలతో మమేకమైతేనే వారి అభిప్రాయాలు తెలుసుకోగలుగుతాం. దీనికిగాను కూటమి ప్రభుత్వం ఉద్దేశించిన స్వర్ణాంధ్ర సంకల్పం కార్యక్రమాన్ని ఈ నెల 21 నుంచి 23 వరకు అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట రెవెన్యూ డివిజన్ల పరిధిలో 17 గ్రామాలు, 3 వార్డులను ఎంపిక చేశారు. ఐఏఎస్ అధికారులు, వివిధ శాఖాధిపతులు నిర్దేశించిన గ్రామాలను సందర్శించనున్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో మూడు రోజులు, రెండు రాత్రులు అక్కడ ప్రజలతో కలిసి ఉంటారు. గ్రామాల్లో సాకారమైన పనులు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై వీరు నిశితంగా పరిశీలిస్తారు. అక్కడి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన కార్యాచరణ చేస్తారు. వివిధ శాఖలకు చెందిన స్థానిక అధికారులు వారి వెంట ఉంటారు. సందర్శనకు వచ్చే ఉన్నతాధికారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూర్చడంలో జిల్లా అధికారులు నిమగ్నమవ్వాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

**ఎంపిక చేసిన గ్రామాలివే**

అమలాపురం డివిజన్‌లో.. ముమ్మిడివరం వార్డు-3, అమలాపురం వార్డు-1, అమలాపురం గ్రామీణంలోని బడుగువారిపేట, కాట్రేనికోనలోని చెంచులగరువు, సఖినేటిపల్లిలోని ఉయ్యూరివారిమెరక, ఐ.పోలవరంలోని కేశనకుర్రు, మలికిపురం, మామిడికుదురు, రాజోలు, ఉప్పలగుప్తం.కొత్తపేట డివిజన్‌లో... ఆలమూరులోని చెముడులంక-1, రావులపాలెంలోని రావులపాడు, ఆత్రేయపురంలోని వసంతవాడ, కొత్తపేట, పి.గన్నవరం.

రామచంద్రపురం డివిజన్‌లో.. మండపేటలోని వార్డు-1, గ్రామీణంలోని ద్వారపూడి, కె.గంగవరం, కపిలేశ్వరపురం, రాయవరం.

సంసిద్ధంగా ఉన్నాం

ఎంపిక చేసిన గ్రామాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఉన్నతాధికారుల క్షేత్ర సందర్శనకు సమాయత్తమయ్యాం. దీనికిగాను డివిజన్ పరిధిలోని గ్రామాల్లో అధికారులను సంసిద్ధం చేశాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే మార్గదర్శకాల ద్వారా అవసరమైన మరింత కార్యాచరణ చేస్తాం.
పి.బొజ్జిరాజు, డీఎల్పీవో, అమలాపురం

# పారిశ్రామిక పార్కుల్లో ప్లాట్లు



సర్పవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ఏపీఐఐసీ పారిశ్రామిక పార్కుల్లో అభివృద్ధి చేసిన ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఏపీఐఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే కేటాయిస్తామని జోనల్ మేనేజర్ రమణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

**స్థలాలు..:** రాజానగరం మండలం కలవచర్ల ఎంఎస్ఎంఈ పార్కులో 261 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. చదరపు మీటరు ధర రూ.3,241. సామర్లకోట మండలం వేట్లపాలెంలో ట్రెడిషనల్ ఫుడ్ పార్కులో 84 ప్లాట్లుండగా చ.మీ. రూ.3,150. కాకినాడ గ్రామీణం వాకలపూడి ప్రాంతంలో 31 ప్లాట్లు ఉన్నాయి.. ఇక్కడ చ.మీ. రూ.10,643. పెద్దాపురం ఆర్‌బీపట్నంలో 8 ప్లాట్లు ఉండగా చ.మీ. రూ.2,329. పెద్దాపురం ఫేజ్-2లో 5 ప్లాట్లు ఉండగా చ.మీ. రూ.5,174గా నిర్ణయించారు.

**భవనాలు..:** పెద్దాపురం ట్రెడిషనల్ ఫుడ్ పార్కులోని పరిపాలనా భవనంలో ఒక అంతస్తులో 2557 చదరపు అడుగులకు అద్దె రూ.28,127, పెద్దాపురం లేఅవుట్ ఫేజ్-1లోని సీఎఫ్‌సీ భవనంలో ఒక అంతస్తులో 2597 చ.అ.లకు అద్దె రూ.28,567గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఏపీఐఐసీ మార్గదర్శకాల ప్రకారం నిబంధనలు వర్తిస్తాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జోనల్ మేనేజర్ కోరారు.

# మూత్రపిండం.. దినదిన గండం

విజయనగరం : ఉమ్మడి జిల్లా పరిధిలో మూత్రపిండాల వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. సమస్య తీవ్రమయ్యే వరకు తెలుసుకునే వెసులుబాటు లేకపోవడంతో ప్రాణాల మీదకు వస్తోంది. ప్రస్తుతం 30 ఏళ్లు నిండని వారు సైతం కిడ్నీ సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. విజయనగరం, పార్వతీపురం జిల్లా ఆసుపత్రులు, పాలకొండ ప్రాంతీయాసుపత్రిలో డయాలసిస్ కేంద్రాలున్నాయి. రెండు జిల్లాల్లో ప్రస్తుతం 475 మంది డయాలసిస్‌కు వస్తున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవారు ఎక్కువగా వ్యాధి బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం మన్యం జిల్లాలో ఎన్‌సీడీ 3.0 సర్వే జరుగుతోంది. 16 లక్షల మంది వివరాలు సేకరించగా 80 వేల మంది మధుమేహం, 1.24 లక్షల మంది అధిక రక్తపోటు బాధితులు ఉన్నారని తేలడం ఆందోళన కలిగిస్తోంది.

నగరంలో వైఎస్ఆర్ ప్రాంతానికి చెందిన సుమారు 50 ఏళ్ల వ్యక్తికి ఎటువంటి చెడు అలవాట్లు లేవు. దర్జీ వృత్తి చేసుకునే వారు. ఆసుపత్రికి వెళ్తే కిడ్నీ సమస్య ఉందని చెప్పడంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందారు. ఆ తర్వాత కొద్ది రోజులు విజయనగరంలో డయాలసిస్ చేయించుకున్నాడు. అయినప్పటికీ మూడు నెలల కిందట చనిపోయారు. అతని ఇద్దరు చిన్న పిల్లల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. తల్లి కూలీ చేసి వారిని పెంచుతోంది.


జియ్యమ్మవలస మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎస్.సంతోష్‌కు కాళ్లకు వాపులు రావడంతో సొంతంగా మాత్రలు వాడారు. అవి కిడ్నీలపై ప్రభావం చూపడంతో 2010 నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నారు. గుర్ల మండలానికి చెందిన సత్యవతమ్మ (55) నాలుగేళ్లు కిడ్నీ సమస్యతో బాధపడింది. ఉత్తరాంధ్రలో ఎన్ని ఆసుపత్రులు ఉన్నాయో.. అన్నింట్లో కుటుంబ సభ్యులు చూపించారు. ఎగ ఊపిరి, శ్వాస తీసుకోవడం వంటి సమస్యలతో బాధపడేది. డయాలసిస్ చేయించారు. రూ.10 లక్షలపైనే వైద్యం కోసం ఖర్చు చేసినా ప్రాణాలు నిలవలేదు.

# దోచుకున్నా.. దాచేస్తున్నారు!

తిరుపతి : చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లిలో ఆప్షన్-3 కింద 713 ఇళ్లను గుత్తేదారు నిర్మించాల్సి ఉండగా.. గృహ నిర్మాణ సంస్థలోని ఓ డీఈఈ.. అతని భార్య, తల్లి పేరిట పనులు దక్కించుకున్నారు. ఇదేవిధంగా రేణిగుంట మండలం జీపాళ్యం, వడమాలపేట మండలం కల్లూరులోనూ ఆ సంస్థ సిబ్బందే పనులు చేశారు. నిబంధనలు ఉల్లంఘించారని విజిలెన్స్ అధికారులు గుర్తించినా ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు.

పుంగనూరు నియోజకవర్గంలోనూ గతంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన ఇళ్లకు వైకాపా హయాంలో బిల్లులు చేసుకున్నారు. ఇది వాస్తవమేనని జగన్ పాలనలోనే గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సంస్థ అధికారులు, విజిలెన్స్ బృందాలు నిర్ధారించినా బాధ్యులపై చర్యలు లేవు.

వైకాపా హయాంలో గృహ నిర్మాణ సంస్థలో అవినీతి రాజ్యమేలింది. కొందరు అధికారులు, ఆ పార్టీ నాయకులు నిబంధనలకు యథేచ్ఛగా తూట్లు పొడిచారని ఆనాడే అక్రమాలన్నీ వెలుగు చూసినా ఉన్నతాధికారుల వరకు అంతా చోద్యం చూశారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత అప్పటి బాగోతాలపై విజిలెన్స్ యంత్రాంగం విచారణ జరిపింది. అక్రమాలు నిజమేనని తేల్చింది. అయితే ఆ నివేదికలను ఉన్నతాధికారులు బుట్టదాఖలు చేయడంపై విస్మయం



వ్యక్తమవుతోంది. బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు నిధులు రాబడితే భవిష్యత్తులో తప్పులు చేయాలంటే ఎవరైనా భయపడతారు.సొంతంగా ఇల్లు కట్టుకోలేని పేదలకు గృహాలు నిర్మించేందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి వైకాపా ప్రభుత్వం టెండర్లు పిలిచింది. వీటిని ఆప్షన్- 3 ఇళ్లుగా పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో 16,393 గృహాలున్నాయి. వాస్తవంగా ఇవి గుత్తేదారులు కట్టాలి. ఇందుకు భిన్నంగా 2,180 ఇళ్లను గృహ నిర్మాణ సంస్థలోని ఇద్దరు డీఈఈలు, వార్డు సచివాలయ ఉద్యోగి, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒకరు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారు. మొత్తంగా రూ.12.05 కోట్లు వారికి బిల్లుల రూపేణా చెల్లించారు. సిమెంట్, స్టీల్, నిర్మాణ సామగ్రి పేరుతో మరో రూ.4.04 కోట్లు.. వెరసి రూ.16.09 కోట్లు సమర్పించారు.

**ప్రారంభంలో హడావుడి చేసి**

ఈ బాగోతంపై రెండు నెలల క్రితం గృహ నిర్మాణ సంస్థలోని విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. అంతకుముందు కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే రాష్ట్ర విజిలెన్స్ యంత్రాంగం సైతం ఆప్షన్-3 గృహాల నాణ్యత, చెల్లింపుల గురించి ఆరా తీసింది. బాధ్యులెవరో గుర్తించి క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. ప్రజాధనం ఎంత దుర్వినియోగమైందో స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఆ నివేదిక ప్రకారం ఎవరిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

**రోజుల వ్యవధిలోనే పూర్తయ్యాయంటూ..:** పుంగనూరు నియోజకవర్గంలో అవినీతి కొత్త పుంతలు తొక్కింది. 2014- 19 మధ్య తెదేపా హయాంలో నిర్మించిన, అర్ధంతరంగా ఆగిపోయిన గృహాలకు కూడా ఇక్కడ బిల్లులు చేశారు. రోజుల వ్యవధిలోనే గోడల దశ నుంచి ఇంటి నిర్మాణం పూర్తయిందంటూ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశారు. అధికారులు, సిబ్బంది వాటాలు తీసుకొని వైకాపా అనుకూల వ్యక్తుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. దీనిపై సైతం ప్రభుత్వానికి నివేదిక అందింది. ఇదే తరహాలో వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ కాలనీలోనూ రూ.13.75 లక్షల అవినీతి జరిగిందని తేటతెల్లమైంది. 53 ఇళ్లు పూర్తి చేయకుండానే పూర్తి బిల్లులు చెల్లించేశారు.

**ఏ అవకాశాన్ని వదలకుండా దోచి..**

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2020 డిసెంబరులో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద గృహాలు మంజూరు చేశారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈ రెండు వ్యవహారాల్లోనూ అవినీతి జరిగింది. వీటితోపాటు స్థలాల కొనుగోలు, చదునులోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు వెదురుకుప్పం మండలంలోని కొండ కింద ఉన్న ఓ లే అవుట్‌ను చదును చేసేందుకు రూ.80 లక్షలు ఖర్చు చేశారు. ఇదే ఖర్చుతో అనువైన ప్రాంతంలో మంచి స్థలం కొనుగోలు చేయవచ్చని తెలిసినా ఆ దిశగా అడుగులు పడలేదు. ఇలా అడుగడుగునా వైకాపా నేతలు ప్రభుత్వ సొమ్మును దోచేశారు. సందట్లో సడేమియా అన్నట్టు పలువురు అధికారులు సైతం చేతివాటం ప్రదర్శించారు.

# ఇంతెందుకు.. తగ్గిద్దాం!

తిరుపతి : తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాల స్థానం లో శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల నిర్మాణాలకు వైకాపా హయాంలో ఏకకాలంలో రూ.600 కోట్లకు టెండర్లు ఖరారు చేయడాన్ని విజిలెన్స్ విభాగం గతేడాది ఇచ్చిన నివేదికలో తప్పు పట్టింది. ఎక్కువ కొటేషన్ల టెండర్లు ఆమోదించారని పేర్కొంది. తితిదే గణాంక అధికారి, ఇంజినీరింగ్ విభాగం ఏకకాలంలో రూ.300 కోట్లు అచ్యుతం, రూ.300 కోట్లు శ్రీపాదం వసతి భవనాలకు అనుమతులు ఇవ్వడంలో గత పాలకుల అవినీతి మరకలు ఉన్నాయంటూ నివేదిక సమర్పించింది. ఈ విషయాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.ఈ రెండు సముదాయాల పనులు 2024 మార్చి 15 నుంచి ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రెండు వసతి కేంద్రాలకు సంబంధించి రూ.300 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు వసతి



గృహాలకు సంబంధించి నిర్మాణ వ్యయం తగ్గించే అవకాశాలు ఉన్నాయంటూ ఇటీవల జరిగిన తితిదే పాలక మండలి సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో కొన్ని అంశాల్లో వ్యయం తగ్గించేందుకు ఇంజినీరింగ్ విభాగం నివేదికలు రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

**సదుపాయాలు ఇలా..**శ్రీపాదం, అచ్యుతం తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు ఉంటాయి. ఒకటో అంతస్తులో పార్కింగ్, 2వ అంతస్తులో రిసెప్షన్, అన్నదాన కేంద్రం ఉంటాయి. 3, 4 అంతస్తుల్లో 48 డార్మెటరీలు, 5 నుంచి 9 అంతస్తుల్లో 532 గదులు నిర్మిస్తున్నారు.

చురకలు



# నిధులున్నా నిర్లక్ష్యమెందుకో..?

రాజమహేంద్రవరం : గత ప్రభుత్వ హయాంలో నిధుల్లేక పలు భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయిన పరిస్థితులున్నాయి. కొన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునఃప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నిధులు పుష్కలంగా విడుదలవుతున్నా నిర్మాణాల్లో గుత్తేదారు సంస్థల నిర్లక్ష్యం పూర్తిస్థాయిలో కనిపిస్తోంది. దీనికి రాజమహేంద్రవరం జీజీహెచ్ వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాల ప్రధాన భవనం పనులే నిదర్శనం. 2022లో రూ.450 కోట్లతో రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనాసుపత్రి భవన నిర్మాణం ప్రారంభించారు. విద్యార్థుల బోధనకు తాత్కాలిక భవనం, ఆసుపత్రి ఆధునికీకరణ, అయిదు అంతస్తుల వసతి గృహాల భవనాలు, మాతాశిశు భవనంపై రెండంతస్తుల బ్లాకులు నిర్మించారు. ఆసుపత్రి పక్కన కేంద్ర కారాగారం స్థలంలో రూ.90 కోట్లతో వైద్య కళాశాల ప్రధాన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇది ఈ ఆగస్టు నెలకు పూర్తిస్థాయిలో అన్ని వసతులతో అందుబాటులోకి రావాల్సి ఉంది. వీటికి సంబంధించి కూటమి ప్రభుత్వం పుష్కలంగా నిధులు విడుదల చేస్తున్నా గుత్తేదారు



సంస్థ నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. భవనం అందుబాటులోకి రాకుంటే వచ్చే ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేటప్పుడు వైద్యవిద్యార్థుల బోధనకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ భవనాన్ని సెల్లార్, జీప్లస్-4గా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. మూడు, నాలుగు నెలల్లో ఇది పూర్తిస్థాయి వసతులతో అందుబాటులోకి రావాల్సి ఉండగా.. ఇదేమాదిరి పనులు జరిగితే భవనం పూర్తయ్యేసరికి మరో ఏడాది పట్టే అవకాశం ఉందని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు నిర్మాణాలపై పర్యవేక్షణ చేస్తూ త్వరితగతిన పనులు జరిగేలా చూసేందుకు ప్రయత్నిస్తున్నా గుత్తేదారు సంస్థ తీరు నత్తనడకన సాగుతుండడం విమర్శలకు తావిస్తోంది.

# హరిత వనాలుగా విద్యాలయాలు

పామర్రు : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కూరగాయలు, ఆకుకూర తోటల పెంపకం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఐఎంఎంఎస్ యాప్‌లో కిచెన్ గార్డెన్ అవసరం, ఖాళీ స్థలం వివరాలు, వీటి నిర్వహణకు కమిటీని రూపొందించి సభ్యుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. హరిత వనాలుగా, పోషకాహార తోటల పెంపక క్షేత్రాలుగా మార్చడానికి జిల్లాలో 858 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలకు రూ.5000 చొప్పున మొత్తం రూ.42.90 లక్షలు ఆయా మండల విద్యాశాఖాధికారి1 ఖాతాలకు సోమవారం వేశారు. వీటిని పాఠశాలల యాజమాన్య ఖాతాలకు జమ చేస్తారు. ఇప్పటికే అమ్మకోసం ఒక మొక్క పేరుతో పలు పాఠశాలల్లో పండ్ల



మొక్కలు నాటారు.

**మొక్కలు, పాదుల పెంపకం వివరాలు**

ప్రధానోపాధ్యాయులు 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అటవీ శాఖ నర్సరీలకు వెళ్లి మొక్కలు తెచ్చుకుని పాఠశాలలో నాటి, పెంచాల్సి ఉంటుంది. నాటిన మొక్కల వివరాలను 'ఫారెస్ట్.ఏపీ.జీవోవి.ఇన్' వెబ్‌సైట్లో పొందుపరచాల్సి ఉంటుంది. ధవళేశ్వరం (రాజమహేంద్రవరం), పల్ల కడియం (రాజానగరం), పేరూరు, కామనగరువు (అమలాపురం), కట్టుంగ, మెర్లపాలెం (ఆత్రేయపురం), (శ్రీరామపురం (కపిలేశ్వరపురం), అవిడి (కొత్తపేట మండలం)లో మొక్కల పెంపకం నర్సరీలున్నాయి. వీటి నుంచి జామ, మామిడి, సపోట వంటి పండ్ల మొక్కలు తెచ్చి నాటుతారు. ఉద్యానశాఖ నుంచి వంగ, బెండ, బీర, కాకర, ఆనప, తోటకూర, పాలకూర, గోంగూర తదితర కూరగాయల విత్తనాలు ఒక కిట్‌గా స్థలమున్న పాఠశాలలకు అందించనున్నారు.

# అటుగా పో'దారంటే'.. అవట్లేదు!

కాకినాడ : కాకినాడలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో చేపట్టిన పలు పనులు ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. రూ.90 కోట్లతో 2018-19లో నిర్మించిన వలసపాకల-పోర్టు రైల్వేస్టేషన్ రోడ్డు మాత్రం నిరుపయోగంగా ఉంది. రోడ్డులో కొంత మేర పనులు అసంపూర్తిగా వదిలేయడంతో లక్ష్యం నెరవేరలేదు. వలసపాకల ప్రధాన రోడ్డు నుంచి ఆర్టీఓ కార్యాలయం, మెయిన్ ఫారం సెంటర్, పోర్టు రైల్వేస్టేషన్ మీదుగా జగన్నాథపురం వంతెన రోడ్డుకు అనుసంధానం దీని నిర్మాణం చేపట్టారు. 9 కి.మీ. పొడవుగల ఈ రోడ్డును స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపట్టారు. మెయిన్ రోడ్డులో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఈ రోడ్డును నిర్మించారు. సర్పవరం జంక్షన్ వైపునుంచి అమలాపురం, రామచంద్రపురం వైపువెళ్లే ప్రయాణికులు మెయిన్ రోడ్డుకు ప్రత్యామ్నాయంగా దీనిని వినియోగించేందుకు నిర్మించారు. అమలాపురం, రామచంద్రపురం వైపునుంచి వచ్చే వాహనాలు కూడా నగరంలోకి రాకుండా ఈ రోడ్డు మీదుగా పిఠాపురంవైపు వెళ్లవచ్చు. ఇంతటి ప్రయోజనకరమైన రోడ్డును గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కేవలం అర కిలోమీటరు మేర పూర్తి చేయలేకపోయారు. వాస్తవానికి ఈ రోడ్డులో కొంత స్థలం రైల్వేశాఖ పరిధిలో ఉంది. ఆ శాఖ నుంచి అనుమతులు తీసుకుని రోడ్డును పూర్తి చేయాల్సిఉంది. గత తెదేపా హయాంలో అనుమతులకోసం ప్రయత్నిస్తుండగానే.. ప్రభుత్వం మారింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా అయిదేళ్లపాటు పట్టించుకోలేదు. సమస్యను ఎమ్మెల్యే కొండబాబు వివరించగా రహదారి రిపేర్చొచ్చిన చెత్తను శుభ్రం చేయించారు. దాంతో కాస్త మార్గం ఏర్పడింది.

**కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లా..**

గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డు నిర్మించాం. మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ కట్టడి, దుమ్ములపేట, సంజయ్‌నగర్, సాంబమూర్తినగర్, రెవెన్యూకాలనీ తదితర ప్రాంతాలవారు జగన్నాథపురంవైపు వెళ్లేందుకు దగ్గర దారిగాను దీనిని నిర్మించాం. గత పాలకులు అర కి.మీ. రోడ్డును నిర్మించలేకపోయారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లా. పూర్తి చేయిస్తాం.

– వనమాడి కొండబాబు, కాకినాడ ఎమ్మెల్యే

# విస్తరణ నాణ్యత 'కట్ట'కథ



పత్తికొండ : రాయలసీమ జిల్లాలకు కేటాయించిన నీటిని పూర్తిస్థాయిలో తరలించేందుకు హంద్రీనీవా ప్రధాన కాలువను విస్తరిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువను 134 కి.మీ. విస్తరణ పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం 2,100 క్యూసెక్కుల నీటిని తరలించే సామర్థ్యాన్ని 3,850 క్యూసెక్కులకు పెంచాలన్న లక్ష్యం నిర్దేశించుకున్నారు. 6.35 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.660 కోట్లతో పనులు చేపట్టారు. జూన్ 15 నాటికి పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ హడావుడిలో నాణ్యత చెదిరిపోయింది. మట్టి పనులకు రోలింగ్ చేయకపోవడంతో కోతకు గురవుతోంది.

**చిరు జల్లులకే చెదిరింది**

మద్దికెర-కసాపురం గ్రామాల మధ్య హంద్రీనీవా ప్రధాన కాలువపై విస్తరించిన మట్టికట్ట ఇది. పనుల్లో భాగంగా కుడి వైపున తవ్వి విస్తరిస్తున్నారు. సక్రమంగా రోలింగ్ చేయడం లేదు. ఇటీల కురిసిన చిరు జల్లులకు పలుచోట్ల కోతకు గురైంది. ఇలాగే జరిగితే కాలువకు నీరు వదిలే సమయంలో గండ్లు పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఎక్కడికక్కడ కోత**

హంద్రీనీవా కాలువ వెంట విస్తరణ పనుల్లో భాగంగా కాలువ మట్టినే తొలగించి కట్టగా నిర్మిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొత్తగా నిర్మిస్తున్న కట్ట కోతకు గురవుతోంది.

పత్తికొండ నుంచి మద్దికెర వరకు నిర్మించిన ప్రధాన కాలువను కొన్ని చోట్ల లెవెల్ ఆధారంగా భూమి ఉపరితలం నుంచి ఇరువైపులా మట్టి కట్టలు వేసి నిర్మించారు. అనంతరం ఆ మట్టితోనే పాత కట్టను విస్తరిస్తూ పనులు చేస్తున్నారు.పనుల్లో నాణ్యత కొరవడటంతో ఇటీవల కురిసిన వర్షాలకు మట్టికట్ట పలు చోట్ల కోతకు గురైంది. మరికొన్నిచోట్ల ఇప్పటికే భారీగా నెర్రలు ఏర్పడ్డాయి. ఇలాంటి చోట వర్షాలు కురిసే సమయంలో భారీగా కోతకు గురయ్యే ప్రమాదముందని ఈ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# శాఖ మారింది.. 'దారి'ద్ర్యం వీడకుంది



నంద్యాల : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీరాజ్ రహదారులను పదేళ్ల కిందట ఆర్అండ్‌బీ శాఖలోకి మార్చారు. మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలను నేరుగా కలిపే పంచాయతీరాజ్ రహదారులను ఆర్అండ్‌బీకి బదలాయించారు. తద్వారా గ్రామాలకు సులువుగా రాకపోకలు చేసేందుకు అవకాశం కల్పించారు. శాఖల పేర్లయితే మారాయి కాని రహదారుల దుస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు రాకపోవడంతో గ్రామీణులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు.

**56 మార్గాలు.. 944 కి.మీలు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 944 కి.మీల పొడవైన 56 పంచాయతీ రాజ్ రహదారులను పదేళ్ల కిందట ఆర్అండ్‌బీలోకి బదలాయించారు. నంద్యాల నియోజకవర్గంలో 60 కి.మీలు, డోన్ 84, పాణ్యం 210, నందికొట్కూరులో 64, ఆళ్లగడ్డ 50, బనగానపల్లి 85, శ్రీశైలం 42, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు 58, ఆదోని 32, పత్తికొండ 64, ఆలూరు 75, కోడుమూరు 52, మంత్రాలయం నియోజకవర్గంలో 68 కి.మీల రహదారులు ర.భ.శాఖకు అప్పగించారు. వీటిలో 60 శాతంపైగా రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లు బదలాయింపు జరిగినా ప్రత్యేకంగా నిధులు విడుదల కాకపోవడంతో మరమ్మతులు కూడా చేయించలేని దుస్థితి నెలకొంది.

**ఒక్కటి బాగుచేస్తే ఒట్టు**

కర్నూలు జిల్లా ఆదోని డివిజన్‌లోని ఎమ్మిగనూరు- మాలపల్లి రోడ్డు ఇది. 20 కి.మీలు పొడవున్న ఈ రహదారిపైన ఆర్టీసీ బస్సులే 100కు పైగా రాకపోకలు సాగిస్తున్నాయి. గుంతలమయమై అధ్వానంగా మారిన ఈ రోడ్డును ఎనిమిదేళ్లుగా అభివృద్ధి చేయడం లేదు.

**ఛిద్రమయ్యాయి**

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కోసిగి- కరిని రహదారితో పాటు బిలేకల్లు- ఎమ్మిగనూరు రోడ్డు ఛిద్రమయ్యాయి. కోడుమూరు నియోజకవర్గంలో 42 కి.మీల మేర రహదారులు దెబ్బతిన్నాయి. పాణ్యం నియోజకవర్గంలో ఓర్వకల్లు- తిప్పాయిపల్లె రోడ్డు ప్రయాణానికి పనికిరాకుండా మారింది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఉయ్యాలవాడ- గోవిందపల్లె మార్గంలో నాలుగు కి.మీ పొడవున రహదారి దెబ్బతింది.

**వీటిని వదిలేశారు**గుంతలమయమైన ఆర్అండ్‌బీ రహదారులకు ఆరు నెలల కిందట నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేశారు. కానీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్‌బీలోకి బదలాయించిన రోడ్లకు మాత్రం మరమ్మ తులు చేపట్టలేదు.పశ్చిమ ప్రాంతమైన ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని నియోజకవర్గాల్లో తుంగభద్ర పుష్కరాల కింద నిధులను ప్రతిపా దించి టెండర్లు పిలిచారు. నిధులు విడుదల కాకపోవడంతో పనులు జరగలేదు. దారుణంగా దెబ్బతిన్న ఈ రహదారులకు మరమ్మతులు చేసినా ప్రయోజనం ఉండదన్న ఉద్దేశంతో వీటిని వదిలేశారు.

# కాలువల ప్రక్షాళనకు కదలిక



పి.గన్నవరం: వేసవి క్లోజర్ పిరియడ్‌కు సంబంధించి కాలువల నిర్వహణ పనుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. సాగునీటి సంఘాల ప్రతినిధులు గత రెండు రోజులుగా వీటిని మొదలుపెట్టారు. ప్రభుత్వం నుంచి లిఖితపూర్వక ఆదేశాలు రాకపోవడంతో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు ఇటీవల మెమోల రూపంలో ఆదేశాలు ఇచ్చారు. కొంతమంది శాసనసభ్యుల ఒత్తిడి, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి తీసుకెళ్లడం తదితర పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

**ఆలస్యంగా నీటి విడుదల?**

ఏప్రిల్ 27న పంటకాలువలకు సాగునీరు నిలుపుదల చేశారు. క్లోజర్ పనులకు లిఖితపూర్వక ఆదేశాలు రాలేదని పనులు మొదలు పెట్టడంలో తీవ్రజాప్యం జరిగింది. ఈవిధంగా 18 రోజుల సమయం వృథాగా పోయింది. ఐ.ఎ.బి. (సాగునీటి సలహామండలి) సమావేశంలో నిర్ణయించిన ప్రకారం జూన్ 1నే కాలువలకు నీరు విడుదల చేయాలి. క్లోజర్ పనులు ఆలస్యంగా మొదలు పెట్టడంతో జూన్ 10 తరువాత గాని నీరు విడుదల చేసే పరిస్థితులు ఉండవని జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు భావిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒ.అండ్.ఎం.(ఆపరేషన్ అండ్ మెయింటెనన్స్) కింద రూ.35.81 కోట్ల విలువైన 853 పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పటికీ నిధుల కేటాయింపు చేస్తూ లిఖిత పూర్వకమైన ఉత్తర్వులు రాకపోవడంతో డోలాయమాన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారుల నుంచి మెమోల రూపంలో ఆదేశాలు రావడంతో వీటికి కదలిక ఏర్పడింది. రూ.38.81 కోట్ల విలువైన పనుల్లో సుమారు రూ.5 కోట్లతో కాలువల్లో పూడికతీత, షట్టర్ల మరమ్మతు వంటివి ఉన్నాయి. కాలువలకు నీరు విడుదల చేసేలోగా పూర్తిచేయాలి.**రెండు రోజుల్లో ఊపందుకుంటాయి**

కాలువల క్లోజర్ పిరియడ్ పనులకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ మేరకు కిందిస్థాయి అధికారులకు తెలియజేశాం. ప్రస్తుతం 32 పనులు మొదలుపెట్టారు. రానున్న రెండు రోజుల్లో ఊపందుకుంటాయి.

కె.గోపీనాథ్, ఎస్.ఇ., జలవనరులశాఖ, ధవళేశ్వరం సర్కిల్

# కాసుల డీజిల్

అమలాపురం : పొరుగున ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి డీజిల్, పెట్రోల్ అక్రమ మార్గాల్లో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోకి ప్రవేశిస్తోంది. ధరలో వ్యత్యాసం ఉండటంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. యానాం చెంతన ఉన్న ఐ.పోలవరం మండలం నుంచి ముమ్మిడివరం, అమలాపురం చుట్టుపక్కల మండలాలకు నిత్యం వేల లీటర్లు అక్రమంగా తరలిస్తున్నారు. కోనసీమలో ఆక్వా సాగు పెద్ద ఎత్తున ఉండటంతో చెరువుల వద్ద జనరేటర్లలో భారీగా డీజిల్ వినియోగిస్తారు. వీరికి అవసరమైన డీజిల్ యానాం నుంచి ఇక్కడికి అక్రమంగా తెచ్చి విక్రయిస్తున్నారు. పెట్రోల్ సైతం తెస్తున్నారు. దీంతో పోల్చితే డీజిల్ పరిమాణం ఎక్కువ. బంకుల్లో లూజు విక్రయాలపై నిషేధం ఉన్నా.. యానాంలో వాటిని పట్టించుకోవడం లేదు. రవాణా సమయంలో కొందరు సిబ్బంది డబ్బులు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ వాహనాలు ఎక్కడైనా ప్రమాదానికి గురైతే భారీ నష్టం తప్పదు. వేసవి నేపథ్యంలో మరింత ముప్పు ఉంది.

**దొరికింది కొంతే..**

కోనసీమలోని తీర ప్రాంతాల్లో నదీమార్గంలో పడవలు, బోట్లు ద్వారా, ఇతర ప్రాంతాల్లో రోడ్డు మార్గంలో ఈ అక్రమదందా సాగుతోంది.



నిత్యం వేల లీటర్ల డీజిల్ అక్రమంగా యానాం నుంచి వస్తోంది. ఎక్కువ మంది పోలీసుల కన్నుగప్పి గమ్యం చేరుతున్నారు. అలాంటి వారికి కొంతమంది సిబ్బంది సహకారం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా మరింత నిఘా పెంచాల్సిన ఆవశ్యకత ఉంది.

**ఇక్కడి బంకుల్లో విక్రయాలు తగ్గి..**

యానాం నుంచి అక్రమంగా ఇంధనం వస్తుండటంతో కోనసీమ శివారు ప్రాంతాల్లోని పెట్రోలు బంకులు మూతపడుతున్నాయి. 216 జాతీయ రహదారి చెంతనే ఉన్న బంకులకు పెద్ద ఇబ్బంది లేకపోయినా, శివారు మండలాలైన కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు తదితర మండలాల్లోని కొన్ని బంకుల్లో అమ్మకాలు భారీగా తగ్గడంతో మూసివేసే పరిస్థితికి వస్తున్నాయి.**ఎవరినీ ఉపేక్షించం..**యానాం నుంచి అక్రమంగా డీజిల్, పెట్రోలు తరలించే వారిని ఉపేక్షించం. వీటి అక్రమ రవాణా కారణంగా ఇక్కడ ఇబ్బందులు తలెత్తుతాయి. వాహనాల్లో ఇంధనం తరలించడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

-టీఎస్ఆర్‌కే ప్రసాద్, డీఎస్పీ, అమలాపురం

# అతివేగం.. అంతులేని అనర్థం

చిత్తూరు : తిరుపతి జాతీయ రహదారిలో ముందు వెళ్తోన్న కంటైనర్‌ను అధిగమించే ప్రయత్నంలో కారు ఢీ కొట్టింది. అందులో ఉన్న ఏడుగురిలో అయిదుగురు ఘటనా స్థలంలోనే కన్నుమూశారు. ఆ సమయంలో దాదాపు 110- 120 కి.మీ. వేగంతో కారు ప్రయాణిస్తోంది. గాదంకి టోల్‌ప్లాజాకు మధ్యాహ్నం 1.17 గంటలకు చేరుకోగా ఆపై ఎనిమిది-తొమ్మిది నిమిషాలకే తోటపల్లి వద్ద దుర్ఘటన జరిగింది. అతివేగం, ముందున్న వాహనాన్ని త్వరగా అధిగమించి గమ్యస్థానానికి చేరాలన్న తొందరే ప్రమాదానికి కారణం. చిత్తూరు నగరం మురకంబట్టులో ముందు వెళ్తున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహన చోదకుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వేగంకన్నా ప్రాణం మిన్న.. ఇదీ రవాణా శాఖ నినాదం. అటు ప్రయాణికులు దీన్ని పాటించడం లేదు. ఇటు అతివేగానికి అడ్డుకట్ట వేయాల్సిన రవాణా శాఖ పట్టించుకోవడం లేదు. రోడ్డు భద్రతా వారోత్సవాలు ముగిసిన మరుసటిరోజే వాటిని ఆశాఖ మరచిపోతుండటంతో వాహనదారుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రహదారులు రక్తమోడుతున్నాయి.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు-తిరుపతి, బెంగళూరు- చెన్నై, పలమనేరు- కుప్పం, రేణిగుంట-నాయుడుపేట, రేణిగుంట- చెన్నై జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. తరచూ ఏదోఒక ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మానవ తప్పిదాలతోపాటు అధికారుల నిర్లక్ష్యం, అలసత్వమే దీనికి ప్రధాన కారణం. రహదారుల్లో వాహనాల వేగాన్ని నియంత్రించడం, నిబంధనలను అతిక్రమించిన వాహనాలను సీజ్ చేయడం వంటివి రవాణాశాఖ అధికారులు చేయలేకపోతున్నారు. పోలీసు అధికారులు నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతూ జరిమానాలు విధిస్తున్నా.. ప్రజల్లో చైతన్యం తేలేకపోతున్నారు.

**అధిగమిస్తూ.. అదుపుతప్పుతూ..**

రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి తిరుమలకు రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. త్వరగా దేవుడిని దర్శించుకుని అంతే త్వరగా గమ్యస్థానానికి చేరుకుని విధులకు హాజరవ్వాలని హడావుడి పడుతుంటారు. ఒక్కోసారి దర్శనం ఆలస్యమైతే కారులో వచ్చే వ్యక్తులు నిర్ణీత వేగానికి మించి వెళ్తున్నారు. ముందున్న లారీలు, బస్సులను అధిగమించే క్రమంలో అదుపు తప్పుతున్నారు. కొన్ని సందర్భాల్లో వేరే వరుసలో ఉన్న వాహనాలను ఢీకొడుతున్నారు. వాహనదారులు రహదారిపై అప్రమత్తంగా ఉండటమే కాకుండా.. వేగాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆగి ఉన్న వాహనాలతో..**

జిల్లాలోని రోడ్లు, రహదారుల పక్కనే దాబాలు, భోజనశాలలు, కొంత దూరంలో మద్యం దుకాణాలు ఉండటంతో భారీ వాహనాలు, ఇతర వాహనాలు రోడ్లపక్కనే ఆగుతున్నాయి. చిత్తూరు నుంచి తిరుపతి వరకు రహదారి పక్కనే ఈ తరహా పార్కింగ్ ఎక్కువగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కనిపించని రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు**

చిన్న వాహనాల నుంచి భారీ వాహనాల వరకు వెనుకాముందు ఉండాల్సిన రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు చాలావరకు కనిపించడం లేదు. ఇవి ఉంటే రాత్రి సమయంలో చాలావరకు ప్రమాదాలు తగ్గే అవకాశాలు ఉన్నాయి.

**బెంగళూరు నుంచి స్నేహితుడి కారులో..**

తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హొసూరుకు చెందిన త్యాగరాజన్, బెంగళూరు సౌత్ గౌడనపాళ్యకు చెందిన బీఎస్ సహాన మధ్య ఓ హెల్త్ కంపెనీలో పనిచేసే సమయంలో పరిచయం ఏర్పడింది. తర్వాత రెండు కుటుంబాల మధ్య స్నేహం కొనసాగుతోంది. సహాన భర్త ఎస్ఆర్ రజిని గౌడ సినీపరిశ్రమలో పనిచేస్తున్నారు. రజినిగౌడ, బీఎస్ సహాన కుటుంబం తిరుమలకు వెళ్లాలని త్యాగరాజన్‌కు చెప్పడంతో ఆయన తన కుమారుడు క్రిష్విన్‌తో బయలుదేరారు. ఈనెల 25వ తేదీ తనతో జీఆర్‌బీ డెయిరీ ఫుడ్స్‌లో పనిచేసే స్నేహితుడి కారు తీసుకుని బెంగళూరుకు వెళ్లారు. మరుసటి రోజు రజినిగౌడ కుటుంబ సభ్యులు ఐదుగురితో కలిసి తిరుమలకు వచ్చారు. 28వ తేదీ వేకువ జామున శ్రీవారి దర్శనం పూర్తి చేసుకున్నారు. తర్వాత శ్రీకాళహస్తికి వెళ్లి దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణం అవుతున్నట్లు మధ్యాహ్నం 12.30 గంటలకు త్యాగరాజన్ తన భార్యకు ఫోన్ చేసి చెప్పారు.

**కుక్కల కోసం ఆగిపోయారు**త్యాగరాజన్ కుమారుడితోపాటు తన భార్యను తిరుమలకు రమ్మని పిలిచారు. అందరూ వెళ్తే ఇంట్లో ఉన్న రెండు కుక్కల బాధ్యత ఎవరు చూసుకుంటారని భార్య మీగల్ ఆగిపోయింది.

## సురేఖవాణి, సుప్రిత.. మరోసారి గ్లామర్ బ్లాస్ట్!

టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా పేరు తెచ్చుకున్న సురేఖ వాణి, ఇటీవల తన కూతురు సుప్రితతో కలిసి ఓ బోట్ రైడ్‌లో గ్లామర్ మెరుపులతో స్టెన్ అయ్యేలా స్టిల్స్ ఇచ్చింది. వైట్ అండ్ బ్లూ కలర్ డ్రెస్‌లలో తళుక్కున మెరిసిపోయిన ఈ మదర్–డాటర్ జోడీ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీరిద్దరూ కలిసి చేసిన ఈ ఫొటోషూట్‌కి అందాల ప్రదర్శనతో పాటు ఒక న్యాచురల్ హ్యాపీనెస్ మిక్స్ కావడం విశేషం. సురేఖ వాణి సింపుల్ బట్ బ్లూ డ్రెస్‌లో కనిపించగా, సుప్రిత వైట్ ఫిట్‌బాడీ డ్రెస్‌తో ఆకట్టుకుంది. వారిద్దరి మధ్య కనిపించిన బాండింగ్, ఫ్రీగా ఎంజాయ్ చేసిన అటిట్యూడ్ అభిమానుల్ని అలరించాయి. కెమెరా ముందే కాకుండా జీవితాన్నే ఫుల్‌గా ఎంజాయ్ చేసే తల్లి కూతుళ్ల మూడ్‌ను ఈ ఫోటోలు స్పష్టంగా చెప్పాయి. ప్రస్తుతం వీరి స్టైలిష్ లుక్స్ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతున్నాయి.



ఇక సురేఖ వాణి ఎన్నో టాప్ సినిమాల్లో అద్భుతమైన పాత్రలు పోషించారు. డైలాగ్ డెలివరీ, ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్స్ అన్నింటిలోనూ ఆమె సీనియర్ అనుభవం కనిపిస్తుంది. ఇటీవల ఓటీటీ ప్రాజెక్ట్స్‌లోనూ నటిస్తూ బిజీగా మారిపోయారు. ఇక ఆమె కూతురు సుప్రిత ఇప్పుడు సోషల్ మీడియా స్టార్ గా ఎదుగుతోంది. ఇప్పటికే ఫ్యాషన్ ఫోటోషూట్స్‌తో పాటు యూట్యూబ్ షార్ట్ వీడియోలతో ఫాలోవర్స్‌ని పెంచుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికలపై చాలా యాక్టివ్‌గా ఉండే ఈ మదర్–డాటర్ డ్యూ, వారి లైఫ్‌స్టైల్‌ను ఓ ఫ్యాషన్ శైలిలో చూపుతున్నారు. ఎప్పటికప్పుడు కొత్త లుక్స్, ట్రెండింగ్ ఫ్యాషన్‌లతో ఫాలోవర్స్‌కు విజువల్ ట్రీట్ ఇస్తున్నారు. సురేఖ వాణి వయస్సుతో సంబంధం లేకుండా ట్రెండ్స్‌ను ఫాలో అవుతుండటంతో యంగ్ జనరేషన్ నుంచీ మంచి స్పందన లభిస్తోంది.

## మరోసారి ఎన్టీఆర్ మేకోవర్.. ఎందుకంటే

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్టైనర్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ తనను తాను చాలా కొత్తగా మేకోవర్ చేసుకున్నాడు. ఎన్టీఆర్ తన కెరీర్లో మునుపెన్నడూ లేనంత స్లిమ్ గా ఈ సినిమా కోసం మారగా ప్రశాంత్ నీల్ ఈ లుక్ లో ఎన్టీఆర్ ను నెక్ట్స్ లెవెల్ లో చూపించనున్నట్టు తెలుస్తోంది. ఎప్పుడూ బొద్దుగా కనిపించే, ఎన్టీఆర్ నీల్ సినిమా కోసం చాలా బరువు తగ్గాడు. ఎన్టీఆర్ ఇంత స్లిమ్ అవడాన్ని చూసి అందరూ షాక్ అయ్యారు. అయితే కథ ఇక్కడితో అయిపోలేదు. ఎందుకంటే ఎన్టీఆర్ మరోసారి మేకోవర్ చేయాల్సి ఉందని తెలుస్తోంది. అయితే అది నీల్ సినిమా కోసం కాదు, నీల్ సినిమా తర్వాత ఎన్టీఆర్ చేయబోయే త్రివిక్రమ్ సినిమా కోసం. ఎన్టీఆర్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్న



సంగతి తెలిసిందే. ఈ సినిమా హిందూ పురాణాల్లో పెద్దగా ప్రాచుర్యం పొందని దేవుళ్లలో ఒకరైన కుమారస్వామికి సంబంధించిన కథగా తెరకెక్కబోతున్నట్టు నిర్మాత నాగ వంశీ ఆల్రెడీ క్లారిటీ ఇచ్చాడు. ఈ సినిమాలోని పాత్ర కోసం ఎన్టీఆర్ మరోసారి మేకోవర్ కావాల్సిన అవసరం ఉంది. కథలో భాగంగా ఎన్టీఆర్ భారీ శరీరంతో, స్థూలంగా కనిపించాల్సి ఉంటుందని తెలుస్తోంది. అందులో భాగంగానే ఎన్టీఆర్ మరోసారి మేకోవర్ అవాల్సి ఉంటుందంటున్నారు.

ప్రశాంత్ నీల్ సినిమా కోసం ఆల్రెడీ చాలా బరువు తగ్గిన ఎన్టీఆర్.. త్రివిక్రమ్ తో చేసే సినిమా కోసం మళ్లీ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ చేయాల్సి ఉంది. కాగా గతంలో ఎన్టీఆర్ త్రివిక్రమ్ తో చేసిన అరవింద సమేత సినిమా కోసం కూడా భారీ గా మేకోవర్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి వీరిద్దరి కాంబినేషన్ లో సినిమా రాబోతుండగా, ఈ సినిమా కోసం కూడా ఎన్టీఆర్ మేకోవర్ కాబోతున్నాడు. ఈ మిథికల్ స్టోరీలో త్రివిక్రమ్ ఎన్టీఆర్ ను ఎలా ప్రెజెంట్ చేస్తాడో అని చూడ్డానికి అందరూ ఎంతో ఆసక్తిగా ఉన్నారు.




## ఘాటీ స్పీడు పెంచాల్సిందే!



టాలీవుడ్ లో తిరుగులేని స్టార్‌డమ్ ను సొంతం చేసుకుంది స్వీటీ అనుష్క. బాహుబలి తర్వాత ఆ క్రేజ్ తారా స్థాయికి చేరినప్పటికీ అనుష్క చాలా సెలెక్టివ్ గా సినిమాలు చేస్తోంది. అలాంటి అనుష్క నుంచి సినిమా వచ్చి చాలా రోజులైంది. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి తర్వాత అనుష్క నుంచి మరో సినిమా రిలీజవలేదు. చాలా కాలం తర్వాత అనుష్క ఇప్పుడు ఘాటీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో లేడీ ఓరియెంటెడ్ సినిమాగా తెరకెక్కిన ఈ సినిమా జులై 11న రిలీజ్ కాబోతుంది. అంటే రిలీజ్ కు పట్టుమని మూడు వారాలు కూడా లేదు. అయినప్పటికీ ఘాటీ టీమ్ ఇప్పటివరకు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ను మొదలుపెట్టలేదు. పక్క సినిమాల నుంచి వరుస అప్డేట్స్, ప్రమోషన్స్ జరుగుతుండటంతో టీమ్ ఇంకా ఘాటీ ప్రమోషన్స్ ను మొదలుపెట్టలేదని తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం జూన్ 21 నుంచి ఘాటీ ప్రమోషన్స్ ను మొదలుపెట్టాలని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆ రోజు సినిమా నుంచి ఓ సాంగ్ ను రిలీజ్ చేసి ప్రమోషన్స్ ను స్టార్ట్ చేయాలని చూస్తున్నారట. రిలీజ్ కు రెండు వారాల ముందు ట్రైలర్ ను రిలీజ్ చేసి సినిమాపై హైప్ ను పెంచి అప్పట్నుంచి నెక్ట్స్ లెవెల్ ప్రమోషన్స్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. అనుష్క బరువు పెరిగి లావు అవడం వల్ల గతంలో ప్రమోషన్స్ కు దూరంగా ఉంది కానీ ఈసారి ఘాటీ ప్రమోషన్స్ లో అనుష్క కూడా పాల్గొననుందని అంటున్నారు. సెలెక్టెడ్ మీడియా ఛానెళ్లకు ఇంటర్వ్యూలివ్వడంతో పాటూ ఓ ప్రమోషనల్ ఈవెంట్ కు కూడా అనుష్క హాజరవడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలుస్తోంది. ఈ లోపు డైరెక్టర్ క్రిష్ ఘాటీని ప్రమోట్ చేయనున్నాడు. అనుష్క వచ్చాక ఇద్దరూ కలిసి ఘాటీ ప్రమోషన్స్ లో పాల్గొంటారట. ఆల్రెడీ ఘాటీ డిజిటల్ రైట్స్ అమెజాన్ ప్రైమ్ కు అమ్ముడయ్యాయి కాబట్టి ఇక సినిమా వాయిదా పడే ఛాన్స్ లేదు. కాబట్టి వీలైనంత త్వరగా మేకర్స్ సినిమా ప్రమోషన్స్ ను స్టార్ట్ చేసి సినిమాను ఆడియన్స్ లోకి తీసుకెళ్లగలిగితే బెటర్. ఈ సినిమాలో అనుష్క గంజాయి స్మగ్లింగ్ చేసే పాత్రలో కనిపించనుంది.

## కన్నప్పలో ప్రభాస్ వచ్చేదెప్పుడు?



మంచు విష్ణు కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న సినిమా కన్నప్ప ఇప్పటికే దేశవ్యాప్తంగా మంచి బజ్ ను సొంతం చేసుకుంది. శివ భక్తుడు అయిన కన్నప్ప జీవిత కథ ఆధారంగా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించి టీజర్, ట్రైలర్ ద్వారా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్ వంటి స్టార్ క్యాస్టింగ్ ఉండటంతో సినీప్రియుల్లో ఆసక్తి రెట్టింపు అయింది. శివుడిగా అక్షయ్ కుమార్, పార్వతిగా కాజల్, నందీ పాత్రలో ప్రభాస్ కనిపించనున్నారు. ఈ సినిమా జూన్ 27న గ్రాండ్ గా విడుదల కానుంది. ఇప్పటికే విష్ణు అమెరికాలో వివిధ ప్రమోషనల్ కార్యక్రమాల్లో పాల్గొంటూ సినిమాకు పాజిటివ్ హైప్ తీసుకొస్తున్నారు. ట్రైలర్‌లోనూ భారీ యాక్షన్, ఎమోషనల్ కంటెంట్ చూపించడంతో సినిమా విజువల్స్, స్కేల్ మీద అంచనాలు మరింతగా పెరిగాయి. మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, డైలాగ్స్ అన్నీ కంటెంట్ బలం గురించి హింట్ ఇస్తున్నాయి. ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం ప్రభాస్ పాత్రకు సంబంధించిన క్లారిటీ బయటకు వచ్చింది. సినిమాలో ప్రభాస్ పాత్ర మొత్తం సెకండాఫ్‌లోనే వస్తుందట. అదీ కూడా దాదాపు అరగంట నిడివి ఉన్న పాత్ర అని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్. అంటే అతను మామూలు గెస్ట్ అప్పీరియన్స్ కాదన్నమాట. కథకు కీలక మలుపు వచ్చే సమయంలో ప్రభాస్ పాత్ర ఎంటర్ అవుతుందని, కథను కొత్త దిశగా మలుపు తిప్పేలా ఉంటుందని తెలుస్తోంది. ఈ మ్యాటర్ బయటకు రావడంతో ప్రభాస్ ఫ్యాన్స్ లో ఆనందం నెలకొంది. ఎందుకంటే ఆయన పాత్ర చాలా పవర్‌ఫుల్ గా ఉండబోతోందన్న మాట. ట్రైలర్‌లో చూపించిన రెండు సన్నివేశాలు ఈ పాత్ర బలాన్ని సూచిస్తున్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నందీ పాత్రగా ప్రభాస్ కనిపించడం విశేషం. ఇది కేవలం కమెర్షియల్ యాంగిల్‌కే కాకుండా, కథలోని భక్తిని సూచించే కీలక పాత్ర కావడం సినిమాకు పెద్ద ఎస్సెట్ అవుతుంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించి ప్రమోషన్ పనులు కొనసాగుతున్నాయి. సినిమా విజువల్ ఎక్స్‌పీరియన్స్‌కు తగినట్టుగా టీమ్స్ పని చేస్తున్నాయి. మొత్తంగా చెప్పాలంటే, ప్రభాస్ పాత్ర కేవలం స్టార్డం కోసమే కాకుండా కథలో కీలకంగా ఉండబోతుందన్న టాక్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేస్తోంది. కన్నప్ప సినిమా జూన్ 27న థియేటర్లలో విడుదలవుతున్న విషయం తెలిసిందే. ఇక బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ ఏ రేంజ్ లో ఉంటాయో చూడాలి.

## సంయుక్త ప్లానింగ్ మామూలుగా లేదుగా

సంయుక్తమీనన్..కేరళ పాలక్కాడ్‌కు చెందిన ఈ మలయాళీ సోయగం గత కొంత కాలంగా తెలుగులో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ గోల్డెన్ లెగ్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. వరుస ఫ్లాపుల్లో ఉన్న హీరోలకు హిట్‌లని అందిస్తూ ఇండస్ట్రీలో లక్కీ హీరోయిన్‌గా మారిన సంయుక్త మీనన్ ఇప్పుడు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ అని తేడా లేకుండా అన్నీ భాషల్లీ చుట్టేస్తూ క్రేజీ ప్రాజెక్ట్‌లని సొంతం చేసుకుంటోంది. పవన్, రానాల సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి సంయుక్త అదే ఊపులో క్రేజీ స్టార్లతో కలిసి నటిస్తూ వరుస విజయాల్ని తన ఖాతాలో వేసుకుంటూ ఇండస్ట్రీ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం తెలుగులో నిఖిల్ హీరోగా రామ్ చరణ్ తన స్నేహితుడితో కలిసి నిర్మిస్తున్న పాన్ ఇండియా మూవీ ,స్వయంభు,తో పాటు నందమూరి నటసింహం బాలకృష్ణ నటిస్తున్న భారీ ఎమోషనల్ యాక్షన్ డ్రామా ,అఖండ2,లోనూ నటిస్తోంది. బోయపాటి శ్రీను డైరెక్ట్



చేస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఇదిలా ఉంటే తాజాగా మరో పాన్ ఇండియా మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. అదే పూరి జగన్నాథ్ ఫిల్మ్. ఈ ప్రాజెక్ట్‌తో సంయుక్త ఖాతాలో మొత్తం ఏడు సినిమాలు వచ్చి చేరాయి. ప్రస్తుతం తను బ్యాక్ టు బ్యాక్ 7 క్రేజీ ప్రాజెక్ట్స్‌లలో నటిస్తూ బిజీగా ఉంది. ఇదే ఏడాది కాజోల్‌తో నటిస్తున్న ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ ,మహారాగ్ని:క్వీన్ ఆఫ్ క్వీన్స్,తో బాలీవుడ్ బాటపడుతోంది. ఇక తెలుగులో శర్వానంద్ హీరోగా రూపొందుతున్న ,నారీ నారీ నడుమ మురారీ,లోనూ నటిస్తోంది. సంయుక్త నటిస్తున్న మరో తెలుగు సినిమా ,హైందవ,. బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఈ మూవీని తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. మలయాళంలో మోహన్‌లాల్‌తో ,రామ్,లోనూ నటిస్తోంది సంయుక్త. దీని షూటింగ్ ఆగిపోయింది. తిరిగి త్వరలో ప్రారంభం కానుంది. ఇక వీటితో పాటు ఇదే ఏడాది లోకేష్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్‌లోకి అడుగుపెడుతోంది. రాఘవలారెన్స్ హీరోగా భాగ్యరాజ్ కన్నన్‌తో లోకేష్ కనగరాజ్ ,బెంజ్, మూవీని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో లారెన్స్‌కు జోడీగా సంయుక్త నటిస్తోంది. ఇలా వరుసగా 7 క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఈ ఏడాది సంయుక్త డైరీ ఫుల్ కావడంతో ఆమె ప్లానింగ్ మామూలుగా లేదుగా అని ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు.

## యాక్టింగ్ - డైరెక్షన్... ధనుష్‌కి ఏది ఇష్టం?

ఈతరం హీరోలు ఏడాదికి ఒక్క సినిమా సినిమాతో రావడం గగనంగా మారింది. ముఖ్యంగా స్టార్ హీరోలు ఏడాదిలో కనీసం ఒక్క సినిమాను విడుదల చేయలేక పోతున్నారు. అంత టైం తీసుకుని చేసిన సినిమాలు ఏమైనా సూపర్ హిట్ అవుతున్నాయా అంటే.. అదీ లేదు. సక్సెస్ రేటు కంటే ఫ్లాప్ రేటు ఎక్కువగా ఉంది. కానీ ఇతర హీరోలతో పోల్చితే ధనుష్ చాలా విభిన్నం. ఆయన ఏడాదికి రెండు సినిమాలకు తగ్గకుండా చేస్తున్నాడు. ఆయన నుంచి వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకుంటున్నాయి. హీరోగా నటించడం మాత్రమే కాకుండా దర్శకత్వం వహించడం ద్వారా హీరోల్లో తాను డిఫరెంట్ అని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటున్నాడు. హీరోగా వరుస సినిమాలు చేస్తున్న ధనుష్ దర్శకత్వంపై మక్కువతో వరుస సినిమాలు చేస్తున్నాడు. ఈ ఏడాది ఆరంభంలో ధనుష్ దర్శకత్వంలో రూపొందిన 'నిలవకు ఎన్ మెల్ ఎన్నడి కోబం' సినిమా విడుదలైంది. దర్శకుడిగా ధనుష్ ఇడ్లీ కడై అనే సినిమాను ప్రస్తుతం చేస్తున్నాడు. ఆ సినిమాలో తానే హీరోగా



నటిస్తున్నాడు. ఇక శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన కుబేర సినిమాతో ఈ వారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. జూన్ 20న విడుదల కాబోతున్న కుబేర సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ధనుష్ తెలుగు, తమిళ మీడియాతో ముచ్చటించాడు. ఆ సమయంలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. ధనుష్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... తనకు హీరోగా నటించడం కంటే దర్శకుడిగా సినిమాలు చేయడం ఎక్కువ ఇష్టం అన్నాడు. తెర మీద కనిపించడం కంటే, కెమెరా వెనుక ఉండి సినిమాను రూపొందించడం ఇష్టం అన్నాడు. యాక్టింగ్, డైరెక్షన్‌లో ఒక్కటి ఎంపిక చేసుకోమన్నప్పుడు ధనుష్ పై విధంగా స్పందించాడు. దర్శకుడిగా సినిమాలు చేయాలని ఉన్నప్పటికీ తన అభిమానుల కోసం నటిస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. ముందు ముందు కూడా యాక్టింగ్ కొనసాగిస్తాను అన్నాడు.

అయితే వీలును బట్టి దర్శకత్వం వహిస్తాను అంటూ చెప్పుకొచ్చాడు. రెగ్యులర్‌గా తన దర్శకత్వంలో వస్తాయని అభిమానులకు హామీ ఇచ్చాడు. హీరోగా ధనుష్ చేసే సినిమాలకు తమిళనాడుతో పాటు, తెలుగు రాష్ట్రాల్లో అభిమానులు ఉన్నారు. అందుకే తమిళనాడుతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ ధనుష్ సినిమాలు ఈ మధ్య కాలంలో అత్యధిక స్క్రీన్స్‌లో విడుదల అవుతున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536